# ఆంధ్రజ్యోతి

......సచిత్ర మాస పత్రిక......

## దీపావళి సంచిక

సంపుటి 14 ] నవంబర్ 1950 [ సంచిక 5


ఈ దీపావళి శుభసమయాన

పాఠకులకు - రచయితలకు - అభిమానులకు

## ఆంధ్రజ్యోతి

అభినందనములు



# కల్లోల ప్రపంచం

నార్ల

చిన్నచిన్న మబ్బులెన్నో కూడాలి, ఆకాశాన్ని దట్టంగా కమ్మివెయ్యాలి. ముందు కొంతసేపు తెరతెరలాడించాలి, తర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడాలి. సన్న తుపరో, దబాటు వానకులో ప్రారంభం కావాలి, తర్వాత కుండపోతపొయ్యాలి, అది మునురుగా మారాలి. ఇందుకు కొంచెం ముందో, వెనకో సన్నసన్నగా గాలి తేలాలి. అది అంతకంతకు పెద్దదై ఈదురుగాలి కావాలి. రానురాను మునురుపాకానపడి ఇళ్ళపై పెంకులను లేవగొట్ట నారంభించాలి — అప్పటికికాని అనుకోము తుపాను ప్రారంభమైందని. కాని, నిజానికి తుపాను ప్రారంభం పెంకులు గాలిపటాలుగా మారే ఘట్టంలో కాదు; మబ్బులు కూడుకునేఘట్టంలోనే. అయితే, మబ్బుపట్టిన ప్రతిసారీ వానకురవదు; కురిసిన ప్రతివానా మునురుగా మారదు; మునురుపట్టిన ప్రతిపర్యాయం తుపాను రాకపోవచ్చు. ఇందువల్లనే తీరా తుపాను విరుచుకు పడిన తర్వాత కాని, దానిలో చిక్కుకున్నట్లు మనం కానలేము.

తుపాను విషయమై ఇక్కడ ఇంతగా ప్రస్తావించడం దానికి యుద్ధంతో, విశేషించి ప్రపంచ యుద్ధంతో, చాలాసామ్యం కలదు కనుకనే. దానివలె దీనికికూడా ఎన్నో కారణాలు, మరెన్నో శక్తులు ఒనగూడాలి. దానివలె దీన్నికూడా తీరా విరుచుకుపడేవరకు కానలేము. ఇందుకు ఉదాహరణంగా పోయిన ప్రపంచ యుద్ధాన్నే చూడండి; ఇది 1939 సెప్టెంబర్ 1 వ తేదీనాడు ప్రారంభమైనట్లు చెప్పబడుతుంది. చరిత్రలలో "1939 సెప్టెంబర్ 1 వ తేదీని తెల్లవారుజామున యుద్ధప్రకటన లాంఛనమైనా లేకుండా పోలెండ్‌పై హిట్లర్ దండయాత్రను ప్రారంభించడంతో ద్వితీయ ప్రపంచ మహాసంగ్రామం ప్రారంభమైంది" అని అప్పుడే నమోదైపోయింది. కాని, వాస్తవానికి ఆ యుద్ధం హిట్లర్ ఇంకా పదవిలోకి రాకపూర్వమే ప్రారంభమైంది.

అతడు జర్మనీకి ఛాన్సలర్ అయింది 1933 జనవరి 30 వ తేదీని. ఆనాటికి దాదాపు ఒకటిన్నర సంవత్సరాలకు ముందు—1931 సెప్టెంబర్ 18 వ తేదీన—మంచూరియాపై జపాన్ దండయాత్రను మొదలుపెట్టింది. జపాన్ దురాక్రమణచర్యరూపంలో 1931 లోనే దూరప్రాచ్యాన పట్టిన ఈ చిన్న మబ్బే ఇతర చిన్నచిన్న మబ్బులతో కలిసి, కొన్నిచోట్ల కొద్దికొద్దిగాను, మరికొన్నిచోట్ల విశేషంగాను వర్షించి, 1938 నాటికి మునురుగామారి, 1939 సెప్టెంబర్‌లో పోలెండ్ సరిహద్దులపై తుపానురూపాన్ని ధరించి, అయిదారేళ్ళపాటు ప్రపంచం మొత్తాన్నే ఊపివేసింది.

మంచూరియాపై 1931 లో జపానువారి ముట్టడి మొట్టమొదటి చిన్న మబ్బుకాగా 1932 లో షాంఘైపై తుపాకుల చైనా, జపానులమధ్య పొసగిన భీషణ పోరు సంఘర్షణ రెండవమబ్బు. 1933 లోనే నానాజాతిసమితినుంచి జపాన్ లేచిపోవడం మూడవ మబ్బు. యుద్ధం, రక్తపాతం లేకపోయినా, మొదటి రెండింటికంటె ఇదే పెద్ద మబ్బు. వాటికంటె చాలా నల్లనిదికూడా. పోతే, నాల్గవమబ్బు 1933 లోనే జెహోల్‌పై జపాన్‌వారి దండయాత్ర, ఆ రాష్ట్రం ఆక్రమణ. అయిదవమబ్బు జర్మనీ ఆయుధాలను, సైన్యాలను తిరిగి సమాయత్తపరచుకోంటున్నదని 1935 లో హిట్లర్ బహిరంగంగా ప్రకటించడం. ఆతర్వాత ఒక పెద్దబిల్లు పడింది అదే — 1935 లో అబిసీనియాపై ముసోలినీ జరిపిన దండయాత్ర. ఆ బిల్లు ఇంకా పడుతుండగానే, జర్మనీ దిక్కునుంచి మరికొన్ని మబ్బులు వచ్చి చేరినవి. 1925 లో జర్మనీ స్వచ్ఛందంగా చేసుకున్న లొకార్నో సంధిని హిట్లరు రద్దుచేయడం, వర్సెయిల్సు సంధికి వ్యతిరేకంగా రైన్‌లెండ్‌లోకి నాజీసైన్యాలు ప్రవేశించడం, ముందు జర్మనీ, ఇటలీలమధ్య, తర్వాత జర్మనీ, ఇటలీ జపానులమధ్య పరస్పర సైనిక సహాయసంధులు జరగడం — మరికొన్ని మబ్బులుగా పేర్కొనదగినవాటిలో ముఖ్యమైనవే. ఆపైన స్పెయిన్‌లో హిట్లర్, ముసోలినీలు ప్రోత్సహించిన అంతర్యుద్ధరూపంలో ఒకటి రెండు చినుకులు దబాయించే కొట్టింది. 1937 లో చైనా, జపానులమధ్య ప్రారంభమైన [illegible] తుంపర ప్రారంభమైంది. 1938 లో హిట్లర్ ఆస్ట్రియాను, చెకొస్లోవేకియాలో కొంతభాగాన్ని కబళించడంతో ముసురుపట్టింది. ఈ ముసురు ముదరడానికి 1939 [illegible] ముసో[illegible] ఆల్బేనియా, స్వాహాచెయ్యడమేమి, ఇది జరిగిన కొద్దిరోజులకే [illegible] చెకోస్లోవేకియాను కాలరాచివెయ్యడమేమి తోడ్పడ్డాయి. ముసురు ఇంతగా ముంచుకువచ్చి [illegible] తుపాను తప్పదు కనుకనే, అది 1939 సెప్టెంబర్ 1 వ తేదీ తెల్లవారుజామున పోలెండ్ సరిహద్దులపై ప్రారంభమైంది.

ఈ వాతకథను ఇక్కడింతగా త్రవ్వడం ప్రస్తుత పరిస్థితులను అర్థంచేసుకోడానికి ఇది సహాయకారి కాగలదు కనుకనే. చరిత్రలో చర్వితచర్వణం తప్పదంటారు. ఎప్పటిచరిత్ర అప్పుడే పరగడుపు కావడంవల్లనే ఇలా జరుగుతుందేమో! ఏమైనా, గతయుద్ధం ఏయే పరిస్థితులలో పొసగిందో ఒకసారి జ్ఞాపకం తెచ్చుకోనిదే, ఈనాడు తిరిగి మరొక యుద్ధందిశకు మనం ఏవిధంగా పురోగమిస్తున్నదీ బోధంకాదు.

* * *

మొదటి ప్రపంచయుద్ధం తుపాను 1918 లో నిలిచిపోగా, రెండవదానికి 1931 లో కాలమేఘం కూడుకున్నది. ఈ రెండు సంఘటనలకుమధ్య కనీసం పదమూడు సంవత్సరాలైనా విరామం వున్నదికాని, రెండవ ప్రపంచయుద్ధం ఇంకా పూర్తికాకముందే మూడవదాని మబ్బులు అలముకోనారంభించాయి. నిజానికి హిరోషిమాపై ప్రయోగించబడిన యాటంబాంబు పేలగనే మూడవ ప్రపంచయుద్ధపు మేఘాలైనవని చెప్పవచ్చు!

1945 లో పాట్స్‌డాంలో జరిగిన అగ్రనాయకత్రయ సమావేశ సందర్భంలో మార్షల్ స్టాలిన్‌తో ముచ్చటిస్తూ, తాము అపూర్వమైన ఒక మారణాయుధాన్ని కనుగొన్నామనీ, దాన్ని త్వరలో జపాన్‌పై ప్రయోగించనున్నామనీ, ఆ చర్య ఫలితంగా యుద్ధం అతిత్వరలో ముగిసిపోగలదని తాము విశ్వసిస్తున్నామనీ ప్రెసిడెంట్ ట్రూమన్ చెప్పారట. అందుపై స్టాలిన్ యుద్ధం త్వరగా ముగిసిపోవడంకంటె కోరదగింది మరి వుండదనీ, అమెరికా తన కొత్త మారణాయుధాన్ని జపాన్‌పై ప్రయోగించవలసిందేననీ అన్నాడట. ఈ సంభాషణ ప్రసక్తిని తెచ్చి, ఇప్పుడు కొందరు అమెరికనులు "ఆనాడు యాటంబాంబు ప్రయోగం ఎంతత్వరగా జరిగితే అంత మంచిదని చెప్పిన స్టాలినే ఈనాడు దాన్ని బహిష్కరించాలని ఎందుకు పట్టుదలచూపుతున్నాడు?" అని ప్రశ్నిస్తున్నారు. ఇందుకు కారణాన్ని ఊహించుకొనడం నిష్పాక్షికులైనవారికి కష్టంకాదు.

ఏదో అపూర్వమైన మారణాయుధాన్ని తాము కనిపెట్టినట్టు ట్రూమన్ చెప్పినా, హిరోషిమాపై ఒక్క బాంబు పడినంతనే అక్కడజరిగిన ఘోర విధ్వంసనను గురించి తనకు నివేదికలు చేరినతర్వాతగాని, ఆ నూతనాయుధం ఎంతటి మహానగరాలనైనా తుడిచిపెట్టగలిగిందనీ, అసలు మానవచరిత్రలోనే ఒక నవఘట్టాన్ని ప్రవేశపెట్టిందనీ స్టాలిన్ గ్రహించి వుండరు. ఈ విషయాలనుగురించి ఇంకా సందేహాలేవైనావుంటే, నాగాసకీనుంచి వచ్చిన నివేదికలు వాటిని పూర్తిగా తొలగించివేసివుంటాయి. తక్షణం ఆయన గుండెలో కొంత బెదురు ప్రవేశించి వుంటుంది.

"యుద్ధాన్ని త్వరలో ముగించివేయగల నూతన మారణాయుధాన్ని తాము కనిపెట్టినట్టు అమెరికా ప్రెసిడెంట్ చెప్పగా, అయితే దాన్ని వెంటనే జపానుపై ప్రయోగించండని అన్నానుగాని, కోరితే దీనితో అమెరికా మనలనైనా ముగించివేయగలదు సుమీ!" అని వెంటనే స్టాలిన్‌కు తోచివుంటుంది. ఈనాడు తమ సమాన శత్రువైన జపానుపై ప్రయోగింపబడిన ఘోర మారణాయుధం రేపు తమపైనే ప్రయోగించబడే ప్రమాదం కలదనుకొనడం, ఒక మిత్రరాజ్యాన్ని నీచంగా సంకోచించడం కాగలదంటే, తమ మైత్రిని గౌరవించి, ఆ మారణాయుధ నిర్మాణ రహస్యాన్ని తమకుకూడా చెప్పవలదా? ఇట్టి ధోరణిలో స్టాలిన్ ఆలోచనలు జరిగివుండడం సహజం కనుకనే యాటంబాంబును ఏవిధంగా తయారుచేస్తారో తమకుకూడా చెప్పవలసిందిగా సోవియెట్ యూనియన్ అమెరికాను కోరింది. ఆ రహస్యాన్ని కేవలం రష్యాకేకాక, యాటంబాంబు నిర్మాణంలో తొలి పరిశోధనలు జరపడమేకాక, చివరివరకు సహకారాన్ని నెరపిన బ్రిటన్‌కుకూడా చెప్పడానికి అమెరికా నిరాకరించింది.

ఈ నిరాకరణ తర్వాత [illegible] భయంకరమైన మారణాయుధమొకటి కేవలం తమచేతిలోనే వున్నందున, దాని ఆధారంతో ప్రపంచాధినేతలు కావాలని అమెరికనులు నిశ్చయించుకున్నారన్న తీర్మానానికి మార్షల్ స్టాలిన్ రావడంలో తప్పేమున్నది? అమెరికాతో తమ సంబంధబాంధవ్యాలనుగురించి ఆయనకు దురభిప్రాయములేవు. తమ ఆర్థిక, సాంఘిక, రాజకీయా

వ్యవస్థలు తూర్పు, పడమరలను పోలినవి. తమ సోవియెట్ ప్రభుత్వాన్ని ప్రపంచ రాజ్యాలన్నింటికీ ఆలస్యంగా గుర్తించినట్టిది అమెరికాయే కావడం అకారణంగా జరగలేదు. సోవియెట్ మనుగడ ఎన్నటికైనా తమకు పక్కలో బల్లెమే కాగలదని అమెరికా పరిపాలకుల ప్రగాఢ విశ్వాసం. అయినా, హిట్లర్‌పై యుద్ధంలో రష్యా, అమెరికాలమధ్య సన్నిహిత సహకారం నెలకొన్నదంటే, ఉభయులకు ప్రాణాంతకమైనదిగా తోచిన ప్రమాదం నాజీ జర్మనిద్వారా సంఘటించినందువల్లనే. ఆ ప్రమాదం తొలగినంతనే రష్యా, అమెరికాల పూర్వ వైరుధ్యాలు తిరిగి తలయెత్తవన్న హామీ యేమిటి? అసలు హిట్లర్‌పై యుద్ధంలోనే అతనిపై పశ్చిమాన్నుంచి తాను ప్రారంభించవలసిన ముట్టడివిషయ్యంలో చూపవలసిన తొందరపాటును అమెరికా చూపలేదు. జర్మనీ, రష్యాలమధ్యనే యుద్ధం ఎంత హెచ్చుగా సాగి, ఆ ఉభయ దేశస్థులు ఎంత హెచ్చుగా నాశనమైతే, మనకు అంతపీడ తగ్గుతుందని బహిరంగంగా చెప్పిన అమెరికనులు కొందరున్నారు. ఇంతజరిగినా, మార్షల్ స్టాలిన్ "కమ్యూనిస్టు, కాపిటలిస్టు వ్యవస్థలు ఒకదాని సరసను మరొకటి శాంతియుతంగా జీవించవచ్చునని నేను విశ్వసిస్తున్నాను" అని చెప్పివుండవచ్చు ననుకోండి. అయితే, ఆ మాటచెప్పడం ఆ ఉభయవ్యవస్థల సాయుధబలం ఇంచుమించు పరిసమానంగా వుండగలవన్న అంచనాపైనే. ఇప్పుడు యాటంబాంబు ఒకపక్షం చేతిలోనేవుంటే, ఈ అంచనా గడ్డిపోచపాటికూడా చెయ్యదు. అయితే, మరి అమెరికా ప్రపంచాధిపత్యాన్ని అంగీకరించడమా? ఏమైనాసరే ఇది జరగరాదంటే, కర్తవ్యమేమిటి? తామూకూడా యాటంబాంబును కనిపెట్టడమే కర్తవ్యమని సుస్పష్టమే. కాని, అది కోరినంతనే జరగగలపనికాదు. అందుకు పది సంవత్సరాలైనా రష్యా పరిశోధనలు జరపవలసి వస్తుందని అమెరికనులే అంటున్నారు. ఇంతకాలం పట్టకపోయినా, ఏ రెండు, మూడు సంవత్సరాలైనా పట్టవచ్చు. ఈలోపుగానే అమెరికా చిక్కునపెడితే ఏవిధంగా సమర్థించుకురావాలి?—ఇట్టి ఆలోచనలెన్నో మార్షల్ స్టాలిన్‌కు కలగడానికి ద్వితీయ ప్రపంచమహా సంగ్రామం సమాప్తిచెందడానికి కొంచెంపూర్వం హిరోషిమాపైపడిన యాటంబాంబు దారితీసింది. ఇందువల్లనే రెండవ ప్రపంచయుద్ధం పూర్తికాకముందే మూడవదాని మబ్బులు అలముకొన నారంభించినవనడం సత్యవిదూరం కానేరదు.

* * *

తమవద్దే యాటంబాంబులున్నవికదా అని, వాటిని రష్యాపై విసిరి, దాన్ని సర్వనాశనంచేసి తీరాలన్న ఆలోచన అమెరికాకు వుండకపోవచ్చు. ఒకవేళ అట్టి ఆలోచనవున్నా, అది తేలికగా నెరవేరేదికాకపోవచ్చు. యాటంబాంబు ఎంత శక్తివంతమైనదైనా, దాన్ని త్వరగాగాని, ఎక్కువగాగాని తయారుచేయ్యడానికి వీలులేదు. ఒక్కొక్క యాటంబాంబు ఏ పది, పదిహేను చదరపుమైళ్ళనో చదునుచేసివేస్తుందనడం నిజమైనా, లక్షలాది చదరపుమైళ్ళువుంటే ఒకదేశాన్ని దానితో సర్వనాశనంచేయడం పొసగదు. ఎంతటి ఘోరమైన ఆయుధాలను

ఆకాశంనుంచి ప్రయోగించినా, చివరికి పరరాజ్యంపై పతాకను ప్రతిష్ఠాపించాలంటే భూతల సైన్యాలు దానిలోకి నడిచితీరాలి. ఈ సైన్యాలకు సంబంధించినంతవరకు సోవియెట్ యూనియన్ మహా శక్తివంతమైందే. ఇట్టికారణాలన్నీకాక, కేవలం ప్రపంచాధిపత్యాన్ని గోరి, ఏదైనా రాజ్యం యుద్ధానికిదిగడం జరిగినట్టు లోకం భావించడమే తటస్థిస్తే, ప్రపంచమే యెదురౌతుంది. ధర్మం మనపక్షానవున్నట్టు నటించడానికైనా వీలులేని పరిస్థితిలో యుద్ధానికి సిద్ధపడితే, ఆదిలో ఎన్ని విజయాలు పొందినా, చివరికి పరాజయం తప్పదు. ఈ విషయాలన్నీ అమెరికాకు తెలియనివికావు. పైగా, అమెరికా పరిపాలకవర్గాలవారు ఎంతప్రబలులైనా, తమ దేశం ప్రజాబాహుళ్యాన్ని తమతో కలుపుకుని నడవాలి. లేకపోతే, యుద్ధానికిదిగడం వారి అబ్బుతరమైనాకాదు. ఈ అన్నింటి దృష్ట్యా యాటంబాంబులను పట్టుకుపోయి, రష్యాపై గ్రుమ్మరించిరావాలన్న ఆలోచనలో అమెరికా పడిందనడం మతిలేని మాటే కాగలదు.

అయితే, రష్యాచేతిలోలేని ఆయుధం తనచేతిలోవున్నందువ దాన్ని రష్యాతో నడిపే ప్రతి వ్యవహారంలో పేకాటలో తురుపుఆసును ఉపయోగించినట్టు వినియోగించుకోడానికి అమెరికా ఆలోచించినదనడం మాత్రం వాస్తవం. ఈ పరిస్థితిలో రష్యా చేతులుముడుచుకుని కూర్చోలేదు గదా? అందువల్ల అది తనచేతిలోని మరొక తురుపుముక్కను—ఆసు కాకపోయినా, అదే రాజుపాటిచేసేదే—తాను ప్రయోగించనారంభించింది. రష్యాచేతిలోని ఆ తురుపు ముక్క,—ఆంతరంగిక విప్లవం.

దేశదేశాలలో (చివరికి అమెరికాలోకూడా) కమ్యూనిస్టులున్నారు. వారందరికీ మాస్కోయే మక్కా. అక్కడినుంచి కనుసన్న జరిగితే, అది తమ దేశానికి మంచికానివ్వండి, చెడ్డకానివ్వండి దానిప్రకారం మెలగవలసిందే. ఇంతగా తన చెప్పుచేతలలో మెలగే కమ్యూనిస్టులను ఉపయోగించుకుని, రష్యా తనచుట్టుపక్కలదేశాలు పెక్కింటిలో ఆంతరంగిక విప్లవాలను ప్రజ్వలింపచేయించింది. వీటిలో పెక్కుదేశాలు అప్పటికింకను తమ రెడ్ఆర్మీ ఆక్రమణలోనేవున్నందున, అక్కడి విప్లవాలతో తనకు ప్రత్యక్షసంబంధంలేనట్టు నటిస్తూనే సర్వసహాయాన్నీ చేయడంకూడా సుసాధ్యమైంది. చేతిలోనిది తురుపుఆసు కాకపోయినా, వున్నదాన్నే ఈ విధంగా మెలుకువగా ప్రయోగించడంవల్ల తూర్పుయూరప్ యావత్తూ గుప్పిటిలో వచ్చివేసింది.

గొడ్డలివంటి తురుపుఆసు తనచేతిలో వుండికూడా దాన్ని తాము వాడుక చేసుకోలేకపోవడం, తక్కువముక్కతోనే రష్యా ఆటను గెలుచుకుపోవడం అమెరికా గుడ్లు అప్పగించి చూస్తూవుండిపోగల విషయమేనా? అందువల్ల అది తన చేతిలోని మరొక తురుపును అడ్డం వేసింది. దానిపేరు,—డాలర్. ఆర్థికవ్యవస్థ శిథిలమైపోతున్నచోటతప్ప కమ్యూనిజం తేలికగా అల్లుకుపోలేదు. కమ్యూనిజంలోవున్న ఈ బలహీనాన్ని ఆధారంగాచేసుకుని పశ్చిమ, ఉత్తర, దక్షిణయూరప్‌లకు ఆదేవనిగా అమెరికా డాలర్లను గుప్పడం ప్రారంభించింది. కేవలం యూరప్‌ఖండంపైన ఆగక, రష్యా సరిహద్దులలోని టర్కీ, పర్షియాలపైకూడా

డాలర్లవర్షం కురిపించబడింది. అంతటితో ఈ ప్రాంతాలన్నింటికీ సంబంధించినంతవరకు రష్యా ఆటకట్టింది.

కమ్యూనిజం ప్రాకిపోవడానికి యూరప్‌లోకంటె వెయ్యిరెట్లు ఎక్కువగా ఆసియాలో అవకాశాలున్నాయి. అందువల్ల ఆసియాలో రష్యా ఆటకట్టించడం అమెరికాకు అంత సులభంకాలేదు. జరగడానికి మార్షల్ చాంగ్ కైషేక్‌కు విశేషంగానే సహాయంజరిగింది. అతనిచేతిలో ఇంచుమించు రెండువేలకోట్ల డాలర్లు పెట్టబడినవి. అయినా, అతడు తలతిక్కవాడైనందున, అతడి పక్షంవారు బద్మాషులైనందున, అంతడబ్బూ చెరువులో పారబోసి చేతులు కడుక్కున్నట్టే అయింది. పైగా, చాంగ్ పరాజయ పరాభవాన్ని అతడిని సమర్థించిన పాపానికి తాముకూడా కొంత పంచుకోవలసివచ్చింది.

* * *

ఎత్తు, పైయెత్తులలో రష్యా, అమెరికాలు ఈ ఘట్టానికి చేరుకొంటుండగా మరొక ముఖ్య సంఘటన జరిగింది. అది—యాటంబాంబునిర్మాణపద్ధతిని రష్యాకూడా కనిపెట్టడం. ఈపని ఎప్పుడైతే జరిగిందో అప్పుడు యాటంబాంబు తలదన్నగల మరొకబాంబుకోసం—హైడ్రోజన్ బాంబుకోసం—అమెరికా పరిశోధనలను ప్రారంభించవలసివచ్చింది. అయితే, అమెరికాకు స్వల్పమైన ఒక అనుకూల్యంమాత్రం మిగలనేమిగిలింది. యాటంబాంబును ఎలాచెయ్యాలో రష్యాకు తెలిసినా, ఇప్పుడిప్పుడు మాత్రమే తెలిసింది. అందువల్ల ఏఆయిదో, పదో బాంబులనుమాత్రమే అది ఈనాటికి చేసుకొనగలిగివుంటుంది. ఇక, తనవద్ద అంతకు చాలా రెట్లు ఇప్పటికేవున్నాయి. అందువల్ల తనకు హైడ్రోజన్‌బాంబు లభ్యంకావడం, కాకపోవడం ఎలావున్నా, కనీసం మరికొంతకాలంవరకు యాటంబాంబుల సంఖ్యలో తనదే పైచెయ్యిగా వుంటుంది. ఈకాలంలోనే రష్యాపై ఒక దెబ్బతియ్యడం తప్పకపోతే దాన్ని తియ్యనేవచ్చు. ఇది కాదంటారా, ఈ విరామాన్ని భూతలసైన్యాలలో ప్రస్తుతం రష్యాకున్న ప్రాబల్యాన్ని హరించడానికి వినియోగించుకోవచ్చు.

యాటంబాంబులు కేవలం తనకే వున్నంతవరకు ఆకాశంనుంచి జయించుకుపోతూ, భూభాగాలను వెనకనుంచి ఆక్రమించుకొనడంవరకే తన భూతలసైన్యాల ప్రయోజనం. యాటంబాంబులలో తాము ఇప్పుడు కాకపోతే, మరి కొద్దికాలానికైనా సమాన ఉజ్జీలుకావడం తటస్థించవచ్చు కనుక, ఇప్పుడిక భూతలసైన్యంలో రష్యా ప్రాబల్యాన్ని నిర్లక్ష్యం చెయ్యడానికి వీలుకాదు.

ఇట్టి పరిస్థితి ఏర్పడినందునే ఇటీవల అమెరికా పశ్చిమ యూరోప్ సైన్యనిర్మాణానికి నిశ్చయించింది. అంతరంగిక శాంతి, భద్రతల రక్షణకై పోలీసుదళం నిర్మాణం పేరుతో పశ్చిమ జర్మనీలో తిరిగి సైన్యాలను సమకూర్చడానికి ఆలోచిస్తున్నది. ఆయుధోత్పత్తి కూడదని ఇదివరలో పశ్చిమ జర్మనీపై విధించిన ఆంక్షలను కొన్నింటిని కొంతవరకు సడలించింది. దూరప్రాచ్యంలో జపానుపట్ల కూడా ఇదే విధానాలను అవలంబించబోతున్నది.

ఇవన్నీకూడా మూడవ ప్రపంచయుద్ధం తుపానుకు మన మెంతదగ్గిరలోవున్నామో చెప్పకనే చెబుతున్నవి.

* * *

ప్రపంచం అదృష్టం బాగుంది. చివరి కొకవేళ తేలిపోయినా—ప్రస్తుతంమాత్రం అట్టి ఆశ, పెట్టుకోడానికైనా ఆస్కారం కనబడ్డంలేదు—తుపానుకు ముందు ఘట్టంలోనే ఇప్పుడు మనం వున్నామనడానికి కొరియా, ఇండో చైనా, టిబెట్‌లలోని ప్రస్తుత పరిణామాలే సాక్ష్యం.

తాను ప్రత్యక్షంగా జోక్యం కలగజేసుకోకుండా తనపక్షాన్ని గెలిపించి, అమెరికాపై దెబ్బతీయడమనే తన పథకం చైనాలో పారేసరికి, దాన్ని కొరియాలోకూడా ప్రయోగించాలని రష్యా చూచిందో, లేక, చైనాలో పొందిన పరాభవానికి కొరియాలో కసితీర్చుకోవాలని అమెరికా చూచిందో, లేక, ఈ రెండు కారణాలుకూడా కలిసివచ్చినవో ఖచ్చితంగా చెప్పలేముగాని, ఆ దేశంలో హఠాత్తుగా యుద్ధం ప్రారంభమైంది. ఆ యుద్ధంలో దూకడంలో అమెరికా చూపిన దూకుడునుబట్టి, చైనాలో తిన్నదెబ్బకు ఎదురుదెబ్బ తీయాలని అదే తొందరపాటు చూపినట్టు శంకించవలసివస్తున్నది. ముందు తనకుతానై యుద్ధంలో దక్షిణ కొరియాపక్షాన నిలిచి, ఆ పిదప (ప్రస్తుతం తన పలుకునే శాసనంగా పాలిస్తున్న మిత్రరాజ్య సమితిచే) అమెరికా తన చర్యపై ఆమోదముద్రను వేయించుకున్నది. "ఈ జానెడు బెత్తెడ దేశంలో, ఈ పొట్టిబుడంకాయలమీద యుద్ధం నాకు నల్లేరుపై బండినడక" అనే అహంకారంతో రణరంగంలో నిలిచినప్పటికీ, ముందు కొన్నివారాలపాటు దావుతప్పి కన్ను లొట్టపోయిన స్థితిలోపడిపోయి, లోకంచేత అమెరికా నవ్వించుకున్నది. కాని, అపారభాగ్యవంతమైన మహాదేశం కనుక, ఇతర మిత్రదేశాలుకూడా కొంతవరకు సహాయాన్ని ఉరికించినం కనుక, ఎదురుముట్టడులను ప్రారంభించి, పరాజయాన్ని విజయంగా మార్చుకోగలిగింది.

అయితే, మొదట చెప్పినట్టు ఉత్తరకొరియనులను 38-వ అక్షాంశరేఖ ఉత్తరానికి తరిమివెయ్యడంతో అమెరికా ఆగలేదు. తన అభిమతంపై మిత్రరాజ్యసమితి రబ్బర్ స్టాంపున మళ్లీ వేయించి, సోవియెట్ రష్యా, కమ్యూనిస్ట్ చైనాల సరిహద్దులవరకు పురోగమించింది. ఇందువల్ల ఉభయపక్షాలకు సంఘర్షణలు పొసగగల అవకాశాలు అనంతంగా ఏర్పడుతున్నాయి. రష్యన్ సరిహద్దులను అధిగమించివెళ్లి బాంబులను వెయ్యడం, రష్యా ఆక్షేపించడం, పొరపాటు జరిగిందని తాను క్షమాపణ చెప్పుకోవడం అప్పుడే ఒకసారి సంభవించింది. మంచూరియాపైకూడా విమానదాడులు జరిగినట్టు—జరుగుతున్నట్టు—పెకింగ్ ప్రభుత్వం ఆరోపిస్తున్నదికూడా. ఈ ఆరోపణలలో కొన్ని నిజమని అమెరికా ఒప్పుకొనడం, మరి కొన్నింటిని కాదనడం, నిజానిజాల నిర్ణయానికి ఏమి చెయ్యాలన్న విషయమై మిత్రరాజ్య సమితిలో ప్రతిష్టంభన యేర్పడ్డం, చివరికి నేడు (అక్టోబర్ 30-వ తేదీని) "ఈసారి మా సరిహద్దులపైకి అమెరికన్ విమానాలువస్తే, సహించేదిలేదు" అని పెకింగ్ హెచ్చరించడం—ఇంత కర్మకాండ జరిగింది. దీన్నిబట్టే మంచూరియా రష్యా సరిహద్దులవరకు కొరియాలో

పురోగమించడానికి అమెరికా నిర్ణయించడం మందుగుండు పాతరవద్ద నిప్పుతో ఆటలాడ్డంతో సమానమనడంలో ఎంత సామంజస్యం కలదో స్పష్టపడుతున్నది.

కొరియాయుద్ధం ఇంకా పూర్తికాకముందే ఇండో-చైనాపై అమెరికా దృష్టిని మరల్చింది. బ్రిటిష్‌దాస్యంనుంచి విముక్తికై మనం పోరాడినట్టే ఫ్రెంచి పారతంత్ర్యంనుంచి బయటపడ్డానికి పెక్కేళ్ళుగా ఇండో-చైనావారు పెనగులాడుతున్నారు. ఇండో-చైనా స్వాతంత్ర్యసమరానికి నాయకత్వంవహిస్తున్న హోచి-మిన్ కమ్యూనిస్టుకావచ్చు. కాని, ఆయన ఈనాడు సాగిస్తున్నది జాతీయసమరంకాని, కమ్యూనిస్టువిప్లవం కాదు. స్వదేశీయులలో ఆయనను సమర్థిస్తున్నవారిలో కమ్యూనిస్టులుకాని జాతీయవాదులు అనేకులున్నారు. అందువల్ల హోచి-మిన్‌పట్ల ఆసియా స్వాతంత్ర్యప్రియులందరికీ సానుభూతివున్నది. ఆసియా స్వాతంత్ర్యాన్ని—అంతేకాదు; మానవజాతి స్వాతంత్ర్యాన్నే—తాను బలపరచగోరుతున్నానని అమెరికా గొప్ప చెప్పుకొంటుంది. కాని, ఈనాడు అది ఇండో-చైనాలో చేస్తున్న పని కమ్యూనిజం వ్యాప్తిని అరికట్టడమనే సాకుతో ఫ్రెంచి యింపీరియలిజానికి ప్రాణంపొయ్యడం। ఎంత ఆర్భాటంగా అమెరికా తనవి మహత్తర లక్ష్యాలని ప్రకటనలుచేసినా, ఆచరణలో అది ప్రజాస్వాతంత్ర్య విరోధులకే పెట్టని కోటగా నిలుస్తున్నది. చైనాలో మార్షల్ చాంగ్ కై-షేక్ ఇట్టి ప్రజాస్వాతంత్ర్య విరోధి; కొరియాలో డాక్టర్ సింగ్మన్ రీ ఇట్టి ప్రజాస్వాతంత్ర్య విరోధి; ఇండో-చైనాలో మాజీ అన్నాంచక్రవర్తి బావోడై ఇట్టి ప్రజాస్వాతంత్ర్యవిరోధి. అయితే, మొదటియిద్దరికీ, మూడవవ్యక్తికీ కొద్దిభేదమొకటి వున్నది. మొదటివారిద్దరు అమెరికా చేతి కీలుబొమ్మలుకాగా, బావోడై ఫ్రెంచివారిచేతి కీలుబొమ్మ. ఇట్టివారిని "తగుదునమ్మా!" అని తాను వెనకవేసుకువస్తూ, తన విధానాలను ఇండియా ఎందుకు హర్షించలేకపోతున్నదని అమెరికా ఆశ్చర్యవిషాదాలను ప్రకటిస్తూవుంటుంది! ఇది పైకి ఆడే నాటకంకాకపోతే, పరమ మూర్ఖత్వమని చెప్పవలసివుంటుంది.

ఏమైనా, ఈనాడు ఇండో-చైనా ప్రజలపై యుద్ధాన్ని కొనసాగించే నిమిత్తం అమెరికానుంచి విరివిగా సహాయం అందించబడుతున్నది. ఆయుధాలను సరఫరా చెయ్యడంలో కొరియా రంగం తర్వాత ఇండో-చైనాకే అత్యధికప్రాధాన్య మివ్వబడుతున్నది. హోచి-మిన్ నాయకత్వాన వియత్‌మిన్ బలాలు కొనసాగిస్తున్న ముట్టడులకు తట్టుకోలేక, "పరిస్థితి ప్రమాదభరితం—అతివిషమం" అంటూ కొన్నిరోజులుగా ఫ్రెంచివారు ఆక్రందనాలను ప్రారంభించారు. వియత్‌మిన్ బలాలకు కమ్యూనిస్టు చైనానుంచి అనేకవిధాలుగా సహాయం లభిస్తున్నదని ఆరోపణలు చేస్తున్నారు. హోచి-మిన్ పక్షాన పోరాడ్డానికి చైనీస్ కమ్యూనిస్టు సేనలు వచ్చినవనో, రానున్నవనో అభాండాలు వేస్తున్నారు. హోచి-మిన్ కొనసాగిస్తున్నది జాతీయ స్వాతంత్ర్యసమరం కాదన్న దురభిప్రాయాన్ని కలిగించడానికే ఈ దుష్ప్రచారం. ఇలాగే మరికొంతకాలంపాటు దుష్ప్రచారం జరిగినతర్వాత, ఇండో-చైనాలో కమ్యూనిస్టు దురాక్రమణయత్నాన్ని నిరోధించకపోతే, ప్రపంచశాంతి భద్రతలకే ప్రమాదమని అమెరికా

తన సైన్యాలను అక్కడ దించినా దించవచ్చు. ఇప్పుడు ఇండో-చైనాను ఏవిధంగానైనా రక్షించకపోతే, బర్మా, థాయ్‌లెండ్, మలయా, ఇండొనేసియాలకే దెబ్బతప్పదని అప్పుడే కొన్ని అమెరికన్ పత్రికలు, కొందరు అమెరికన్ ప్రముఖులు తమ మామూలు పల్లవిని అందుకోవడం జరిగింది కూడా.

కొరియా, ఇండో-చైనాలలోని ఈ పరిణామాలతో టిబెట్‌పై చైనా దండయాత్రకు కొంత సన్నిహితసంబంధమే వున్నది. అటు కొరియాలో చైనా సరిహద్దులవరకు (మంచూరియా అంచులవరకు) తన సైన్యాలను నడపడానికే అమెరికా నిర్ణయించింది. ఇటు ఇండో-చైనాలో చైనా గుర్తించిన వియత్‌మిన్ ప్రభుత్వాన్ని పడగొట్టి, ఫ్రెంచివారిచేతి కీలుబొమ్మ వియత్‌నామ్ ప్రభుత్వాన్ని నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నది. ఫార్మోజాలో తిష్ఠవేసిన చాంగ్ కై-షేక్‌కు పూర్తిగా సహాయపడుతున్నది. అతడిని అక్కడినుంచి తరిమివేయడానికి ఎక్కడ ప్రయత్నం జరగగలదోనని, ఫార్మోజా రక్షణకు ఒక అమెరికన్ నౌకాదళానికి దళమే పంపించబడింది. రష్యా, దాని పలుకుబడిలోగల రాజ్యాలుమాత్రమేకాక, ఇండియా, బ్రిటన్ మొదలైన ఇతర రాజ్యాలు పెకింగ్ ప్రభుత్వాన్ని గుర్తించినా, అమెరికా తాను సవేమిరా గుర్తించనంటున్నది. ఇంతేకాక, మిత్రరాజ్యసమితిలో కొత్తచైనాకు ప్రాతినిధ్య మివ్వడానికి వీలులేదని అడుగడుగుకూ అడ్డుపడుతున్నది. పసిఫిక్ రక్షణకు (కమ్యూనిస్ట్ రష్యా, చైనాలపై యుద్ధం అని దీని తాత్పర్యం) ఆశ్రయంగా ఫార్మోజాదీవి అమెరికాకు ముఖ్యావసరమని జనరల్ మెకార్థర్ బహిరంగంగా చెప్పాడు. ఈ మాటకు ప్రెసిడెంట్ ట్రూమన్ ఆ సేనానిని మందలించినా, ఇది జరిగిన కొన్నాళ్ళకే వెతుక్కుంటూ తానే అతనివద్దకు వెళ్లి, ఏవో మంతనాలు జరిపాడు. అయిదారువేల మైళ్లు ప్రయాణంచేసి వెళ్లినా, మెకార్థర్‌తో జరిపిన మంతనం ఒక గంటకు లోపే. ఇంత త్వరగా ఈ సంభాషణ ముగిసిపోయిందంటే, ఎవరిమాటకు ఎవరు "ఔ"నని చప్పున తల యెగరవేసినట్లు? మెకార్థర్ మంకుపట్టుకు పేరుమోగినవాడు. పైగా, కొరియాలో ముందు ఎన్ని దెబ్బలు తిన్నా, చివరి ఘట్టంలో శీఘ్రవిజయములను సాధించగలిగినందున ప్రతిష్ఠ ఇనుమడించిన సమయం! ఇందువల్ల మెకార్థర్ దరికే ట్రూమన్ వచ్చాడని ఎందుకు అనుకోగూడదు? చాంగ్ కై-షేక్‌ను అడ్డంపెట్టుకుని చైనా నడిగడ్డపై దండయాత్ర జరపాలన్న కుతూహలం చూపుతున్న మెకార్థర్ మాటనెగ్గితే, పెకింగ్ ప్రభుత్వానికి తక్షణప్రమాదం లేదా? — ఈ విషయాలన్నింటిని దృష్టిలో పెట్టుకుంటే, కొరియా, ఇండో-చైనాలలోని పరిణామాలకు, టిబెట్‌పై దండయాత్రకు ఏ విధంగా సంబంధం కలదో తెలుస్తుంది.

కమ్యూనిస్టు రాజ్యాలకు తలుగడలలోనూ సైనికస్థావరాలకై అమెరికా తాపత్రయపడుతున్నది. కాశ్మీర్‌ను ఎలాగైనా పాకిస్థాన్‌కు కట్టబెట్టాలని అది చూపుతున్న పూనికకు మూలమిదే. అయినప్పుడు టిబెట్టులోకూడా వీలుపడితే కాలూనాలని అది ఎందుకు కోరగూడదు? అట్టి ఉద్దేశంలేకపోతే, కనీసం టిబెట్‌ని దువ్వి, దాన్ని తన పలుకుబడిలోకి తెచ్చుకోడానికి

ప్రయత్నించవచ్చుగదా? ఇట్టి భయసంకోచాలే టిబెట్‌పై దండయాత్రకు ఇప్పటిలో పెకింగ్‌ను పురికొల్పివుండాలి. ఇంతేకాక, మంచూ చక్రవర్తులు మహోచ్ఛస్థితిలోనున్నప్పటి వలె తిరిగి ఈనాటికి చైనా మొత్తానికి ఏకప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినామని చాటుకొంటున్న తాము మంచూ చక్రవర్తులకు సామంతరాజ్యమైన టిబెట్‌ను తమకుకూడా సామంతరాజ్యంగా చేసుకొనకపోవడం తమ ప్రతిష్ఠకు కొంత భంగకరమని భావించివుండాలి.

టిబెట్‌పై ఇప్పటిలో దండయాత్రకు కారణాలు ఏవైనప్పటికీ, పెకింగ్‌ప్రభుత్వం కొంత తొందరపాటును, చాలా తెలివితక్కువను చూపిందని చెప్పక తప్పదు. చాంగ్‌ప్రభుత్వం 1949 లో చైనా నడిగడ్డపై పతనం చెందినంతనే తనపై చైనా నామమాత్రపు అధిపత్యాన్ని టిబెట్ త్రోసిపుచ్చి వుండవచ్చు. కాని, ఈనాడు తిరిగి పూర్వాధిపత్యాన్ని గుర్తించడానికి అది సిద్ధంగానే వున్నది. తామైనా టిబెట్ స్వపరిపాలనాధికారానికి విఘాతం కలిగించబోమని అంటూనే వున్నారయ్యె. సమస్యాపరిష్కారానికి రాయబారాలనిమిత్తం రావలసిందిగా కోరితే, టిబెటియన్ ప్రతినిధులు ఢిల్లీకి రానే వచ్చారయ్యె। ఢిల్లీలోకాక, పెకింగ్‌లోనే చర్చలు జరగాలంటే, వారు అక్కడికి ప్రయాణం కట్టినారయ్యె। అయినప్పుడు టిబెట్‌పై దండయాత్ర ఉత్తరువుచెయ్యడం గోటితో గిల్లివేయదగు దానికోసం గొడ్డలిని పుచ్చుకొనడం కాదా? పిచ్చుకపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించడం కాదా? వీలైనంత వరకు విస్తరించడమే కమ్యూనిస్టుల పరమలక్ష్యమని ప్రస్తుతం జరుగుతున్న ప్రచారాన్ని బలపరచడానికి మరొక నిదర్శనాన్ని కూర్చడానికే ఇప్పటి దండయాత్ర ప్రధానంగా ఉపకరిస్తుంది. పెకింగ్ ప్రభుత్వాన్ని ప్రపంచంచేత గుర్తింపజేయడానికి ఇండియా గట్టిగాప్రయత్నం చేస్తున్నది. ఇట్టి ఇండియా శాంతియుతంగా టిబెట్ వ్యవహారాన్ని పరిష్కరించుకోవలసిందిగా చెప్పిన సలహాను త్రోసిపుచ్చి, "ఇది నా అంతరంగిక వ్యవహారం; ఇతరులకు దానితో నిమిత్తంలేదు" అని పెకింగ్ దండయాత్రకు దిగడం తనకున్న కొలదిమిత్రులలో కొందరిని కోల్పోవడంతప్ప వేరుకాబోదు.

ప్రపంచయుద్ధానికి ఒనగూడవలసిన వివిధకారణాలలో మౌఢ్యం ముఖ్యమైందే। దాన్నే ఇప్పుడు పెకింగ్ ప్రదర్శిస్తున్నది కాబోలు।

ఏమైనా, అన్నివైపులనుంచి ముసురు దట్టంగా పట్టుకువస్తున్నది. తుపానుగామారకుండా ఇది తేలిపోవడం కష్టమే!






ఉదయం తొమ్మిది గంటలైంది.

మాణిక్యాంబ అప్పుడే మడిగట్టుకొని దేవుడి మందిరంవద్ద కూర్చుండి దేవీ పూజకు పూజా ద్రవ్యాలు అమర్చుకుంటున్నది. ప్రక్కనున్న వంటగదిలో రమణమ్మగారు వంటచేస్తున్నది. దసరా రోజులలో పంతులుగారికి తాంబూలం పెట్టిపోదామని వచ్చిన ఆఫీసు జవానులు వాకిట్లో కుక్కపిల్లతో ఆడుకుంటున్న వాణిని అమ్మాయిగారూ, నాన్నగారు ఉన్నారా అని అడుగుతున్నారు. లేరు ఎక్కడికో పోయినారంటున్నది వాణి - కుక్కపిల్లవారిని చూచి బక్ బక్ మంటూ ఉన్నది.

ఇంతలో రిక్షావాడు సూటుకేసు బెడ్డింగు తీసుకొని వెంట వస్తూ ఉండగా గేటుదాటి లోపలికి వస్తున్న ప్రకాశరావు పంతులునుచూచి అమ్మా! అమ్మా! ప్రకాశరావుమామయ్యగారు వచ్చారంటూ లోపలికి పరిగెత్తుకొని పోయి తల్లితో చెప్పింది వాణి. మాణిక్యాంబ ఒక్కమాటు ఉలిక్కి పడ్డట్టె దేవుడి మందిరం వద్దనుంచి చివాలున లేచి ప్రకాశరావు మామయ్యగారు వచ్చారా? ఏరీ అంటూ హాలులోకి వచ్చింది.

ప్రకాశరావు పంతులు హాలులోకివచ్చి కోటు గుండీలు విప్పుకుంటున్నాడు మాణిక్యాంబ ఆయననుచూచి అన్నయ్యగారూ మెయిలుకు వచ్చారా! అంతా క్షేమమా అన్నది. అవునమ్మా మెయిలుకే వచ్చాను. అందరు క్షేమమే ప్రసాదరావు ఏడీ అన్నాడు ప్రకాశరావు. కాఫీ పుచ్చుకొని యింతకుముందుగానే ఎక్కడికో వెళ్ళారు. అంటూ మాణిక్యాంబ లోపలికి వెళ్ళి కాళ్ళు కడుక్కోడానికి చెంబుతో నీళ్లు తెచ్చిపెట్టి కాళ్ళు కడుక్కోండి కాఫీ పుచ్చుకుందురుగాని అన్నది. వద్దమ్మా కాఫీ త్రాగడమయిందన్నాడు పంతులు అయితేనేమి కొద్దిగా పుచ్చుకోండి అని మాణిక్యాంబ ప్లాస్కులో ఉంచిన కాఫీ గ్లాసులో పోసుకొని తీసుకవచ్చి ప్రకాశరావు ముందు ఎడంగా పెట్టింది.

అప్పుడే మడిగట్టుకున్నావా ఏమిటి? మీ పట్నవాసం వాళ్ళకు తెల్లవారి లేచింది మొదలు మడులు భోజనాలు అన్నాడు ప్రకాశరావు కాఫీగ్లాసు చేతికితీసుకుంటూ అవును అన్నయ్యగారూ, కచ్చేరి తొందరలు కావూ అన్నది మాణిక్యాంబ. కాఫీ త్రాగిన తర్వాత టేబుల్ పైనున్న యిండియన్ ఎక్స్‌ప్రెస్ అందుకున్నాడు

కనుపర్తి వరలక్ష్మమ్మ

ప్రకాశరావు. మాణిక్యాంబ ప్రారంభ మర్యాదలైన తర్వాత నెమ్మదిగా వంట యింట్లోకిపోయి రమణమ్మగారూ రమణమ్మగారూ, ఏమిటిగతి అన్నది.

ఏమిటండీ అమ్మా అన్నది రమణమ్మ.

మా ఆడబిడ్డ పెనిమిటి వచ్చారు. వారు మాంచి మొఖాసాదార్లు. పాడిపంటలతో యిల్లు కలకల్లాడుతూ ఉంటుంది. ఈ ముక్కకంపుకొట్టే పాడు బియ్యపన్నము వాళ్ళ యింట్లో కుక్కలకుగూడా పెట్టరు. సొంతానికి అట్టిపెట్టుకున్న వడ్లు దంపించుకుంటారు. మరబియ్యమంటే మా అన్నగారికి పరమానహ్యము. వారు బియ్యే ప్యాసైగూడా యీ ఉద్యోగాల కాశపడి బస్తీలలో మురిగిపోకుండా స్వగ్రామంలో హాయిగా సొంత సేద్యం చేయించుకుంటూ పిల్లజమీందారులాగా కాలం గడుపుతున్నారు. అట్లా నన్న బియ్యం చాయపప్పుతినేవారికి మన బస్తీ తిండేమి బాగుంటుంది. అందులో యివ్వాళ బియ్యంలేక నూకలు వార్చ మన్నాను గాదూ. ఎట్లాగమ్మా! అన్నది మాణిక్యాంబ దిగులుతో.

ఏమోనమ్మగారూ. ఎర్రగా ఈనూకల సంకటి విస్తట్లో వడ్డించడానికే చచ్చిన చావుగా ఉంటుంది. అన్నది రమణమ్మ. అయినా ప్రక్కయింటి ప్లీడరుగారి యింట్లో ఒక అర్ధశేరు బియ్యం దొరుకుతాయేమో పనిమనిషిని పంపి కనుక్కుంటా ఉండూ అని మాణిక్యాంబ దొడ్లోకి వెళ్ళి పొన్నమ్మని పిలిచి ప్రక్కయింటికివెళ్ళి ఒక అర్ధశేరు బియ్యం అప్పిస్తారేమో కనుక్కోమన్నది.

అమ్మో! ఆ యమ్మయింట్లో బియ్యమెక్కడివమ్మా. నిన్న ఆమె నన్నే ఎక్కడైనా బ్లాకులో బియ్యం ఉంటే తెచ్చిపెట్టుమని అడిగె. నేను లేదంటి. అన్నది.

మరల వీధిలో గేటువద్దఉన్న నౌకరును పిలిచి మునుస్వామీ! ఎక్కడైనా ఒక్క అర్ధశేరు బియ్యం తేరా! ఎంత డబ్బైనా యిస్తాను అన్నది. బియ్యం యిప్పుడు ఎక్కడా దొరికేదే లేదమ్మా. సర్కారువాళ్లు రేషణ్ చీట్లు కచ్చితంగా చూస్తున్నారు. మూటలవాళ్ళనుగూడా రానియ్యకుండా రైలులోనే పట్టేస్తున్నారు. బియ్యం ఎక్కడ దొరకుతాయి. వెలపెట్టితే బంగారమైనావచ్చును కాని బియ్యంమాత్రం దొరికేది కష్టం అన్నాడు.

ఛీ ఛీ దిక్కుమాలింది. ఎంత గొప్ప ఉద్యోగమైతే నేమి, ఎంత హొదా ఉంటే నేమి, ఎన్నివందలు తెస్తేనేమి. ఇంటికి వచ్చిన చుట్టానికి అంత బియ్యపన్నము పెట్టలేక పోయినతర్వాత అని విచారించింది మాణిక్యాంబ.

ఏమిచేస్తాము అమ్మగారూ! బస్తీలో రేషన్‌కష్టాలు వారికిమాత్రం తెలియవూ. నూకలుచార్చినా మెత్తని పూరీ కూరా, బోండా పాయసమూ అన్నీ చేస్తున్నాము కదా. మనతోబాటు వారూ కష్టపడతా రన్నది రమణమ్మ ఓదార్పుగా.

అంతే. ఏమి చేస్తాము? మీ అయ్య గారూ ఏదీ పట్టించుకోరు. ఇంట్లో ఆలు మగలు యిద్దరు ఉంటే ఆరుగురున్నట్టు వ్రాసుకొని చీట్లు పుట్టించుకొంటున్నారు. మీ అయ్యగారికి అటువంటివేమి పనికి రావు. నూకానుచ్చూ ఏది వండిపెట్టితే అదే తింటానంటారు? మనమైతే ఎట్లాగో అవస్థపడతాము. కాబోయే వియ్యంకుడూ, ఆడపెద్ద పెనిమిటీ, సంపన్న గృహస్థూ అటువంటివారు వచ్చినా కొంత సుష్టుగా చేసిపెట్టడానికి లేకపోతే ఎట్లా ఉంటుంది? మా అన్నయ్యగారి యింట్లో అన్నం పట్టి నోట్లో పెట్టుకుంటే నెయ్యి అన్నం తిన్నట్టుగా ఉంటుంది. నెలకు వెయ్యి రూపాయలు వస్తున్నాయని పొంగడమేగాని కమ్మని అన్నమూ, కమ్మని నెయ్యీ లేదుగద ఈ పట్నంలో. మలయా బియ్యం కొన్నాళ్ళూ, సయాం బియ్యం కొన్నాళ్లూ, రంగూను బియ్యం కొన్నాళ్లూ, బ్రెజిలు బియ్యం కొన్నాళ్లూ. చవీసారంలేని యీ నానాజాతి మర బియ్యాలూ! డాల్డానెయ్యీ కొళాయి నీళ్ళూ. ఆరోగ్యాలు చెడిపోతున్నాయంటె చెడిపోవూ. ఇందువల్లనే తిండి ఖర్చు కంటె డాక్టర్ల బిల్లు ఖర్చు ఎక్కువవుతున్నది. అన్నది మాణిక్యాంబ.

అంతేగాదు అమ్మగారూ. ఈ రేషనులో ఆరురోజులు అర్ధకూడు తిని ఏడోరోజున కటికి పస్తుండవలెనంటున్నారట డిల్లీలో ఉండే మంత్రిగారు. అమ్మా మీ వంటి వారైతే కలిగినవారు గనుక అన్నానికి బదులుగా ఏవైనా కొనుక్కొని ఏవైన చేయించుకొని హాయిగా తింటారు. తినలేక పోయినా పనిపాటులు చేసేవారుకాదు గనుక నగం నగమే తిన్నా పస్తే ఉన్నా యిబ్బందిలేదు. మావలె కాయకష్టం చేసేవాళ్లు పస్తుండి ఏం పని చేయకలుగుతారు చెప్పండి. తాము నిర్వహించలేకపోతే యీ కంట్రోల్లు తీసివేయరాదు మన తిప్పలు మనం పడతాముగా అన్నది రమణమ్మ.

సరే ఉండవమ్మా! అసలే [illegible]గా ఉంటే ఏవో గొడవ మొదలుపెట్టుతావు ఈ కంట్రోల్లు మహామహావాళ్లు వద్దంటుంటే వదలడంలేదు. మనం కాదంటే ఏమవుతుంది? మహాత్మాగాంధిగారు కంట్రోల్లు తీసివేయమని చెప్పారు. ఏమి లాభం, ఆయన అనుచరులే ఇప్పుడు పట్టుపట్టి ఉంచుతున్నారు. [illegible]ల్లు తీసివేయంగానే అర్ధణా ని[illegible]ట్టె అణా అనడం. కంట్రోల్లు పెట్టంగానే నిప్పపెట్టిలే కనపడకుండా దాచేయడం. నీతిమాలిన వారితో గవర్నమెంటువారు మాత్రం ఎట్లా వేగుతారు? బొత్తిగా నిజాయితీ పోయింది ప్రజల్లో. గాంధీగారు ఎంత సత్యాహింసలు బోధించారో, అంతకు వేయిరెట్లు అసత్యాహింసలు ప్రబలమైపోయినాయి. అన్నది మాణిక్యాంబ వ్యాకుల భావంతో—

ప్రకాశరావు పంతులు పేపరు చదువుకుంటూ చదువుకుంటూ ఏదో

జ్ఞాపకంవచ్చినట్లై వాలుకుర్చీలోనుంచి చివాలునలేచి బెడ్డింగు విప్పుతూ వాణీ! వాణీ! అని పిల్చాడు. ఎందుకు మామయ్యగారూ అంటూ వాణి వరండాలోనుంచి హాల్లోకి పరుగెత్తుకుంటూ వచ్చింది. ఇదిగో ఈ నంచి తీసుకపోయి మీ అమ్మకివ్వూ అంటూ నంచి వాణి చేతికిచ్చాడు ప్రకాశరావు పంతులు.

వాణి ఆ నంచి మోయలేక మోయలేక నేలమీదవేసి యీడుస్తూ తల్లివద్దకు తీసుకపోయి అమ్మా మామయ్యగారు నీకు యివ్వమన్నారని ఎదుట పడవేసింది ఏమిటమ్మా ఆ నంచి అన్నదితల్లి. ఏమో అని వాణి వాకిట్లోకి పరుగెత్తింది. మాణిక్యాంబ మునుస్వామిని పిల్చి నంచి విప్పించి అందులో బియ్యం ఉండటం చూచి ఎంతో సంతోషంతో పొంగిపోతూ రమణమ్మా! రమణమ్మా! అన్నయ్యగారు బియ్యం తెచ్చారు చూచావా? అన్నది.

మీ దిగులు తీరిపోయిందితే అమ్మగారు. ఇందాకటినుంచి యీ అన్నం ఎట్లా పెట్టువామని బిడియపడుతూ ఉంటిరి. అన్నది రమణమ్మ.

అయితే బావమరదు లిద్దరికీ ఈ బియ్యపన్నము వండు. ఆ నూక లన్నము మనము వాడుకుందాము అన్నది మాణిక్యాంబ. సరేలెండి అన్నది రమణమ్మ. మాణిక్యాంబ ఉత్సాహంతో అమ్మవారి పూజకు సిద్ధమైంది.

## 3

ప్రహ్లాదరావు పది గంటలకు యింటికి వచ్చి హాలులో కూర్చుండి ఉన్న బావగారిని చూచి బావగారు ఎప్పుడు రావడం ఈ మెయిలుకేనా? ముందుగా ఉత్తరం వ్రాశారు కాదేమి? స్టేషనుకు కారు పంపించి ఉందునుగా అన్నాడు.

ముందుగా అనుకోకుండా ప్రయాణం కావలసివచ్చింది. ఉత్తరం వ్రాసే వ్యవధి లేకపోయిందన్నాడు ప్రకాశరావు పంతులు.

బావగారిని కుశలప్రశ్న చేసినతర్వాత వెంటనే పూజచేసుకుంటున్న మాణిక్యాంబవద్దకు పోయి బావగారు వచ్చారే; ఏం జేయిస్తున్నావు? బియ్యం ఉన్నాయా అన్నాడు ప్రహ్లాదరావు.

ఎట్లా ఉంటాయి. మీరేమి పట్టించుకో రైతేరి అన్నది మాణిక్యాంబ.
ఏం పట్టించుకోమంటావు?

ఈ రోజుల్లో ఒక్కొక్క గృహస్థు బియ్యం పంచదార సంపాదించటానికి ఎంతెంత ప్రయత్నంచేస్తూ ఉంటారు. మీ కేమీ అక్కర్లేకపోయెను.

ఏం జేయమంటావు. కచ్చేరిలో బ్లాకుమార్కెట్టులో కొన్నవాళ్లకు అమ్మిన వాళ్లకు శిక్షలువేస్తూ ఇంట్లోకి చీకటి బజారునుండి బియ్యాలు పంచదారలు తెప్పిస్తూ ఉంటే ఏమైనా మర్యాద ఉంటుంది?

అం మహామహా అధికార్లే చేస్తున్నారు. మీకేగాని ఈ భయము. నిజమాలోచిస్తే బ్లాకుమార్కెట్టులో వస్తువు

కొనకుండా ఉన్న అధికారి ఉన్నాడూ? ఎవడుపట్టినా ఉల్లిపాయ ముట్టకుండా అందరికీ అమవాస్యగాని మనకేమిఅమావాస్య అనే శాస్త్రులుగారి వంటివాళ్లేగా.

సరే ఈ దెప్పుళ్లకేమిగాని బావగారికైనా బియ్యం అన్నం వండిస్తున్నావా లేదా ?

బ్లాకుమార్కెట్టు మీకు నిషేధమైతే నాకుమాత్రంకాదూ. ఒకవేళ చాటుమాటుగా కొంటామంటేమాత్రం చెప్పేన వారికే[illegible]గాదూ. నూకలుంటేవండించా అన్నది మాణిక్యాంబ కొద్దిగానవ్వుతూ.

ఏమిటా నవ్వు అని కోపంతో ప్రసాదరావు హాల్లోకి వచ్చేశాడు.

౪

ప్రకాశరావు ప్రసాదరావు స్నానాలుచేసి భోజనాలకు వచ్చారు. పెద్దపెద్ద పీటలుపరిచి అరిటాకులువేసి అందులో వెండిపళ్లాలు పెట్టారు.

ఈ నూకలన్నం బండారానికి యీ అట్టహాసం అంతా ఎందు కనుకుంటున్నాడు ప్రసాదరావు.

కూరలు పప్పు పచ్చళ్లు పిండివంటలు అన్నీ వడ్డించాక తెల్లగా తుమ్మిపువ్వుల్లాగా మిసమిసలాడుతూ ఉన్న సన్న బియ్యపన్నము పొగలు వెళ్లుతుండగా పళ్లెరములో తీడుకొనివచ్చి ఉభయులకూ వడ్డించింది రమణమ్మ.

ఆ అన్నం చూచేటప్పటికి ప్రసాదరావుకు పట్టరాని సంతోషమై నెయ్యి వడ్డించడానికి వచ్చిన భార్యవంక మందహాసంతోచూస్తూ ఇవ్వాళ మీ అన్నగారు వచ్చిన సందర్భాన మాకుగూడా సన్న బియ్యపన్నము విందు దొరికిందన్నాడు.

మా అన్నగారికి నేను విందుచేయలేదు. మా అన్నగారే మీకు విందుచేశారన్నది మాణిక్యాంబ.

ఇది నేనుచేసిన విందుకాదోయ్ మీ అక్కయ్యచేసిన విందు. అన్నాడు ప్రకాశరావు.

ప్రసాదరావు సాశ్చర్యంగా బావగారి వంక చూచాడు. మీ అక్కయ్య ఈ మధ్య యీ వూరువచ్చినప్పుడు మీర బియ్యంకొనం పడే అగచాట్లన్నీ చూచిందట. మీరు వెళ్లేటప్పటికి వాళ్లయింట్లో బియ్యం ఉంటాయో ఉండవో, వాళ్లేమి యిబ్బంది పడతారో నాలుగుశేర్లు సంచిలోపోసి బెడ్డింగులో కట్టివేస్తాను తీసుకుపోయి వాళ్లకివ్వండని సంచి కట్టివేసిందన్నాడు ప్రకాశరావు.

అట్లా చెప్పండి. మా మర్యాద మా అక్కయ్య కాపాడకపోతే మరెవ్వరు కాపాడుతారన్నాడు ప్రసాదరావు.


అవునోయి పుట్టింటి మర్యాద కాపాడడానికీ అన్నదమ్ముల పరువు నిలపడానికి ఆడవాళ్లు భర్తలనుగూడా తాకట్టు పెడ్తారన్నాడు ప్రకాశరావు నవ్వుతూ.

అదేమిటండీ అన్నాడు ప్రసాదరావు.

అవునోయ్. ఏదో పెద్దమనిషిననీ సెకండు క్లాసు పాసింజెరుననీ రైలువాళ్లు ఊరుకున్నారుగాని లేకపోతే ఈ బియ్యంమూట పట్టుపడితే నా పనేమి కావాలె చెప్పూ? అన్నాడు ప్రకాశరావు పంతులు.

అందరూ నవ్వుకున్నారు






[గతసంచిక తరువాయి]

## అయిదో ప్రకరణం

సుందరం తల్లిదగ్గిర నేర్చుకున్న చదువుతో హైస్కూలులో ప్రవేశించటానికి లేదు.

"వాడికింకా ఎక్కాలు రావాలి, లెక్కలురావాలి, అంతో ఇంతో ఇంగ్లీషు రావాలి. ఇదంతా నీవల్ల ఎట్లాఅవుతుంది? ఎవరినన్నా మేస్టర్ని పెట్టాలి" అన్నాడు శ్రీమన్నారాయణ సీతమ్మతో.

"ఏదో ఒకటి దబ్బున చూడండి, నెలరోజుల్నుంచీ వాడికి చదువూ సంధ్యా లేదు. మళ్ళీ అలవాటుతప్పితే మొండి పడతాడేమో," అన్నది సీతమ్మ.

"చూద్దాం.... సుబ్రమణ్యాన్ని పెడదామని ఉంది. శ్రద్ధగా చెబుతాడు," అన్నాడు శ్రీమన్నారాయణ.

"ఏదో ఒక గంటసేపు చెప్పానంటే చెప్పి లేచిపోతేకాదు. మూడు నాలుగు గంటలన్నా కూర్చుని నిలకడగా చదువు చెప్పే మేస్టర్నిచూడండి." అన్నది.

"మేస్టర్ని ఇంటికి పిలిపిద్దామనా?" అన్నాడు శ్రీమన్నారాయణ.

"మరెట్లా?" అన్నది సీతమ్మ, ఆదుర్దాగా.

"ఇంకానయం! ఇంటికొస్తే జాస్తి దబ్బడుగుతారు. అదీకాక ఎక్కువసేపు చెప్పరు. వాడికా చదువంటదు. సుందరం బడికి పోవలిసిందే. రోజుకు అయిదారు గంటలసేపు పిల్లలతో కలిసి చదువుకుంటే వాడికేదన్నా అంటుతుంది. పిల్లలు ఒంటరిగా ఎన్నడూ చదువుకోరాదు, తెలిసిందా?" అన్నాడు శ్రీమన్నారాయణ.

ఇందులో నిజం సీతమ్మ గ్రహించలేకపోయింది.

"వాడికి బడి అచ్చిరాదండీ. కిందటిసారి రాఘవయ్యబడి చూడలా? ఒంటిగా నాదగ్గిర చదువుకుంటేనే వాడికి చదువు బాగా అంటింది. మిగిలిన పిల్లలతో చేరి వాడు చెడిపోతాడుగాని చదువుకోడు," అన్నది సీతమ్మ.

శ్రీమన్నారాయణ భార్యకు గట్టి ఉపన్యాసం ఇచ్చాడు.

"నీవాదస్తం కొంత మార్చుకోవాలి. చెబుదామని చాలారోజుల్నుంచీ అనుకుంటున్నా, కాని అశ్రద్ధ అయిపో

తున్నది. కొన్నివిషయాల్లో సుందరాన్ని నువు పాడుచేస్తున్నావు. వాడు చూడూ, అందరుపిల్లలల్లే ఆడుకోడేం? అది చాలాతప్పు. ఎప్పుడన్నా సుబ్బమ్మగా రమ్మాయి లక్ష్మితో పోచుకోలు కబుర్లు చెప్పటం తప్పిస్తే వాడెన్నడూ సాటి పిల్లలతో ఆడుకోగా నేనుచూడలా. అది వాడికి మంచిదికాదు. నా అనుభవాన్ని బట్టి చెబుతున్నా విను. పిల్లలు మేస్టరు దగ్గిరా, పుస్తకాల్లోనూ నేర్చుకునేదాని కన్న తోటిపిల్లలదగ్గిర ఎక్కువ నేర్చుకుంటారు. వాళ్ళతోచేరి నీకొడుకు చెడిపోతాడేమో అని వాణ్ణి ఎన్నాళ్ళు మీదు గడతావ్? రేపు హైస్కూల్లోచేరితే?.... వాడు పిల్లలతో కలిసి తిరగాలి, చదువుకున్నప్పుడు చదువుకుని, ఆడుకున్నప్పుడు ఆడుకోవాలి.''

ఈమాటలువిని సీతమ్మ ఊరుకున్నదేగాని వీటిలో ఆవిడకు విశ్వాసం కుదరలేదు. సుందరం తనదగ్గిర అక్షరాలు నేర్చుకుంటున్న రోజుల్లో వాడిచదువు విషయం తన భర్త అభిప్రాయాలకన్న తనఅభిప్రాయాలే సరిగా పనిచెయ్యటం ఆవిడ చూసిఉన్నది. కనక ఇప్పుడు ఆయన చెప్పేమాటల్లో కొంత నిజం ఉండవచ్చునన్న అనుమానం ఆవిడకు తగల్లేదు. పైగా పిల్లల్లో చదువుకునే వాళ్లు ఆటలు మరగరనీ, ఆటలు మరిగిన వాళ్లు చదవరనీ ఆవిడకు గట్టినమ్మకం. సుందరం ఏ ఆటలకూ పోకపోవటం చూసి ఆవిడ గర్వపడేది వాడికి చదువు బాగా వస్తుందనుకోవటానికి ఆవిడ ఇదే ఆధారంగా చెప్పేది.

శ్రీమన్నారాయణ చెప్పిన అన్ని మాటలకన్నా, ఇంటికి మేస్టర్ని పిలిపిస్తే ఎక్కువ ఖర్చన్నమాటా, ఇంటికొచ్చే మేస్టరు ఎక్కువసేపు చదువుచెప్పడన్న మాటా ఆవిడకు బాగా నచ్చాయి.

తరువాత కొద్దిరోజులకే సుందరం సుబ్రమణ్యంబళ్ళో చేరాడు.

ఇది వీధిబడి. కోమట్ల అగురుమీద పొద్దునా, సాయంత్రమూ నడిచేది. అందులో దాదాపు ఇరవైమంది పిల్లలుండేవాళ్లు. వీళ్లంతా నెలజీతాలు, పావలా, అర్థా ఇచ్చి చదువుకునేవాళ్ళు. నిజానికి సుందరానికి వీళ్ళతో సంబంధం లేదు. సుందరం చదువు వేరు. సుబ్రమణ్యం శ్రీమన్నారాయణ దగ్గిర ఇరవై రూపాయలు తీసుకుని ఈ ఏడాదల్లా సుందరానికి తెలుగూ, ఇంగ్లీషూ, లెక్కలూ చెప్పి వేసవి శలవల అవతల వాణ్ణి హైస్కూల్లో మూడోక్లాసులో ప్రవేశపెట్టటానికి ఒప్పుకున్నాడు.

సుందరానికి మొదటివాచకమూ, ఎక్కాల పుస్తకమూ, సుమతీ శతకమూ కొనిపెట్టారు. వాడు వాచక పుస్తకంలో నుంచి రోజూ "చూచివ్రాత'' రాయాలి. రోజుకొక ఎక్కం వప్పగించాలి. సుమతీ శతకంలో పద్యం ఒకటి కంఠతాపట్టాలి. ఇంతే వాడిచదువు. మిగిలిన పిల్లలు క్లాసులవారీగా అక్షరాల గుణింతాలు అందరూకలిసి చదవటమూ, ఎక్కాలు చదవటమూ, పంతులుచెప్పే మాటలు "డిక్టేషను'' రాయటమూ చేసేవాళ్ళు. ఆతరవాత అల్లరిచెయ్యకుండా ఉండటం తప్ప వాళ్ళకేమీ పనివుండేదికాదు.



సుబ్రహ్మణ్యం పంతులు పిల్లల్ని కొట్టేవాడేగాని కొట్టటం పనిగా పెట్టుకునేవాడు కాడు. ఆయన ఎప్పుడూ నవ్వేవాడు కాడు. అమితంగామాట్లాడేవాడు కాడు. అందుచేత ఆయనంటే పిల్లలకు భయంగా ఉండేది. అంతేకాక ఆయన పిల్లలకు చదువుచెప్పేవాడు. ఎవరికిఎంత చదువు అంటుతున్నదీ కనిపెట్టేవాడు.

ఈ బళ్లో పిల్లలు సుందరాన్ని కాస్త ఎక్కువగా చూసేవాళ్లు. దానికి కారణమేమిటంటే వాడు వచ్చేఏడు హైస్కూల్లో చేరబోతున్నాడని అందరికీ తెలిసింది. బళ్లోచేరిన కొద్ది రోజుల్లోనే సుందరం ఇద్దరు ముగ్గురు స్నేహితులను సంపాదించాడు. అందులో ఒకడు వెంకటప్పయ్యాని గొల్లవాళ్ల కుర్రాడు. పిల్లలందరిలోకీ వాడే పెద్ద. పంతులు లేనప్పుడు పిల్లలను కనిపెట్టి ఉండేవాడు. వాడు మూడేళ్లనుంచీ ఈబళ్లోనే చదువుతూ, ఇప్పుడు మూడో క్లాసులో ఉన్నాడు, కాని ఇంగ్లీషు నేర్చుకోవటంలేదు.

వెంకటప్పయ్య సాధారణంగా నోరు తెరిచి మాట్లాడేవాడు కాడు. పంతులు వాణ్ణి బజారుకు పంపించి ఏమన్నా తెప్పించేవాడు. అంగడి సామాను దగ్గిర్నుంచి ప్రతిదీ చక్కగా బేరంచేసి, మంచి సరుకుగా తెచ్చేవాడు వెంకటప్పయ్య. వాడికన్న మంచివాడూ, తెలివిగలవాడూ, అనుభవంగలవాడూ ప్రపంచంలో లేడని సుందరం నమ్మాడు.

లక్ష్మయ్య అని కుమ్మరివాళ్ల కుర్రాడొకడుండేవాడు. వీడు బీదవాడని చూస్తేనే తెలిసిపొయ్యేది. నీరకావి రంగు ముతకచొక్కా వేసుకునేవాడు. దానికి గుండీలుండేవికావు. వాడికి లాగుండేదికాదు, గోచీపెట్టుకునేవాడు. జుట్టుకు ఏ జన్మానా నూనె ఉండేదికాదు. లక్ష్మయ్య పగిలిపోయిన పలకముక్కతో బడికివచ్చేవాడు. వాడు జేబులో పచ్చిమిరపకాయలు గుప్పెడు వేసుకొచ్చి ఒకనాడు, 'ఎవరైనా బలపంముక్క ఇస్తే పచ్చిమిరపకాయ తింటా' నన్నాడు. ఎవరో ఒక బలపంముక్క ఇచ్చారు. లక్ష్మయ్య అమాంతం పచ్చిమిరపకాయ కరకరా నమిలేసి మింగేశాడు. రోజలేదు. రొప్పలేదు, దాహం తాగలేదు.

ఇంకొక రెవరో ఇంకో బలపంముక్క ఇస్తాం ఇంకో మిరపకాయ తినమన్నారు. లక్ష్మయ్య తినబోతుండగా సుందరం, "వద్దు, వద్దు, తినకు. కావలిస్తే నా బలపం ఊరికే తీసుకో," అన్నాడు. లక్ష్మయ్య ఒక్కసారిగా రెండు మిరపకాయలు తీసి రెంటినీ నమిలి రెండు బలపంముక్కలూ పుచ్చుకున్నాడు.



సుబ్బులు అని మరో కుఱ్ఱవాడుండేవాడు. వీడు బ్రాహ్మడు. "పొట్టిగిత్త", అని పంతులు వాణ్ణి పిలిచేవాడు. ఉన్న పిల్లలందరిలోకీ వాడే పొట్టి. వాడు నడిచినా మాట్లాడినా రైళ్లు పరిగెత్తుతున్నట్టుండేది. అసలే పొట్టేమో, అందరి దృష్టి ఆకర్షించటానికి గట్టిగా అరిచి మాట్లాడేవాడు. వాడి మొహాన కను బొమ్మల మధ్య కాల్చిన మచ్చ చూసి సుందరం వాణ్ణి అదేమిటని అడిగాడు.

"చిన్నప్పుడు కాల్చారు." అన్నాడు సుబ్బులు నిర్లక్ష్యంగా.

"ఎవరు కాల్చారు? ఎందుకు కాల్చారు? నువేం అల్లరిచేశావ్?" అన్నాడు సుందరం ఆదుర్దాగా.

"ఓరి వెఱ్ఱిమొగమా, అల్లరిచెయ్యటమేమిటి? చిన్నబిడ్డగుణం వస్తేకాలుస్తారు. కాల్చకపోతే అప్పుడే హరహరా అయిపొయ్యేవాణ్ణి, ఏమనుకున్నావో!"

"చిన్నబిడ్డగుణమంటే?"

"అది కొంతమంది కొస్తుంది.... ఇదుగోచూసుకో," అంటూ సుబ్బులు పొట్టమీద వాతలు చూపించాడు.

"ఒకసారా? నాకు నాలుగుసార్లు. నాసామిరంగా, నాలుగుసార్లూ చచ్చేవాణ్ణే వాతవెయ్యకపోతే!"

అందుకు సుబ్బులు ఏమని గర్వపడుతున్నాడో సుందరానికి అర్థంకాలేదు.

"ఏంపెట్టికాలుస్తారోయ్?" అన్నాడు సుందరం, సుబ్బులుదగ్గిర తెలుసుకోవలసిన విషయాలు చాలాఉన్నాయని గ్రహించి.

"ఈ పొట్టమీదివాతలు సూదికాల్చివేశారు. మొహాన చుట్టకాల్చివేశారు."

సుందరం నిర్ఘాంతపోయినాడు. మనుష్యుల్ని ఇట్లాకాల్చటం ఏమిటో వాడికి అర్థంకాలేదు. చచ్చిపోవటంఎక్కువబాధా, వాతలు వేయించుకోవటం ఎక్కువబాధా అని వాడు ఆలోచించసాగాడు.

* * *

"సీతమ్మతల్లీ, పిల్ల అన్నం అఘోరిస్తున్నది. దానికి ఏంకావాలో కాస్త కనుక్కోమ్మా." అని సుబ్బమ్మగారు అవతలినుంచి కేకపెట్టింది.

"నెలగామాలు," అన్నది సీతమ్మ.

ఆ సమయానికే సుందరంకూడా అన్నంతింటున్నాడు. తల్లి లేవటంచూచి "ఎక్కడికమ్మా?" అన్నాడు.

"లక్ష్మిఅన్నంతింటున్నది. దానికేం కావాలోకనుక్కొస్తా. సుబ్బమ్మగారుముట్టయిందట," అన్నది సీతమ్మ.

ఆవిడ మళ్లా తిరిగొచ్చేలోపుగా సుందరం ప్రశ్నసిద్ధంచేసి అట్టేపెట్టాడు.

"అమ్మా. నువుముట్టుకావటంలేదేం?"

సీతమ్మనవ్వి, "వెధవకు అన్నీ ఆరాలూకావాలి .... నాపొట్టలో తమ్మ

దున్నాడు. అందుకనిముట్టుకావటంలా" అన్నది.

ఈమాటవిని సుందరం చాలాసంతో షించాడు.

"నిజంగానా,అమ్మా? తమ్ముడెప్పుడు బయిటికొస్తాడూ?"

"నువు ఇస్కూల్లో చేరేలోపల వస్తాడులే."

ఆరోజు చాలాఉత్సాహంతో బడికి వెళ్లాడు సుందరం. సుబ్బులురాగానే వాడితో రహస్యంగా," "ఒరే, నాకు తమ్ముడు పుడతాడు," అన్నాడు.

"ఏం? మీ అమ్మ కడుపుతోఉందా?"

ఆమాట సుందరంచెవులకుఎబ్బెట్టుగా తోచింది.

"కడుపుతో వుండట మేమిటి! మా అమ్మ పొట్టలో తమ్ముడున్నాడు," అన్నాడు సుందరం.

"అదేరా, వెర్రినాయనా, కడుపుతో ఉండటమంటే. ఈ ఆడవాళ్ళకేం పని లేదు. ఎప్పుడూ కడుపుతో ఉంటారు," అన్నాడు సుబ్బులు, తన తండ్రి తరుచు అనేమాట వల్లెవేస్తూ. "మీ అమ్మ కడుపులో మగపిల్లవాడున్నాడని నువేమన్నా చూశావా? ఆడపిల్ల వుండకూడదూ?"

"మా అమ్మ చెబితేనే?"

"పుట్టేవాకా ఎవరికీ తెలీదులే."

మళ్ళీ ఎవరితోనూ చెప్పనని సుందరంచేత "పరమప్రమాణపూర్తిగా" ఒట్టు వేయించుకుని సుబ్బులు ఆడవాళ్ళకు కడుపు ఎట్లా అవుతుందో చెప్పాడు— తనకు ఇతరత్రా తెలిసినమటుకు, చెప్పటం చాతనయినమటుకు.

సుబ్బులు చెప్పినది ఒక్క ముక్క కూడా సుందరం నమ్మలేకపోయినాడు. ఎవరో "అసహ్యమైన" మనుషులుచేసే పని అందరూ చేస్తారా అని—ముఖ్యంగా తన తల్లీ తండ్రీ చేస్తారా అని—సుందరానికి అనుమానం కలిగింది. కాని సుబ్బులు మాటల్లో కొంత నమ్మకమూ కుదిరింది.

ఈ కొద్దిపాటి విజ్ఞానం సుందరం ఆత్మని ఎంతో సంక్షోభపెట్టింది. అయితే సుబ్బులు మాటలసందర్భంలో ఇంకో విషయం చెప్పాడు. దాంతో సుందరం మనస్సు పిల్లలు పుట్టడంమీదినుంచి మరోవైపుకు పూర్తిగా మళ్ళింది.

ఇంగ్లీషువాళ్ళూ జర్మనీ వాళ్ళూ యుద్ధంచేస్తున్నసంగతి సుబ్బులు చూసినట్టుగా చెప్పాడు. రాములవారు ఎప్పుడో రావణాసురుడితో యుద్ధంచేసి నట్టుమాత్రం సుందరానికి తెలుసు. ఇప్పుడుకూడా యుద్ధాలు జరుగుతాయని సుందరానికి తట్టలేదు.

"జర్మనీవాళ్ళు భలే ముండాకొడుకుల్లే. ఇంగిలీషువాళ్లదగ్గర ఒక బంగారం కొండ వుంది—" అన్నాడు సుబ్బులు.

"కొండంతా బంగారమే," అన్నాడు సుందరం.

"ఆ, అందులోనించి రాళ్ళు తెచ్చి మనం మురుగులు చేసుకోవచ్చు .... ఆ కొండ ఎట్లాగైనా సంపాదించుదామని జర్మనీవాడు! ఇద్దరూయుద్ధంచేస్తున్నారు. ఎవళ్లు గెలిస్తే బంగారం కొండ వాళ్లకు వస్తుంది. ఇంగిలీషువాళ్ళు ఓడిపోతే మనకు పీడ వదుల్తుందని మా నాన్న

చెప్పాడు," అన్నాడు సుబ్బులు, వాళ్ళ నాన్న చెప్పినదానికి తభావతుండటానికి వీలులేనట్టు.

"ఇంగిలీషువాళ్లు ఓడిపోతారా?" అన్నాడు సుందరం.

"ఓడిపోక ఏంచేస్తార్రా? జర్మనీ వాడేంచేశాడో తెలుసా? ఒక కోడిని తయారుచేశాడు. అది ఎట్లా ఉంటుందీ? అచ్చగా నిజమైనకోడిలాగే వుంటుంది. నిజమైన కోడిలాగే, కొక్కొరొకో, అంటుంది. ఆ కోడిని ఇంగిలీషు వాళ్ళదగ్గిరికి పంపించాడు. అది నిజంగా కోడే అనుకుని ఇంగిలీషువాళ్ళు దాన్ని పట్టుకునేటప్పటికి అదికాస్తా ఢాం మని బద్దలై ఇంగిలీషు వాళ్ళంతా చచ్చారు," అన్నాడు సుబ్బులు చేతులు తిప్పుతూ, అభినయిస్తూ.

"ఇంగిలీషువాళ్ళు ఓడిపోయినారా?"

"అప్పుడేనా? ఓడిపోతే యుద్ధం అయిపొయ్యేదేగా?" అన్నాడు సుబ్బులు.

"ఇదంతా, చక్కగా, నీ కెవరు చెబుతార్రా?" అన్నాడు సుందరం, అసూయగా.

"మానాన్న అప్పుడప్పుడూ పత్రిక చూస్తాడుగా," అన్నాడు సుబ్బులు నిర్లక్ష్యంగా. ఇంతలో ఇతర పిల్లలుకూడా వచ్చారు. ఇంకేవో విషయాలు మాట్లాడటం మొదలుపెట్టారు.

* * *

సుబ్రమణ్యంబడిలో హింసపడకపోయినా వీధిబడి నరకం కళ్లారా చూడటానికి సుందరానికి మంచి అవకాశం లభించింది. ఎందుచేతనంటే సుబ్రమణ్యంబడికి ఇంకొంచెం ఎగువన, వీధి అవతలి పక్కగా, మరో ఇంటి అరుగుమీద మార్కండేయులు పంతులు బడి ఉండేది. అందులో ముప్పై, నలభై మంది పిల్లలుండేవాళ్లు. ఆ వీధిలో ఉన్న అసలు వీధిబడి అదే. ఎవరన్నా, "వీధిబడి ఎక్కడ?" అని అడిగితే, వీధిలోవాళ్లు మార్కండేయులు పంతులుబడే చూపించేవాళ్లు.

మార్కండేయులు అచ్చగా యమకింకరుడే. పిల్లల్ని హత్యచెయ్యటం మినహా మిగిలినదంతా చేసేవాడు. ప్రతిమనిషికీ అంతో ఇంతో కల్పనాశక్తి వుంటుంది. తనకు భగవంతుడిచ్చిన కల్పనాశక్తియావత్తూ మార్కండేయులు పిల్లల్ని హింసించటంలోకొత్తపద్ధతులు సృష్టించటానికి వినియోగించేవాడు.


మార్కండేయులుకు చాలా పేరుండేది. సుబ్రమణ్యంపంతులుబళ్లో చదువుకునే పిల్లల్లోకూడా కొంతమంది మార్కండేయులు చాలా గొప్పగా చదువు చెబుతాడని నమ్మేవాళ్లు. అయితే మార్కండేయులు చదువు చెప్పేవాడు కాడు. ఆయనబళ్లో పిల్లలు పొద్దునా సాయంత్రమూకూడా నెలలతరబడి, "కా, కాకు దీర్ఘమిస్తే కా, కాకు గుడిస్తే కి, కికు పొల్లిస్తే కీ, కాకు కొమ్మిస్తే కు...." అనీ, "రెణ్ణాశ్లెందీ, రెండయిదుల్పాదీ, రెండార్లు పన్నెండూ, రెండేళ్ళధ్నాలుగూ...." అనీ కేకలుపెడుతూ ఉండేవాళ్లు.

కాని మార్కండేయులు పిల్లలకిచ్చే శిక్షలో ఇది ముఖ్యభాగం కానేకాదు.

పిల్లలు ఇంటిదగ్గిర పెద్దవాళ్ళమాట విననందుకూ, బళ్ళోకూచున్న సమయంలో పిల్లలు స్వాభావికంగా చేసేపనులు చేసినందుకూ మార్కండేయులు పిల్లల్ని చెండుకుతినేవాడు. పిల్లలు స్వతహాగా దుర్మార్గులనీ, వాళ్ళకు తనపై భయం కలిగిస్తే చెడు యావత్తూ వదిలిపోయి బాగుపడతారనీ మార్కండేయులు విశ్వాసమై ఉంటుంది.

మార్కండేయులు పిల్లల్ని శిక్షిస్తుంటే చూసేవారికి ఆయనకు పిల్లల మీద ఏదో పగఉన్నదా అనిపించేది. ఆయన పిల్లలను మంచివాళ్లను చేసే పద్ధతులలో తల గోడకేసి కొట్టటమూ, పిల్లల్ని డొక్కల్లో తన్ని అరుగు ఒక మూలనుంచి ఇంకో మూలకు విసరటమూ, వాళ్ళచేతులు మెలిపెట్టటమూ, వాళ్ళను జుట్టుపట్టుకుని పైకెత్తటమూ మొదలైన నాజూకులుండేవి. ఎన్నో సార్లు మార్కండేయులు పిల్లలు పంతులు దెబ్బలకు లాగుల్లో ఉచ్చ పోసుకునేవాళ్లు దొడ్డికూర్చునేవాళ్లు.

ఒకరోజు మార్కండేయులు డొక్కలో తన్నిన తన్నుకు ఒక కుర్రవాడు అరుగుమీదినుంచి వీధిలోపడి ప్రాణంకడబట్టి చచ్చినట్టుగా పడిపోయినాడు. నలుగురూ చేరారు. మొహాననీళ్ళు చల్లి వాణ్ణి బతికించారు. ఒక్కరుకూడా మార్కండేయులు పంతుల్ని, "ఇదేమిటి? నువు మనిషివా, గొడ్డువా?" అని అడగలేదు. ప్రాణంకడబట్టిన పిల్లవాణ్ణి తెప్పరించటానికి ఆయన సహాయపడలేదు కూడా. సహాయపడితే మిగిలిన విద్యార్థులకు లోకువవుతాడు!





ఇదంతా ప్రత్యక్షంగా చూస్తున్న సుందరానికి ఆక్షణానే వెళ్లి మార్కండేయుల్ని గొంతుపిసికి చంపెయ్యాలన్నంత కోపంవచ్చింది. ఇంతవరకూ సుందరానికి ఎవరిమీదా అంతకోపంవచ్చి వుండలేదు. ఇదివాడికి తొలిఅనుభవం.

చచ్చినంతపనిఐ మళ్లీత్రాణవచ్చిన కుర్రవాణ్ణి ఎవరో ఇంటికి చేర్చారు. మరుక్షణమే మార్కండేయులు తన "శిక్ష" ప్రారంభించాడు. నలుగురుపిల్లల్ని గోడ కుర్చీవేయించాడు, ఇద్దరిచేత గుంజీలు తీయించాడు,

మార్కండేయులు గుంజీలు తీయించటం ఒక కవాతు. పాదాలు రెండూకలిపి పెట్టాలి, కుడిచేత్తోఎడమచెవీ, ఎడమచేత్తో కుడిచెవీ పట్టుకోవాలి. ముందు మోకాళ్లమీదపడాలి, తరవాత మోచేతుల మీదపడాలి యాభయ్యో, వందో గుంజీలు తీస్తున్నంతసేపూ పాదాలు ఎడమైనా, చెవికిచెయ్యిఎడమైనా వీపుపేలిపోతుంది. యాభై గుంజీలు ఈవిధంగా తీసేసరికి పిల్లలమోకాలిమీదిలాగూ, మోచేతిమీది చొక్కా రక్తంమరక లయేవి.

ఒకరోజు ఒకకుర్రాడు మోకాళ్లకూ మోచేతులకూ గుడ్డలుచుట్టుకు వచ్చాక్ట. యాభై గుంజీలుతీసినా లాగుగాని చొక్కాగాని రక్తంమరకలు కాలా. కారణం తెలుసుకొని మార్కండేయులు పేంబెత్తంతో వీపు వాయగొట్టాడు.

వీధిబడి జీవితంలో సుందరంచూసిన వాటన్నిటిలోకీ వాడికి భయంకరంగా కనిపించి, ఎంతోకాలంపాటు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా చెప్పరాని ఆవేదనకలిగించినది బండకొయ్య. అంతకుపూర్వం బండకొయ్యగురించి విననన్నా వినకుండా ఆకస్మికంగా చూసేటప్పటికి సుందరానికి జీవితాన్నిగురించిన భయంకరమైన ఒక కొత్తసత్యం తనమీద భారంగా విరుచుకుపడ్డట్టు అయింది.

బండకొయ్యమోస్తూ సుందరంకంట పడిన కుర్రవాడికి ఏ పన్నెండేళ్లో ఉంటాయి. వాడికి చొక్కాలేదు చాలీచాలనిలాగు, బూడిదరంగుది. తొడుక్కున్నాడు. వాడి మొహాన మనిషికుండవలసిన భావాలేవీ లేవు, అచ్చంగాజంతువల్లే ఉన్నాడు. వాడికంటతడిగాని, మొహానబాధగాని, విచారంగాని, రోషంగాని, పౌరుషంగాని ఉంటే సుందరం హృదయం వాడికి దగ్గిరిగా వెళ్లటానికి ప్రయత్నించిఉండేది. కాని వాడిలో ఇవేవీలేవు. బండకొయ్య రెండుచేతుల మీదా అడ్డంగాపెట్టుకొని మోస్తున్నాడు. బండకొయ్యను కొంచెం జాగర్తగా పరిశీలిస్తే దాన్నిఎవరో పనిపెట్టుకొని, ఒకపద్ధతి ప్రకారం తయారుచేశారని సుందరానికి అర్థమయింది. పిల్లల్ని

కొట్టటానికని బెత్తాలుతయారుచేస్తారన్న మాట మనస్సుకుతోస్తేనే సుందరానికి మనస్సులో ఏదో వికారంగాఉంటుంది. ఇటువంటి బండకొయ్యలు తయారు చేస్తారంటే కలిగినవికారాన్ని సుందరం బొత్తిగా భరించలేక పోయాడు.

బండకొయ్యకొక ఇనపగొలుసు తాపటంచేసిఉంది. ఆ గొలుసే బండ కొయ్య మోసేవాడికాళ్ళకు రెంటికీ కట్టి ఉంది. వాడు కావాలన్నా పెద్దఅంగలు వెయ్యలేడు. గొలుసు పట్టుకుంటుంది. బండకొయ్యకింద పడేసిపారిపోవటానికి లేదు. గొలుసు బరువు కావటంచేతనో ఏమిటో ఆకుర్రాడు చిన్నఅంగలైనా కాలుఎత్తివెయ్యక, కాళ్లు నేలమీదనే రాస్తూ ముందుకు పోతున్నాడు. వాడు కదిలినప్పుడల్లా గొలుసు పెద్దచప్పుడు చేస్తున్నట్టు సుందరం బుద్ధికి తోచింది. ఈ గొలుసుచప్పుడు ఎన్నోరోజులు సుందరాన్ని వెంటాడి, నిద్రలోకూడా వినిపిస్తూఉండేది.

ఈ బండకొయ్యవేసే కుర్రాణ్ణి మరొక పెద్దాయన వెంటబెట్టుకొని సుబ్రమణ్యం బడిపక్కగా మార్కండేయులు బడికి తీసుకువెళ్లాడు.

"చదువూసంధ్యా లేకుండా పూర్తిగా చెడిపోయి దొంగతనాలూ అవీ మరిగిన వాళ్లకి బండకొయ్యవేస్తారు", అన్నాడు సుందరంతోపాటు బండకొయ్యవేసిన కుర్రవాణ్ణి చూస్తూ ఉండిన మరో కుర్ర వాడు.

తనకన్న తక్కువ చలించినవాడితో మాట్లాడటం సుందరానికి లాభించింది.



"వాడు బాగా చెడిపోయినాడా?" అన్నాడు సుందరం. అయిదేళ్లవాడి క్కూడా జీవితాన్నీ, మానవుల్నీ విశ్వ సించాలనే ఉంటుంది మరి.

"చెడిపోవటంలో అట్టా ఇట్టాగా? వాణ్ణి కొట్టు, చంపు. ఎవరి మాటా వినడు. కొంచెం సందు చిక్కిందో అందకుండా పారిపోతాడు." అన్నాడు ఆ కుర్రవాడు.

అదంతా బాగానే ఉంది. కాని వాణ్ణి బడికి తీసుకురావటం దేనికి? వాడికింకా చదువొస్తుందా? తన అనుభవాన్నిబట్టి సుందరం, బుద్ధిపూర్వకంగా, పూర్తి ఇష్టంతో చదివేదే చదువని నమ్మాడు. తనచుట్టూ ఉన్నవాళ్లలోనే ఎంతమందికి బలవంతాన చదువు అంటగట్టబడు తున్నదీ సుందరానికి తెలియనే తెలి యదు. అందుచేత ఆ బండకొయ్యకూ చదువుకూ మధ్య ఏదో పెద్ద అఖాతం ఉన్నట్టు సుందరం నమ్మాడు.

"ఇటువంటి మొద్దు వెధవలంతా మార్కండేయులుబళ్లో వచ్చిపడతారు," అన్నాడు సుందరం పక్కనున్న కుర్ర వాడు.

"మార్కండేయులు పిల్లల్ని చావ గొడతాడు. నా కటువంటి వాళ్లంటే అసహ్యం. రాఘవయ్యపంతులు కొడతా డనే ఆయన బళ్లో మానేశా." అన్నాడు సుందరం.

"మార్కండేయులు కొట్టటం కొట్టటమా? పొట్టిపంతు లేంచేస్తాడో తెలుసూ?" అన్నాడు రెండో కుర్రవాడు.

"నాకు తెలీదు." అన్నాడు సుందరం తెలుసుకోవాలనే కుతూహలం కనబరుస్తూ.

"పిల్లల్ని కోదండం వేయిస్తాడు."

"అంటే?" అన్నాడు సుందరం.

"దూలానికి తాడుకట్టి దానికి వేళ్లాడ తీస్తాడు."

"ఎంతసేపు వేళ్లాడతీస్తాడూ?"

"ఇష్టమొచ్చినంత సేపు."

"చేతులు నెప్పెట్టవూ?"

"వదిలిపెడితే కిందపడి కాళ్లు విరుగుతైగా!"

"తరవాత కాళ్లు విరగనీ, చేతులు నెప్పెట్టితే వొదిలెయ్యమూ?" అన్నాడు సుందరం, తనకే కోదండం వేస్తున్నట్టు ఊహించుకుంటూ.

"అట్లా వొదిలిపెట్టకుండా పొట్టిపంతులింకో తమాషా చేస్తాడుగా!"

"ఏమిటా తమాషా?"

"కింద మంటపెడతాడు."

సుందరం తన స్నేహితుడికేసి వెర్రిగా చూశాడు....

## ఆరో ప్రకరణం

సుందరం బుర్ర లెక్కల్లో బాగాపనిచేసేది. వాడికి ఇరవై ఎక్కాలూవచ్చిన తరువాత పంతులు కూడికలూ, తీసివేతలూ నేర్పాడు. సుబ్రమణ్యం ఒక్క తెలివైనపని చేశాడు- చిన్న అంకెలకూడికకు వేళ్లు ఉపయోగించే దురభ్యాసం అయినా ప్రోత్సహించలేదు. అందుచేత ఒంటిఅంకెల కూడికలూ, తీసివేతలూ తలలోనేచేసే అలవాటు సుందరానికి పట్టుబడింది. వాడింకో సంగతికూడా తనంతటతానే కనిపెట్టాడు. ఏక్కాలన్నీకూడికలే! వరసగా నాలుగుమూళ్లువేసి కూడితే పన్నెండువస్తుంది, ఆరుమూళ్ళుకలిపికూడితే పద్దెనిమిది వస్తుంది. ఈసంగతి కనిపెట్టినప్పుడు సుందరానికి చాలా ఆనందం కలిగింది. కూడికలూ తీసివేతలూ నేర్చుకున్నాక సుందరం హెచ్చవేతలూ భాగారాలూ నేర్చుకున్నాడు.

దసరాపండగ దగ్గిరపడుతున్నదనగా వీధిబళ్ళలో చదువుమానేసి పిల్లలకు పాటలు నేర్పటం మొదలుపెట్టారు పంతుళ్లు.

"శ్రీహరికరుణాకటాక్ష - వీక్షణాలంకారా! అర్థిజనకుముద చంద్రోదయా! ఆశ్రిత విద్వజ్ఞనాధారా! దానరాధేయా! సంగ్రామధనంజయా! సాహస విక్రమార్కా?" మొదలైన భట్రాజు పొగడ్తలతోనూ, "ధరసింహాసనమై, నభంబుగొడుగై" వగైరా పద్యాల

తోనూ, "అర్ధరూపాయిస్తే అంటేది లేదూ, ముప్పావలాఅయితే ముట్టేది లేదూ. అయ్యవారికిచాలు అయిదువరహాలూ, పిల్లవాళ్ళకుచాలు పప్పుబెల్లాలూ" అన్నగేయాలతోనూ వీధిమారుమోగింది.

"ఒరేయ్, రేపు మీరంతా మంచి మంచిబట్టలు వేసుకొని, చద్దిఅన్నాలు తిని, దసరాబొమ్మతో సహా తెల్లవారుతోనే ఇక్కడికి వచ్చెయ్యండి. ఊరంతా తిరగాలి." అని సప్తమినాడు పంతులు పిల్లలకుచెప్పాడు.

దసరా తిరుగుళ్లను గురించి సుందరానికి ఏమీ అనుభవంలేదు. అందుచేత వెంకటప్పయ్యనడిగి తెలుసుకొన్నాడు. అంతావిన్నతరువాత సుందరానికి చాలా ఉత్సాహంవచ్చింది. పాటలు పాడుకుంటూ మూడురోజులపాటు ఇల్లిల్లూ తిరగటం భలేబాగుంటుం దనిపించింది సుందరానికి. ఆ సాయంకాలం వాడు తండ్రివెంట బజారుకుపోయి కోతిబొమ్మ కొనుక్కున్నాడు. తలవని తలంపుగా సుందరానికి కొత్తచొక్కా, కొత్త లాగూకూడా వచ్చాయి. తనతండ్రి ఇవి కుట్టిస్తున్నట్టు సుందరానికి తెలియదు. చొక్కా ట్వీల్లు చొక్కా. సుందరంకళ్ళకది మల్లెపువ్వుకన్న తెల్లగా మెరిసిపోతున్నట్టు కనపడింది. లాగుకూడా ఎంతోబాగుంది. తెల్లగీరగల నల్లలాగు. తను అంతమంచిగుడ్డ లెన్నడూవేసుకోలేదనుకున్నాడు సుందరం.

ఆరాత్రి చాలా సేపు సుందరానికి నిద్రపట్టలేదు. రేపుగురించి ఎంత ఊహించుకున్నా వాడికి తనివి తీరలేదు. ఆఖరుకు, ఏ అర్ధరాత్రివేళో కన్నుమూసి ఒక్కక్షణమైనా నిద్రపోయినట్టులేదు. ఇంతలో తల్లి, "లేవరా, సుందరం," అని లేపేసింది.

లేచిన క్షణంనుంచీ ప్రతిదీ సుందరానికి మామూలుకన్న బాగా ఉన్నట్టు తోచింది. మొహం కడుక్కొనటానికి బయటికివచ్చాడు. చలిచలిగాఉంది. ఆ చలి వాడికి బాగున్నట్టుతోచింది. అప్పుడే కొద్దికొద్దిగా విచ్చుకుంటున్న చీకట్లు కూడా వాడికెంతో ఆనందం కలిగించాయి.

సుందరం మొహం కడుక్కొని, అన్నంతిని, కొత్తబట్టలువేసుకొని కోతిబొమ్మచేతపట్టుకొని నిర్మానుష్యంగా ఉన్న వీధులవెంట బడికి బయలుదేరాడు. సగం దారిలో ఎవరోవెనకనుంచి, "సుందరం," అని పిలిచారు. సుందరం సుబ్బులు గొంతు గుర్తుపట్టాడు.

"నువ్వు కొత్తబట్టలు వేసుకోలేదే?" అన్నాడు సుందరం ఆశ్చర్యంతో.

"ఆఁ!" అన్నాడు సుబ్బులు నిర్లక్ష్యంగా.

"బొమ్మకూడా కొనుక్కోలేదా?"

"బొమ్మాలేదూ, గిమ్మాలేదూ."

సుబ్బులు నిర్లిప్తత చూసినతరవాత సుందరానికి తనఉత్సాహంమీద ఉత్సాహంతగ్గింది.

"నీవంటివాళ్లనే దసరా బుల్లోడంటారు," అన్నాడు సుబ్బులు.

సుబ్బులు తనకన్న ఒక ఏడాది ఏమైనా పెద్దేమో, అంతకంటె ఉండదు; అయినా తనకన్న ఎంతో పెద్దవాడల్లే

ఎందుకు కనిపిస్తాడో, తనకు తెలియని విషయాలు వాడి కెందుకు తెలుసో సుందరానికి అర్థమయేది కాదు.

ఇద్దరూ బడికిచేరే సరికి బాగా తెల్ల వారింది. పిల్లలంతా చేరేసరికి ఇంకా బాగా వెలుతురొచ్చింది. ఎండవచ్చేదాకా పంతులు రానేలేదు.

పంతులు ఒకడే రాలేదు. ఆయన వెంట ఇంకో పంతులూ, ఆ పంతులు వెంట ఇంకో ఇరవైమంది పిల్లలూ వచ్చారు. పిల్లలందరూ కలిసి కాస్సేపు పాటలు పాడారు. తరవాత మంద బయలుదేరింది. రెండో పంతులు పిల్లలందర్నీ సైజువారీగా జతలుగా విడగొట్టి ఈ జతలన్నిటినీ ఒక వరసలో నిలబెట్టాడు. పిల్లల్లో చాలామంది దగ్గిర కోతులున్నాయి. కొంతమంది దగ్గిర విల్లంబులున్నాయి. వాళ్లు వాటితో గులాంకొట్టారు. గులాం ఎర్రని పొగలాగా గాలిలోకి లేచింది. కొందరు పిల్లలు వెదురుపుల్లలకు రంగు కాగితాలతో జెండాలు తయారుచేసి అవి పట్టుకున్నారు. నీలం, ఎరుపు, పసుపు జెండాలు గాలిలోకి లేచాయి.

"జయాభిజై భవా! దిగ్విజై భవా!" అని అరిచి పిల్లలు కదిలారు. పంతుళ్లిద్దరూ ముందు నడిచారు. ఆ పూట ఏ పేటకు వెళ్లాలో, ఎవరెవరిళ్లకు ముందు వెళ్లాలో పంతుళ్ల మధ్య అదివరకే నిర్ణయమయింది.


* * *

ఇల్లిల్లూ తిరగటం సుందరానికి మంచి అనుభవమయింది. బళ్లో పిల్లల్లో చాలామంది ఇళ్లను వాడు ఇదే మొదటిసారి చూడటం. ఒక ఇల్లున్నట్టు ఇంకో ఇల్లులేదు. వెంకటప్పయ్య ఇల్లు చాలా పెద్దది. "లంకంత" ఇల్లు. ఇంటి చుట్టూ గొడ్లూ, ఆవులూ బోలెడు కట్టి ఉన్నాయి. ఇటువంటి ఇళ్లు ఒకటి రెండు తప్పిస్తే మిగిలిన ఇళ్లు సుందరం ఇంటివంటివే.

పంతులు కొందరిళ్లకు పోనేలేదు. సుందరం సులభంగానే కారణం ఊహించాడు. కొందరు పిల్లలు నివసించేవి ఇళ్లనటానికి వీల్లేదు. వెంకటప్పయ్యగారి గొడ్లపాకాలాంటి ఇళ్లల్లో నివసిస్తున్నవాళ్లున్నారు. ఇటువంటి ఇళ్లను సుందరం దూరాన్నుంచి మాత్రమే చూశాడు.

ఒకచోట పిల్లలు కొన్ని గుడిసెల పక్కగా పోతుండగా, చేతిలో పేడ ఎత్తుకుని ఒకమనిషి కనిపించింది. ఆమె బొత్తిగా అంట్లుతోమే దానల్లే ఉంది. ఇంతమంది పిల్లలమధ్య తన కొడుకును చూసి ఆనందిస్తూ ఆమె ఒక పక్కగా నిలబడింది. ఆమె కొడుకు అందరి దగ్గిరికి వచ్చి, "అదుగో, మా అమ్మ." అని చూపసాగాడు.

వాడితల్లి తన తల్లిలాగా లేనందుకు సుందరం నొచ్చుకున్నాడు. అయితే, వాడుకూడా చదువుకుంటున్నాడు కనక పెద్దవాడై ఉద్యోగంచేసి డబ్బు సంపాదిస్తాడనీ, అప్పుడు ఈ మనిషికూడా తన తల్లిలాగే ఉంటుందనీ సుందరం పూర్తిగా నమ్మాడు. చదువుకో దలిచినవారంతా ఎంతకాలమన్నా చదువుకోవచ్చుననీ



చదువుకున్నవాళ్లందరికీ చదువుకుతగ్గ ఉద్యోగాలు వస్తాయనీ సుందరం నమ్మకం....

సుందరం ఇంకా చాలా విషయాలు గమనించాడు. పిల్లలు తమ ఇళ్లకు వెళ్లినప్పుడు తాము పాడరు. కొన్ని ఇళ్లకు పోగానే పంతులుకూ, పిల్లలకూ ఇచ్చేదేదో, ఇచ్చేస్తారు. మరికొన్ని ఇళ్లల్లో ఎంతసేపటికీ తేలదు. కొందరు తరవాత మాసి మెల్లిగా ఇస్తాం లెమ్మంటారు. కొన్నిఇళ్లల్లో పప్పుబెల్లాలు ఎక్కువిస్తారు, కొన్నిఇళ్లల్లో తక్కువిస్తారు. కొందరు పంతుల్ని మర్యాదగా "ఏమండీ", అంటే మరికొందరు "ఏమయ్యా, పంతులూ", అంటారు.

ఒక ఇంటో ఎవరో ఆయన సుబ్రమణ్యాన్ని, ''ఏమండీ, మేష్టరుగారూ? జయాభి జైభవాఅంటే ఏమిటర్థం? దిగ్విజైభవా ఏమిటి?'' అని అడిగాడు.

పంతులు నవ్వి ఊరుకున్నాడేగాని సమాధానం చెప్పలేదు. రెండో ఆయన వదల్లేదు.

''జయ విజయీభవా, దిగ్విజయీ భవా అన్నముక్కను ఇట్లాఅపభ్రంశం చేస్తున్నారు. మనచదువు లిట్లా అఘోరిస్తున్నయ్,''అన్నాడు.

ఆ ఇంటోనుంచి బయటికి వస్తూనే పిల్లలు, ''జయాభిజైభవా! దిగ్విజైభవా'' అని కేకవేశారు. తప్పొప్పు లెవరికావాలి? సంస్కృతికన్న సంప్రదాయం బలమైనది; అర్థంకంటె వినాదం బలమైనది.

* * *

ఇవి సుందరానికి చాలా ఉల్లాసపు రోజులు. దసరా వెళ్లినట్టే లేదు. దీపావళి వచ్చింది. రేపు దీపావళి అనంగా నరక చతుర్దశి నాడు సాయంకాలం తలవని తలంపుగా సుబ్బులు సుందరం ఇంటికి వచ్చాడు.

"ఇవాళ నరకాసురవధ నాటకం ఉంది. మనం ఊరికే పోవచ్చు. వస్తావోయ్?" అన్నాడు సుబ్బులు.

సుందరం ఎన్నడూ నాటకం చూడలేదు. "మా అమ్మ నడగాలోయ్," అన్నాడు సుందరం, ఆవిడ ఒప్పుకుంటుందని ఆశ లేకుండా.

వాడనుకున్నట్టే ఆవిడ, "ఎందుకురా నాటకాలూ? నిద్ర దండగా!" అన్నది.

"ఊరికే వస్తుంటే పోవటానికేమమ్మా?" అన్నాడు సుందరం, తల్లి డబ్బుకు లోభిస్తున్నట్టు.

సీతమ్మ చాలా అభ్యంతరాలు చెప్పింది. సుందరం మధ్యలో నిద్ర పోతాడు. అర్ధరాత్రివేళ ఎవరు ఇంటికి చేరుస్తారు?

సుందరం మాట్లాడలేదు. కాని వాడికి ఆశాభంగం అయినట్టు ఆవిడ తెలుసుకున్నది. "వీడిప్పటినుంచే నాటకాలు మరిగితే చదువురాదు," అనుకున్నదావిడ.

తన నిర్ణయంమీద పూర్తివిశ్వాసం లేకనో ఏమో ఆవిడ నాటకం మాట శ్రీమన్నారాయణ దగ్గిర ఎత్తింది. ఆయన అందర్నీ నాటకానికి బయలుదేరతీశాడు.

నాటకం హాలు దగ్గిర దీపాలూ, కేకలూ, మేళాలూ, జనం—సందడిగా ఉంది. సీతమ్మనూ, సుందరాన్నీ ఆడవాళ్లలో కూచోబెట్టి శ్రీమన్నారాయణ ఎనిమిదణాల టిక్కెట్టులో కూచున్నాడు.

హాలులోపల తెరలూ అవీ చూసి సుందరం చాలా సంతోషించాడు. ఆ తెరలేస్తుందనీ, మనుషులు వేషాలు వేసుకొచ్చి నాటకం ఆడతారనీ సీతమ్మ కొడుక్కి చెప్పింది. తెర ఎట్లా లేస్తుందో వాడూహించలేకపోయినాడు.

సుందరం జనంమధ్య నిలబడి చూస్తుంటే ఎక్కణ్ణుంచో చూసి సుబ్బులు గుర్తుపట్టాడు. వాడుకూడా ఆడవాళ్లలోకి వచ్చి, "అరె, నువు వచ్చావే? రా, మానాన్నను చూపిస్తా," అని సుందరాన్ని పట్టుకెళ్లాడు.


ఇద్దరూ కలిసి స్టేజిలోకి వెళ్లారు. అక్కడ వేషాలు వేసుకుంటున్నవాళ్లూ, వేసుకున్నవాళ్లూ కనిపించారు. వాళ్లకేసి సుందరం మతిపోయినట్టు చూశాడు. ఒక పక్కగా ఒకావిడ బీడీ కాలుస్తూ ఎవరితోనో మాట్లాడటం కనిపించింది "ఆవిడ" మగవాడేనని సుందరం ఊహించలేదు.

"ఇదుగో, నాన్నా, సుందరం, వాళ్లమ్మా, నాన్నకూడా వచ్చారు నాటకానికి," అన్నాడు సుబ్బులు.

సుబ్బులు మాట్లాడుతున్నది "ఆవిడ"తోనే అని సుందరం కల్లోకూడా అనుకోలేదు.

"అట్లాగా?" అన్నా "డావిడ" నోట్లోనుంచి బీడీతీసి.

"చూడు, సుబ్బులూ, శేషాచలాన్ని పిలిచి ఈ అబ్బాయినీ, వాళ్లనాన్నగారినీ రిజర్వుడులో కూచోబెట్టించు."



"అట్లాగే, నాన్నా....రా రా, సుందరం."

మిగిలిన పనంతా సుబ్బులు తనంతట తనే నిర్వహించాడు. మొదట శ్రీమన్నారాయణ "ఎందుకులెండి? ఇక్కడ బాగానే ఉన్నది," అన్నాడు గాని ఆ శేషాచలమన్న మనిషి విడిచి పెట్టలేదు.

సుబ్బులుకు తెలిసిన విషయాలలో తనకు సహస్రాంశం తెలీదని సుందరానికి అనిపించింది.

"చూడు, సుబ్బులూ! నువు ఆలోపల మాట్లాడావే—మీనాన్నా?" అన్నాడు సుందరం.

సుబ్బులు నవ్వి, "అవును. ఆడదానల్లే ఎట్లా ఉన్నాడో!", అన్నాడు.

నాటకం మొదలయే సరికి సుబ్బులూ, సుందరంకూడా శ్రీమన్నారాయణ పక్క చేరారు.

ప్రార్థనా, తెరఎత్తుకోవటం దగ్గిర్నుంచీ నాటకం ప్రతిక్షణమూ ఎంతో అద్భుతంగా తోచింది సుందరానికి. అన్ని వేషాలలోకీ కృష్ణుడివేషమూ, సత్యభామవేషమూ వాడికి చాలా అద్భుతంగా ఉన్నాయి. సత్యభామ వేషం వేసింది సుబ్బులు నాన్నే.

ఇంటికి తిరిగొచ్చేటప్పుడు శ్రీమన్నారాయణా, ఆయనకన్న ఎక్కువగా సీతమ్మా నాటకాన్నిగురించి మాట్లాడుకున్నారు.

"ఏం జరిగిందనుకున్నారూ? సత్యభామవేషం వేసినాయన పెళ్లాం మా పక్కనే కూచుంది. ఆ వేషం వచ్చినప్పట్నుంచీ ఆవిడ కళ్లుమూసుకూచుంది, పాపం. మొగుడు ఆడవేషం వేస్తే పెళ్లాం చూడరాదు," అన్నది సీతమ్మ.

"ఎందుకు చూడరాదో? చూస్తే ఏమవుతుందో?' అనుకున్నాడు

సుందరం. తల్లి మాట్లాడుతున్నది సుబ్బులు తల్లినిగురించి అయివుండాలని ఎంతోసేపటికిగాని సుందరానికి తట్టలేదు.

దీపావళి పండగ సరదాగా వెళ్లిపోయింది. శ్రీమన్నారాయణ బందరు తోటాలు దొరికితే కొనికాల్చాడు. ఆయన అవి కాలుస్తున్నంతసేపూ సీతమ్మ, "ఇవెందుకు తెచ్చారండీ? భద్రమండీ!" అంటూనే ఉన్నది.

సుందరం పువ్వొత్తులూ, పగలొత్తులూ, చిటపటాలూ కాల్చాడు. రంగు విప్పెట్టెలుకూడా కాల్చాడు.

దీపావళి వెళ్ళిన పది పదిహేనురోజులకు సీతమ్మ ఆడపిల్లను కన్నది.

తల్లి పురిటింటోఉన్న పది రోజులూ సుందరానికి పిచ్చిపిచ్చిగా ఉన్నది. ఆ తరవాత మళ్లా జీవితం యథాప్రకారమయింది.

* * *

సుందరం ఇంగ్లీషు అక్షరాలు నేర్చుకుంటున్నాడు వాడుతనదగ్గిరికి రాకుండా, తన సహాయంలేకుండా "ఏ, బీ, సీ డీ" అంటూ అక్షరాలు దిద్దుకుంటూంటే సీతమ్మకుఎందుకోకష్టంవేసింది. అప్పుడే వాడుతనకు అలివిగానిచదువులో పడ్డాడు. వాడు తనచేత అక్షరాలు రాయించుకుని దిద్దినరోజులు జ్ఞాపకంచేసుకుంటే ఎంతో కాలమైనట్టుగా తోచిందావిడకు. వాడితో పాటు తానుకూడా ఇంగ్లీషునేర్చుకుందా మన్న ఆలోచనకూడ కలిగిందిసీతమ్మకు. కాని సగం పిల్లతోతీరకా, సగం ఎవరన్నా నవ్వుతారన్న బిడియంచేతా ఆపని చేయలేదావిడ. ఎప్పుడన్నా వాడుదిద్దే అక్షరాలకేసిచూసేది. వాడు అక్షరాల పేర్లు పైకి అంటుంటే వినేది. అంతే.

హైస్కూళ్ళకు వేసవి శలవులిచ్చే సమయానికి సుందరం ఇంగ్లీషు రీడరు పూర్తిచేశాడు.

అప్పటికే శ్రీమన్నారాయణకు అస్వస్థత ప్రారంభమయింది. ఆయన ఉద్యోగానికి శలవుపెట్టి ఇంట్లోనే ఉండి మందు పుచ్చుకుంటున్నాడుగాని ఏమీ ఫలితం కనిపించలేదు. నాటువైద్యులు రక్తహీనత అన్నారు. "అపాతికరీ" కూడా చూశాడు. ఆ జబ్బు బెరిబెరీ అనీ ప్రమాదకరమనీ ఆయన చెప్పాడు. ఆయన ఏదో మందిచ్చాడు. కాని ఏ వైద్యమూ ఫలించలేదు.

మేనెలఆరంభంలో శ్రీమన్నారాయణ పోయినాడు. చెడ్డనక్షత్రం. సుబ్బమ్మగారూ వాళ్లూ ఇంకో ఇంటికివెళ్లిపోయినారు. ఇల్లుపాడుపెట్టి, వైధవ్యంతో రూపుమారిన చంటి పిల్లతల్లి సీతమ్మ, సుందరం దగ్గిరలోనే మరొక ఇంట చేరారు.

ఈ స్థితిలో సీతమ్మకు శేషగిరివచ్చి చాలా సహాయంచేశాడు. (సశేషం)



# ఆ నిమిషం!

ఎంత విలువైనది ఆ నిమిషం! ఎంత కోరుకున్నా మళ్లా వస్తుందా?

మిగిలిన నా ఆయుఃపరిమాణమంతా ఇచ్చివేస్తాను—ఆ నిమిషాన్ని మళ్లా, ఒక్కపర్యాయం, నేను అనుభవింపకలిగితే.

"ఇంకా ఎన్నో, ఎన్నో, అనుభవాలు వస్తాయి నీ జీవితంలోకి. నీవు కలలోనైనా ఊహింపని సౌందర్యం, ప్రేమ, గౌరవం నీ నిత్యజీవితాన్ని నింపివేస్తాయి. కాల స్రవంతిలో పడిపోయిన ఆ నిమిషమే ఎందుకునీకు?" అంటుంది సూర్యాస్తమయ సమయంలో కారుమేఘపుటంచును వెండి బంగారాలతో అలంకరిస్తూ, విధి.

ఆ అందం, కన్నులు మిరుమిట్లుగొల్పే ఆ రేఖలు ఎంతోసేపు ఉండవు. మళ్లా క్రొత్తఅందం వస్తుంది. క్రొత్తరేఖలు వస్తాయి. నాకుమాత్రంఅప్పుడు చూచిన ఆ వెండిబంగారపంచే, ఆ వంపే కావాలి. మళ్లా ఎలా వస్తుంది?

నిశీధి!

ఆమె నన్ను విడిచివెళ్ళిపోతూంటే, ఎడబాటుభరింపలేక, ఆమెను సాగనంపడానికి నూరుమైళ్ళు ఆమెతో కలసివెళ్ళాను. రైలులో అందరూ హాయిగా నిద్రపోతున్నారు దీపాలు ఆర్పివేసి. మేమిద్దరము ఉన్నచోట మాత్రం నక్షత్రాలవెలుగు, ఆమెకళ్ళ ధగధగ.

ఆమె కెందుకులేదో విడిచివెళ్ళిపోతున్నామనేబాధ! ఎంతో ఉత్సాహంతో మెరిసి పోతున్నాయి ఆమెకళ్లు:

"ఎక్కడుంటేఏమి సుకుమార్! మనకు ఎడబాటు అంటూ ఉందా? నీవు నాలోనేఉంటావు ఎల్లప్పుడూ!"

—ఎలా వస్తుందో ఆడవాళ్ళకు అంత ధైర్యము!!

స్టేషను. నేను దిగిపోవాలి.

తలుపుతీసి, ఆమె నన్ను క్రిందికి దింపింది. గులకరాళ్ళనేలపై నాపాదాలు ఆనినతర్వాతనే ఆమె తనవ్రేళ్లు తీసుకుంది నా గుప్పిటిలోంచి. ఎంత గట్టిగా పట్టుకున్నాను! పాపము—కందిన తనవ్రేళ్ళను ఆమె తన పెదవులకు తాకిస్తూండగానే రైలు కదలి సాగిపోయింది....

ఎంతోదూరాన, మరోప్రపంచంలోంచి, రైలు కేక వినబడింది—అంతే.

మర్నాడు ఆమెవద్దనుంచి ఉత్తరం వచ్చింది. ఒక్కపంక్తే:

"God! give me back yesterday!"

నాకుమాత్రం, రోజంతా అక్కరలేదు. నా గుప్పిటిలో నలిగిపోయిన వ్రేళ్ళను ఆమె తనపెదవులకు స్పృశిస్తూన్న ఆ నిమిషం ఇచ్చివేస్తే చాలు. ఆ ఒక్కనిమిషం!

రచన:

[illegible] జానకిరామ్

# పండగనాటి పాట

నిడదవోలుకి ఉత్తరాన పదిమైళ్ళదూరాన ఉండే రెడ్డిసీమలోని వెల్లపర్రుగ్రామానికీ, కాలవకింది జల్లిసీమకీ పోలిక ఎక్కడా కనబడదు! నిడదవోలునుంచి ఉత్తరంగా ఆరుమైళ్ళు మట్టిరోడ్డుమీద ప్రయాణం చేసి నాలుగుమైళ్ళపాటు ఇసకలో పొగలిగితే వెల్లపర్రు జేరతాము. మొదటి ఆరుమైళ్ళ మాటకేం, మిగతా నాలుగు మైళ్ళపాటు బండీ వెళ్ళేటప్పటికి పనవుతుంది. మోకాలిలోతు ఎర్రని బొండు ఇసక. బళ్ళగాడి ఎప్పుడూ ట్రామ్ బద్దీలలాగ, రైలు పట్టాలలాగ చెక్కు చెదరకుండా స్థితంగా ఉంటుంది. పుంతకి ఇటు అటు వుండే కట్టవలు చూస్తే మహారణ్యం మధ్య పోతున్నాం, పెద్దపులి తినెయ్యదు కదా అనిపిస్తుంది. కాస్త ఏ ముషిణిమొక్కో, ఏ గొలుగు కంపో ఒత్తిగిలించిచూస్తే, ఏదీ అడివి! "సాగుమానం" చేసే దేశమే అంతా! మప్పవాటు స్థలం ఎక్కడో కాని తగలదు, పుంతని చూసి బెదిరిపోకుండా ఉంటే సరి. పుంతలో లేని మొక్క అడివిలోనూ లేదు. వెనకటి అడివి అంతా పుంతలో మట్టుకు నిలిచిఉంది. మిగతా అంతా ఏదోరకం వ్యవసాయంలోకి దింపేశారు.

పుల్లయ్య వెల్లపర్రులో బీదరైతు. బీదపాలాలలో ఉండేది బీదరైతే! ఏ చెలకైన—ఎకరం వందదాటేది—ఆ చుట్టుపట్ల మూడుమైళ్ళలో లేదు. వెల్లపర్రుకి బాడవకి సంబంధమే లేదు!

పుల్లయ్య వయస్సు అట్టే ఉండదు. నలభై. పల్లెటి జీవనానికి అదో వయస్సు కాదు. కడుపు పూర్తిగా నిండితే, చిన్నప్పుడు తల్లి నీళ్ళుపోసినప్పుడల్లా దీవించిన శతాయువులో ఒక్కమాసమేనా తగ్గదు.

పుల్లయ్య ధోరణి పుల్లయ్యదే. అన్నంత మాత్రాన్ని అతను అందరితోపాటు ఉల్లిందచెట్టుకింద కూచుని రాత్రుళ్లు కబుర్లు చెప్పుకోడనికాదు. ఎన్నికబుర్లు చెప్పుకున్నా తెల్లారేటప్పటికి ఎవడిదోవ వాడిది. అంతా గుణుపూడి జంగాల తంతు. ఎదుటివాణ్ణి "పారఓమాటియ్యి, అన్నా!" అని నోరు విడిచి అడిగినా మొహమాటపడి ఇచ్చేవాడులేడు.

పుల్లయ్య ఇల్లు ఊరికి తూర్పు కొనని ఉంది. ఏదో తాటాకుల కొంప. చుట్టూ అడివికంపదడి. ఇంట్లో శుభ్రంగా ఉంటుంది. ఇంటిచుట్టూ అన్నిఇళ్ళలాగే చెత్తమొక్కలు బలిసిఉన్నాయి. ఇప్పుడు కెనవిందమొక్కలు గజమెత్తు పెరిగి

పేకుమళ్ల కామేశ్వరరావు

పూస్తున్నాయి. ఆ చెత్తనిగురించి ఎవరికీ అక్కరలేదు. అమాట చెప్పక్కరలేదు. మార్పు అనేది ఒకదాంట్లో ఉంటేగా ఇంకోదాంట్లో ఉండడానికి.

ఈ ఏడు తొలకరి తొలీత పాడైపో యింది. రోహిణి కార్తి, మృగశిర కార్తి కూడా దగాచేశాయి. ఆ తర్వాత కత్తెరలో పడ్డ చినుకులే ఆధారంగా పుల్లయ్యా అరపుట్టి భూమిలోను కొంత గంటెలు, కొంత నువ్వులు చల్లాడు. పక్కచెలకలో వీరన్న వేరుసెనగ జల్లగా తనేం తక్కువ వాడా! తనుకూడా జల్లాడు అరఎకరం వేరుసెనగ. రైతుకి సాహసంలేకపోయినా, పోటీ, వేలంవెర్రి లేకపోలేదు. కాకపోతే ఈ సీమలో ఏకాస్త నల్లమట్టిఉన్నా, ఎర్రమట్టిఉన్నా దొరపొగాకువేసి చుక్కలు లెక్కెడుతూ కూచోడము ఏమివచ్చింది?

మొదట్లో చేను జబ్బిచ్చింది. గంటెలు ఎంతో అవలేదు. రెండుబస్తాలయాయి. నువ్వులు రెండుబస్తాలయాయి. ఇంకా పైడన్నలాగ కలుపు తీయించలేదు. ఇనకగరువులికి కలుపుకూడానా తీయిం చడం! తీయిస్తే దానికి దీనికి సరిపోతుం దని వెల్లపల్లెలో సామెతగా చెప్పు కుంటారు. కాని దగ్గిరఉన్న తాళ్లవరంలో తీయించడమే రివాజయింది. అక్కడ మోతుబరులున్నారు. దేని కేది కారణమో ఎలాగ చెప్పడం!

ఏదో నాలుగుపుట్లనేల ఉన్నవాడు కాని పంటలుచెడిన కాలంలో నిలతొక్కుకో లేడు. పుల్లయ్యా తేలేదేమిటి! ఎకరానికి చచ్చు పావలాపన్నుఅయినా అతనికి మొయ్యలేనంతబరువుగా ఉంది. వెధవ చెలకలు దుక్కిచేస్తే ఇలాగే ఉంటుంది! గడ్డిపట్టిందని సంతోషించవలసిన పల్ర లకి "సాగుమాన" మేమిటి! కడుపు కన్నూ్కర్తికి మితిలేదు.

ఈ ఏడాది ఇంకా చెలకమార్చడం మంచిపనయింది. క్రితం నాలుగేళ్లు బీడుగా విడిచిపెట్టిన పొలమే ఈ ఏడాది దుక్కిచేసింది. అదేయిలాగ ఏడుస్తే, ఇంక మార్పులేకుంటే పుల్లయ్యాపని ఏమయేదో! ఏమయేది, నిడదవోలులో బస్తాలు మోసు కొంటూన్న చెల్లయ్యా, బుల్లిగాడి పని ఏమయిందో అంతే అవుతుంది.

గంటెలు అలాగే ఉండనిచ్చి, నువ్వులు అమ్మేశాడు. వచ్చిన రాళ్ళతోటి వేసంకాలంలో భోజనానికి చేసిన అప్పు తీర్చేశాడు. మళ్ళా తాను మిగిలాడు. అర్ధ ఎకరం వేరుసెనగ పనికొస్తుందేమో అని ఆశపెట్టుకున్నాడు కాని రైతు అంత తెలివితక్కువవాడుకాడు. అంత పనికొచ్చే పంటేఅయితే ఇదివరకే అది పాకిపోను. అయినా ఒకసారి వేస్తేగాని మంచిచెడ్డలు ఎవరికీ తెలియవు. వేరుసెనగకి వేరు పురుగుపట్టేసి కాయ తప్పడయిపోయింది. పుల్లయ్యా ఆశ్చర్యపోలేదుగాని, కంట తడి పెట్టడం మానలేకపోయాడు. అరెకరంలో ఏగంటెలువేసినా నువ్వులువేసినా బాగుండిపోను అని గట్టిగా అనుకున్నాడు. సంకురాత్రిదాకా ఎలాగో గడవాలి. ఇంట్లో గంటెలు అందాకా వస్తాయా?

రెండోపంటగా ఉలవలు, పచ్చజొన్న పడేశారు. ఇంతట్లో మంచి వర్షాలు లంకించుకున్నాయి. బెండడివేసిన చేను. పైగా జొన్నకి అంత వాన అక్కర్లేదు. నేల బిగిసిపోయింది. జబ్బొచ్చినట్టు కనబడుతూందికాని ఇంతట్లో బెంగపెట్టుకోనక్కర్లేదు.

మూడోపిల్లవచ్చి ముద్దుగా "నాన్నా! టపాకాయలెప్పుడూ కాల్చడం" అంది. పుల్లయ్యకప్పుడే స్మరణకొచ్చింది, దీపావళి సంగతి. అంతకిముందొకసారి దీపావళినాడు కొత్త పంచ తాను కట్టి, పిల్లలకి కొత్తచొక్కాలు కుట్టిద్దామనుకున్నాడు. ఆ సంగతి జ్ఞప్తికిరాగా అనుకోకుండానే "ఇస్సు" అన్నాడు.

రెండో కొడుకు కూడా గారాబుగా తండ్రిని అక్కవేసిన ప్రశ్న వేశాడు. పుల్లయ్య "శానాటపాకాయలట్టుకొత్తానేం" అన్నాడు. జవాబుతో తాను కొంత తృప్తి పడ్డాడు, పిల్లలూ పడ్డారు.

ఇంకా ఊరుకోక "ఎన్నట్టుకొత్తావు, అయ్యా?" అంది మూడోపిల్ల తండ్రిగడ్డం తనవైపు తిప్పుకొంటూ.

పుల్లయ్య గడ్డం విడిపించుకొని "అట్టు కొత్తాలే" అంటూ లేచిపోయాడు. చూరున పెట్టిన పొగాకుచుట్ట తీసి రెండుచుట్టలు చుట్టి, ఒకటి తలపాగలోదూర్చి, రెండోది ముట్టించి, కాడెద్దుల్ని, ఆవుని విప్పి బీడుకి తోలుకుపోయాడు.

పెద్దపున్నమికి సకుటుంబంగా చిన్న తిరపతికి వెళ్ళి కల్యాణం చూసొద్దామని పుల్లయ్య చహరావేసుకొన్నాడు. కాని ఇంట్లో తిండిగడవడమే తీర్థయాత్రగా ఉంది. చేతిలో ఎర్రని ఏగానిలేదు. ఇల్లిసీమనుంచి వచ్చే ఈడిగలు 'కాయికం'కోసం కట్టవలలో ఉన్న నలభై తాళ్ళని పుచ్చుకుని ఏదేనా చేతిలో పెడితే అప్పుడు మళ్ళా రాగిడబ్బు కళ్ళతో చూడడం. ఈలోపల ఇంతే! అయినా కోరికలలో లోపముండనక్కరలేదుగా.

అతను సాయింత్రం ఊరికే ఉల్లిందచెట్టు నీడని ఒంటరిగా గొంతుకూచుని, "చిలకొట్టు" ముట్టించి, రైలుఇంజనులాగు గుప్పుగుప్పున పొగజిమ్ముతూ, ఓరగా మొహంపెట్టి, చెలకలోఉండే తాళ్ళని గురించి కలలుకన్నాడు. మొదట్లో ఎకరానికి ఉండే నలభైతాళ్ళలోను ఓదరం వల్ల చేను గడ్డేనాపట్టకపోగా ఎకరానికి ఇరవైచేసిన సమయం, అప్పటికీ మరే పంటాకానందువల్ల కట్టవలలో మాత్రం మిగిల్చి తక్కినవాటిని కొట్టించి పారవేసిన విషయం, జ్ఞప్తికితెచ్చుకొని ఆ తాళ్ళన్నీ ఎప్పటిలాగే ఉంటే ఎంతడబ్బు వచ్చునో అని తలపోశాడు. బాగానేఉంది. ఆ తాళ్ళన్నీఉంటే చేననేది ఏదీ! మరీ బాగుంది!

దీపావళి పదిరోజులలో ఉంది. పెద్ద పిల్లాడు పన్నెండేళ్ళవాడు, పుల్లయ్య బుజాలుపట్టుకొని వెళ్ళాడుతూ "నాన్నా! చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, మరొచ్చి మతాబాలు ఎప్పుడు తెత్తావు?" అని ముద్దులుఓడాడు.

పుల్లయ్యమనస్సు నీరయిపోయింది. అసలు పెద్దవాడు ఏపీ అడగనే అడగడు, పాపం! పుల్లయ్యమనస్సులో కాయికం వచ్చేదాకా కడుపునిండే దెలాగ అని ఆలోచిస్తూ, పిల్లాడిమాట కాదనలేక, ఇంతకీ ముందెంత అదృష్టముందో ఎవడు చూడవచ్చాడనే వేదాంతంతోను "అలాగే కొనుక్కుందాంలే, రాయమండ్రీ యెల్లి" అన్నాడు; మనస్సులో, తాగే పాలకి దొప్పలేంగతి బంగారవుగిన్నెలే అనుకోవచ్చు అన్నట్టుగా!

ఇంతట్లో రెండోకొడుకు తండ్రిచుట్టూ గంతులేస్తూ "నిడదవోలులో కొనుక్కుందాం నాన్నా!" అన్నాడు.

"అలాగే అబ్బాయి!"అని ముక్తసరిగా అన్నాడు. తండ్రీ పిల్లలూ సంతోషించారు.

దీపావళి దగ్గిరపడుతూంది. ఊర్లో ఏదో మూల 'టుప్' అనో 'బుస్' అనో 'ఢాం' అనో అంటూ ఉంటుంది. ఇంకా అసలు రోజుంది. దేవాసురయుద్ధంలో జరిగినంత గడబిడ జరుగుతుంది. నరకాసురుడిమీద మనుష్యులకుండే కక్షంతా తీర్చుకోవాలి.

ఎల్లుండే దీపావళి.పుల్లయ్యకి పొద్దున్న తాగేగంజి సయించలేదు. వరిమాసేశాక గంటెల జావ ఇంకా ఒంటికి సరిపడ లేదేమో అనుకున్నాడు. పెళ్ళాం అడిగింది, "అలా ఉండావేం?" అని పెద్ద దీర్ఘం తీసుకుంటూ. "ఏంలేదు"అంటూ అతను అవతలకి వెళ్ళిపోయాడు. అతని బుర్రలో ఏదో ఆలోచన ఆగకుండా పని చేస్తూంది.

పండగముందురోజు పెళ్ళాం అడిగింది. "నిడదవోలెల్లి ఏమేనా కొనుక్కొత్తావా యేంటి, పిల్లలు సంపేత్తున్నారు మరి" అని.

"నీకు తెలీందేముంది. ఉంటే అలాగే" అన్నాడు మొగుడు.

"ఏమో మరి సూడు. గంటెలిచ్చేనా ఏదేనా అట్టుకొత్తేగాని ఐతకనియ్యరు. పండగలేకుండా సేత్తావేంటి పిల్లలకి" అంది బారెడు దీర్ఘంతో.

ఆమెకిమట్టుకు ఇంట్లో సంగతి తెలియకనా? తెలిసినా, దేనిదోవ దానిదేఅన్న వేదాంతం!

పండగ ఆరోజే. పిల్లలు అయిదుగురూ కోటని ముట్టడించినట్టుగా తండ్రిని చుట్టు ముట్టేశారు. పుల్లయ్యమట్టుకు ధ్యానముద్రలోఉన్న యోగీశ్వరుడిలాగ ఉన్నాడు. అతనికి చిరాకుకూడా కలగలేదు. పిల్లలు అడక్కొంచేస్తారు!

"గుడ్డముక్కనాలేదు, టపాకాయలు కూడా లేకుండా సేత్తావేంటి, బతికున్నవాళ్ళు ఉండేదరిద్రమే. గంటెలిస్తా కట్టుకెళ్ళి అట్టుకురా" అంది పెళ్ళాం నిస్సంశయంగా.

"అలాగేలే" అని, ఆలోచనగా "ఎందుకులే, ఉంది" అన్నాడు పుల్లయ్య.

ఎక్కడో నాలుగురూపాయలు తనకి చెప్పకుండా దాచిఉంటాడు అనుకుంది పెళ్ళాం. ఆడదానికి డబ్బువ్యవహారాలు తెలియనియ్యడమెందుకని తక్కిన తన కులస్థులలాగే పుల్లయ్య ఊహకూడా. కాని బండారం బయటపడుతూ ఉంటుంది.

"బేగి చల్దికూడెట్ట" మన్నాడు పుల్లయ్య. పచ్చిమిరపకాయ చురుక్కని పించి గంజి జుర్రేసి, పిల్లలు పొలంవైపు తిరిగే సమయం చూసి, భార్యతోటి "నిడదవోలెడుతున్నా" అన్నాడు.

"బేగిరా. అళ్లు నిద్ర వో యాకవత్తే ఎందుకు? సరదాపడుతున్నారు" అంది ముక్తసరిగా.

పుల్లయ్య కంగారుపడకుండా గడప దాటాడు. ఒంటిమీది పైగుడ్డతోటే వెళ్లిపోతూంటే, తనకి తెలియకుండా దాచిన డబ్బులు రొంటిని పెట్టుకు వెళుతున్నాడు అనుకుంది భార్య పాపం!

పుల్లయ్య నిరుత్సాహంగా నడుస్తున్నాడు. పండగనాడు ఇంట్లో ఉండనందుకు విచారిస్తున్నాడు. ఉండడానికి వీలులేని పరిస్థితులు వచ్చాయి మరి. నిడదవోలు జేరుకొన్నాక ఏదోకూలి దొరక్కపోతుందా, ఆ డబ్బులెట్టి తాటాకుటపాకాయలేనా కొనుక్కు వెళ్ళలేకపోతానా అనే అలోచన దారిలో కలిగింది. ఊరు చేరుకున్నాడు. కూలిపనికోసం తిరిగాడు. పండగనాడు పాటు ఎవడికి కావాలి! దొరకకపోగా, అదే పోయెలే అనుకున్నాడు.

నిడదవోలులో రోజల్లా టుప్పుమని, బుస్సుమని, ఢాం.అని చప్పుడవుతూనే ఉంది. సాయింత్రమయేసరికి ప్రమిదలలో దీపాలు వీధిఅరుగులమీద కళ్లవెలుగుగా ఉన్నాయి.

పండగనాడు ఇంట్లో లేనందుకు పుల్లయ్య కాస్త విచారించాడు. వేడుకలు చూద్దామని ఊరంట తిరుగుతున్నాడు. టపాకాయిలు, మతాబాలు, చిచ్చుబుడ్లు, అవ్వాయిలు, తూటాలు ఒకటేమిటి సమస్తమూ నేలమీద గిజగిజలాడుతున్నాయి, ఆకాశంమీదికి ఎగిరిపోతున్నాయి, భస్మమయిపోతున్నాయి. తను కాల్చలేకపోయినా చూసేనా అనందిస్తున్నాడు పాపం! జట్లీలుగా ఏర్పడి పోటీగా ఒకరిమీద ఒకరు తారాచువ్వలు, వెలక్కాయలు, తూటాలు విసురుకుంటున్నారు. అందులో పుల్లయ్య చిక్కడ్డాడు. అతని పైగుడ్డమీద తూటారవ్వలు పడ్డాయి. బట్ట గబగబ దులిపి అక్కడినుంచి దాటి అవతలపడి ప్రాణం దక్కించుకున్నాడు.

రాత్రి పన్నెండుగంట లయింది. దీపాలవెలుగు, బాణాసంచా చప్పుడు కూడా తగ్గిపోయాయి. పుల్లయ్యకి కాళ్లు పీకెట్టాయి. ఒకరి అరుగుమీద ఒకటే ప్రమిద కునుకుతూంటే తానుకూడా ఆ అరుగుమీద నిద్రపోడానికి చేరాడు. కళ్లు మూశాడు. తాను తిరిగినచోట్ల జరిగిన ప్రదర్శనమంతా కళ్ళముందు సినిమాలాగు నడుస్తూంది. మరి కాస్సేపటికి ఇంటిసంగతి జ్ఞాపకంవచ్చింది. పిల్లల సంగతి స్ఫురణకిరాగా మనస్సు అపుకోలేకపోయాడు. ఒక్కమాటుగా దుఃఖం వచ్చింది. పిల్లలు ఏమవస్థ పడుతున్నారో? అందులో రెండోవాడు తగనిగోల చేస్తాడు. తల్లిచేత ఎన్నిదెబ్బలు తిన్నాడో, అని కంటతడి పెట్టుకున్నాడు. పడుకున్న



వాడల్లా లేచికూచున్నాడు. ఇంటికి పోవాలనే బుద్ధిపుట్టింది. బలమయింది. అరుగు మీంచి దూకి ఒళ్లుదులుపుకుని ఇంటికి చక్కా బయలుదేరాడు.

ఇంటికి వెళ్ళాక టపాకాయలు ఏవని పిల్లలు అడుగుతారు అనే ఆలోచన పుట్టింది. వెంటనే రోడ్డుమీద అక్కడక్కడ కాలకుండాపడివున్న టపాకాయలు, పార వేసుకున్న నాలుగు అగ్గిపుల్లలు, నాలుగు కాకరతీగెలు, రెండు చిచ్చుబుడ్లు, రెండు తూటాలు పోగుచేశాడు. ఇంకా వెతుకుతూంటే ఒకటి రెండు మతాబాముక్కలు మంచివి దొరికాయి. మరొక తీగెకాకర పువ్వువత్తికూడా దొరికింది. దానిమీద ఆశపుట్టి ఇంకా కాస్త వెతకాలనిపించింది.

ఒకళ్లు అరుగుమీద చీకటిలో మరిచిపోయిన నాలుగు అవ్వాయిచువ్వాయిలు, రెండు చిచ్చుబుడ్లు కనబడ్డాయి. అతని సంతోషం మిన్నుముట్టింది. అతనికి హక్కు ఉన్నట్టే వాటిని కండువాలో మూట కట్టి ఇవి చాలని ఇంటికి చక్కా బయలు దేరాడు.

అర్ధరాత్రి. ఒంటరిగా పోతున్నాడు. కొంతదూరం వెళ్ళాక దారితోడు ఒకడు దొరికాడు. ఇద్దరూకలిసి ఒకమైలు నడిచారు. అటుతర్వాత తానుఒక్కడే నడక సాగించాడు. రోడ్డు ముగిశాక ఇసకలో నడిచి నడిచి తనకి పరిపాటయిన దోవయినా ఇంకా తెమలలేదేమనుకొంటూ, కొంప చేరుకున్నాడు.

తలుపు తట్టాడు. మూలుగుతూన్న రెండోకొడుకు గభాలున లేచాడు. వాడు తండ్రికోసం పుల్లయ్య వెళ్ళినప్పటినుంచి ప్రతిక్షణం ఎదురుచూస్తున్నాడు. "అమ్మా! నాన్నేవ్!" అని ఒక్క పొలికేక పెట్టాడు.

పిల్లలంతా లేచారు. "టపాకాయలు! టపాకాయలు!!" అని ఇల్లు హోరెత్తిపోయింది. కుక్కిమంచంలోంచి తల్లి నెమ్మదిగాలేచి, పిల్లల్ని గోలచెయ్యవద్దని కూకలేసి, తలుపుతీసి "నన్ను సావమని సెప్పి యెలిపోయావా?" అంది.

"నేనేం సెయ్యను?" అన్నాడు.

"నన్నుకూడా తీసుకెల్లలేకపోయావూ, పీడవదిలిపోను" అంది.

"ఏమొచ్చింది?" అన్నాడు జంకు మొహంతో.

"ఏమొచ్చిందేటి! కుర్రయెదవలు వద్దుమొర్రో అంటూంటె యినకుండా ఊతంట తెగతిరిగి ఒళ్లు కాల్చుకొచ్చారు" అంది.

పుల్లయ్యకి ఒక్కక్షణంమతిపోయింది. ఇంతట్లో రెండోవాడు కూనిరాగాలు తీస్తున్నాడు. "ఎందుకురాబాబు!" అని తండ్రి వాడిదగ్గరకి వెళ్లాడు.

"ఒళ్లు కాలితేని" అంది భార్య.


కొడుకు ఏడుపు ఎక్కువయింది. పుల్లయ్య ఎత్తుకున్నాడు. కుర్రాడు చెయ్యి ఎత్తి పెట్టుకున్నాడు.


"ఏంటినాయినా!" అని పుల్లయ్య అదుర్దాపడ్డాడు. తల్లి బుడ్డిదీపం తెచ్చింది. కుర్రాడి వాడిపోయిన కుడి అరచెయ్యి కట్టువిప్పి చూశాడు డబ్బంతమేర చర్మం లేదు.

పుల్లయ్యకి కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయి. తనని తిట్టుకున్నాడు. ఇంతట్లో పెద్దవాడు పుల్లయ్య బుజంవెనకాల ఉన్న మూట చూశాడు.

అందరూ చుట్టూ పోగయారు. మూట విప్పి వీధిలోకి తీసుకువెళ్ళారు. రెండో కొడుకుకూడా తండ్రి చేతులలోంచి కిందికిదూకి వాళ్లతో చేరాడు. తల్లి రెండు ప్రమిదలలో చమురుపోసి వత్తులు వెలిగించింది. బాణాసంచా కాలుతూంటే పిల్లలు ఆనందించారు. పిల్లల సరదా తీరిందని తల్లి సంతోషించింది.

కుర్రవాడి చురకనిగురించి ఆలోచిస్తూ పుల్లయ్య కూచున్నాడు.






నైమిశారణ్యంలో, సౌందర్యసీమలకు పరిపూర్ణత ఇక్కడే ఉందా అనిపించే ఆశ్రమం ఒకటి ఉన్నది. అది కౌశికునిది. పచ్చని గరికలు పరుపు దిబ్బల వలె పెరిగాయి. పూలమొక్కల్లోని సౌందర్యమూ పరిమళమూ కలిసి ఈ ప్రక్కనుంచి నాగుజాతులు వెళ్ళగలవా అన్నంత నిర్వహణను సూచిస్తున్నవి. ప్రక్కనున్న గరిక దిబ్బల వైపు మృగాలు నెమ్మదిగా, నిశ్చింతగా, ప్రశాంతంగా, సాగుతున్నవి. తాపసులుండడానికి ప్రశాంతమైన వాతావరణం ఇంతగా అవసరం కాదు. కాని అట్టి వాతావరణం వారు నివసించే చోట్ల స్వాభావికంగానూ ఆకస్మికంగానూ సృష్టింపబడుతుంది.

మార్గాయాస ప్రేరితుడై శిష్ట శ్రేష్ఠ వశిష్ఠుడు ఆశ్రమంలో గతదినాన్నే ప్రవేశించాడు. నిత్యానుష్ఠాన కర్మలు తీర్చుకొని, ప్రాతః సమయంలో ఆచరింప బడవలసిన జప తపాలు నెరవేర్చుకొని, ఆనాటి అతిథిగా ఉండమని కౌశికుడు కోరడం వల్ల, అక్కడనే ఉన్నాడు. వారిరువురూ ఇప్పుడొక ఉత్సాహవంతమైన చర్చలో నిమగ్నులై ఉన్నారు.

విశ్వామిత్రుడు అనుభవ ప్రేరితమైన ఆత్మవిశ్వాసంతో అడిగాడు: "అయోధ్య దిశనుంచే వస్తున్నట్టుచెప్పారు; శ్రీరామునిపాలన ఏవిధముగాఉంది? మీ అభిప్రాయం ఏమిటి?"

వశిష్ఠుడు కొలదిగా నవ్వాడు.

"ఏం - మీకంతటి సందేహం కలిగింది? శ్రీరాముడి పాలనగురించే అడిగారు! అది 'రామరాజ్యం'కదా! అతడు కేవలం మాయామానుష విగ్రహుడైన ఆదివిష్ణువుకదా!" అన్నాడు విశ్వామిత్రుని ఆత్మగర్వంలోకి తొంగిచూస్తూ.

"—అవునుగదా మరి! శ్రీరాముడంటే మీకూ మంచిఅభిప్రాయమేఉన్నది. అతనంత స్వార్థత్యాగి, దీనదయాళువు. త్రికాలల్లోనూ అరుదుగదా!" అని ఏమోచెప్పబోతున్న వాడిలా చూశాడు విశ్వామిత్రుడు.

"అవును — అందులో నాకూ పరిపూర్ణ విశ్వాసంఉంది!"

విశ్వామిత్రుడు తొందరగా చెప్పసాగాడు: "—అవునుగదా మరి! శ్రీరాముడు కేవలం మాయామానుష విగ్రహుడైన ఆదివిష్ణువు కదా! అతనిశక్తి అజేయం, ధర్మం అద్వితీయం; పరిపాలన అశ్రుతదృష్టచరమైన సౌభాగ్యసీమ. అట్టిప్రభువు త్రికాలాల్లోనూ అరుదు — కదా! నేను, చిన్నతనములోని శ్రీరాముడికి విద్యాభ్యాసంచేశాను. గొప్పవాడిగా చేయాలని సంకల్పించి అట్లానేచేశాను. ఈ నాటి అతనిగొప్పతనం అంతా నేను కల్పించి చూపించేనని నాకు తృప్తిగాఉంది. కాని మాటిమాటికీ నా మనస్సు ఒకేవిషయం గురించి అతిశక్తివంతమైన ఒక అసంతృప్తిలో మునుగుతూ అనునిత్యమూ తపన పడుతూఉంటున్నది. ఈ రాజవంశాన్ని "ఇనవంశ"మనీ "రఘువంశ"మనీ అంటారుగాని "రామవంశ"మని అనకుండా ఉన్నారు— ఇంతఅన్యాయం ఎందుకు జరగాలి?—

నిడదవోలు లింగమూర్తి

ఇనవంశమనడం పోనీ బాగానేవున్నది. కాని శ్రీరామవంశమని ఎందుకనరాదు! 'రామ' శబ్దమే పాపహారికదా. అనుదినమూ రామ వంశమంటూఉంటే లోకులపాపాలూపోతై. శ్రీరామునికీర్తీ బయటికొస్తుంది. ఇట్టి పాప హారిఐననామం ఉండగా, దైవత్వము పుడిసి లించే ఆ నామాన్ని. కేవలం నరమాత్రుడైన రఘువుకి వంశాన్ని అన్వయింపజేస్తున్నారే! ఇదిఎందుకు జరుగుతున్నది? ఒకవేళప్రజలలో చైతన్య రాహిత్యంవలన కలిగినఅనర్థమేమో! అట్టిసమయంలో యుగాలకే ముఖ్యమైన మనం ఊరుకోవడం మంచిపనిగాదు. మనం అధమం ప్రజలకి ఈ సంగతిని విస్పష్టంగా తెలియజేయాలి. ఏమంటారు?"

వశిష్ఠుడు కేవలం నవ్వాడు.

"ఏమిటి మీ అభిప్రాయం? ఈయుగానికీ ఇకముందు రాబోయేయుగాలకీ సంబంధించిన ముఖ్యసమస్యగురించి నేను మాట్లాడుతూంటే మీరు నవ్వడం అన్యాయం:" అన్నాడు విశ్వామిత్రుడు.

వశిష్ఠుడు స్నేహపిచ్ఛిలంగా నవ్వాడు. "కాని ఇందులో మీ పక్షపాత దృష్టి కొంత ఉన్నదేమో ననిపిస్తోంది."

"—ఆత్మసాక్షిగా లేదు!"

"అయితే ఈవంశానికి పేరు రామవంశ మనే ఉండాలంటారా?"

"అహా! మనస్ఫూర్తిగా!!"

"కాని శ్రీరాముడికన్న రఘువుచాలా గొప్పవాడు! రఘువంశమనే పేరే ఉండాలి!"

"రఘువుగొప్పవాడా? శ్రీరాముడి కంటేనా?"

"—కేవలం అంగీకరించక తప్పని విషయం!"

విశ్వామిత్రుడు హతబుద్ధిఅయినాడు. ఏమీ తోచలేదు.

* * *

ఒకనాడు రఘుమహారాజు పూజానిమగ్నుడై ఉండగా దౌవారికుడు తానుండవలసిన దూరాన ఉండి, మహాతేజస్వి అయిన ఒక తాపసి ఆగమనాన్ని తెలియజేశాడు. పూజా నిర్వహణం పూర్తికావచ్చింది. మిగిలిన భాగాన్ని వేగమే నిర్వర్తించి వచ్చాడు రఘువు. లోగిలి ముంగిలిలో దౌవారికు డేర్పఱచిన ఆసనాన్ని అధిష్ఠించిన మునీశ్వరునికి రఘువు సవినయంగా ప్రణమిల్లాడు.

మౌని మార్గాయాసం మధ్యనుంచి "మనోభీష్ట సిద్ధిరస్తు!" అని ఆశీర్వదించాడు.

రఘువు లేచాడు. "తమ రాకచేత మా పట్టణం, మా వంశం, మా రాజగృహం పావనమైనవి. పరిపూర్ణమైన ధన్యత్వాన్ని పొందాను. ఈనాటి తమరాక నా అదృష్టాతిరేకంతప్ప మరొకటి కాదని విశ్వసిస్తున్నాను." అన్నాడు అవనత శిరస్కుడై.

"దృఢసంకల్పంగల నీకు దైవం అనుకూలంగా ఉంటాడు!"

రఘువు బంగరు కలశంతో శీతలజలం తెప్పించి పాదప్రక్షాళన కర్మశ్రద్ధగా జరిపించాడు. మార్గాయాసాన్ని సూచిస్తూ మౌని దీర్ఘమైన నిశ్వాసాన్ని విడిచాడు.

రఘువు అతనికొరక సువర్ణాసనం తెప్పించి వేయించాడు. తపసి దానిమీద ఆసీనుడు కాగా, వింజామర స్వయంగా పుచ్చుకుని వీవ సాగాడు. తపస్వి ఆ సేవలో తన శ్రమను అపనయించుకో సాగాడు.

"తమ రాకకు కారణం అడగవచ్చునా?" అని అడిగాడు రఘువు.

"కేవలం మార్గాయాసమే నన్నిక్కడికి తీసుకు వచ్చింది."

రఘువు నిర్విణ్ణుడైనాడు. "—ఈ దీనుడేం నేరంచేశాడు స్వామీ—? ఆయాసం లేకపోయినా సేవచెయ్యడానికి సర్వదా సిద్ధమయ్యేవున్నానుగా! నాయింట ఒక్కరోజు అతిథిగావుండి నన్ను పవిత్రుణ్ణిచేయాలని తమ రెందుకు నన్ను కటాక్షించలేదు?.... ఓహో-పాపము శమించుగాక! పొరపాటున తమ అభోజనస్థితి గమనించలేకపోయాను. —ఆహా! మహా తేజస్వులయిన తమరిని ఈనాడు అతిథిగా పొందిన నేనెంత ధన్యుణ్ణి! —మహాత్మా! ఈ కోరిక అనుగ్రహించాలి!"

మౌని మౌనంగానే ఉన్నాడు.

"—ఇది భోజన సమయమే! స్వామీ-దయచేయండి." అని రఘువు భోజనశాలకి దారి చూపించుతూ తాపసిని తీసుకుపోయాడు.

రఘువు అతిథిపూజాపాండిత్య గరిమను ఏనాడో సాధించివైచాడు. ఆ తపస్వికి సర్వవిధాలా పూజలొనరించి దైవపూజకంటె ఘనంగా నిర్వర్తించాడు.

మహారాణి నవరత్నఖచిత ఆసనం పరచింది. మౌని ఆ పీఠంపై ఆసీనుడైనాడు. సమాధి నిష్ఠలో ఉండగా మహారాణి నవకాయ పిండివంటలూ వడ్డించింది.

తపస్వి కళ్లువిప్పే సమయాన్ని జాగ్రత్తగా కనిపెట్టి "మహాత్మా! వడ్డన పూర్తి అయింది. మహానైవేద్యనిమిత్తం పరిషేచన చేయవచ్చు" అన్నాడు రఘువు.

ఆచ్ఛాదిత-గుప్తవాంఛాసూచక-నేత్రాల్ని తెరచి, తాపసి హస్తోదక పరిగ్రహణానికి ఉద్యమించాడు. రఘువు హస్తోదకం యిస్తున్నాడు. మహారాణి గోఘృతంతో అభిఘరణ కార్యక్రమం నెఱవేరుస్తున్నది.

హస్తోదక ధార ఆగినది.

చేతిలోని నీరు నిశ్చలంగా నిలిచి ఉన్నది.

మౌని అప్రయత్నంగా అవంక-ఆ నీటి వంక-చూశాడు....చూశాడు-తీక్ష్ణంగా; ఇంకా తీక్ష్ణంగా....ఇంకా—

హస్తోదక దాత కంపించిపోయాడు-అపచారం!-ఏదో జరిగిపోయింది!....ఏం జరిగింది? ఏమిటి?....అర్థంకాక, ప్రశ్నించలేక, అసమర్థుడై మనసులోనే వాపోసాగాడు.

తపసి మరుక్షణంలో ఏదో ఆలోచనా ప్రేరితుడై వదిలేశాడు ఆ జలాన్ని. రఘువు నిశ్చేష్టుడైనాడు. ఏం అపచారం జరిగింది?

భార్యవైపు చూశాడు. 'ఏమిటి కారణం?' అన్నట్టు భార్య అమాయకంగా చూసింది. 'ఏమీ అర్థం కాదే!' అన్నట్టు మరుక్షణం ఆమె తన తరువాతి కర్తవ్యం నెఱవేర్చడానికి అక్కణ్ణించి వెళ్లిపోయింది.

"అమంగళం అప్రతిహత మగుగాక! మహాత్మా! ఈ దీనుడి దోషం ఏమిటి" రఘువు ఆందోళనాతిరేకంతో అడిగాడు.

తపస్వి మాట్లాడలేదు. రఘువుకూడా మాట్లాడలేకపోయాడు.

కొంతసేపటికి తపస్వి అకస్మాత్తుగా ఊర్ధ్వదిశకి ఒక నిర్నిమేష దృక్కు ప్రసారించి, "మహారాజా! ఏం చెప్పనూ? ఓ కోరిక కలిగింది." అన్నాడు. మహారాజు వికసితవదను డైనాడు.

"కోరికా? తమ ఆజ్ఞ కదా స్వామీ! సెలవీయండి!!" అన్నాడు.

"కోరిక! చాలా వింతయిన కోరిక రాజా! వింతయినదే కాదు! అకారణంగా జన్మించింది. అమానుషమైనది! నెఱవేర్చలేవేమో!!"



"కోరిక అనవద్దు మహానుభావా! ఆజ్ఞాపించండి!"

"—హస్తోదకం నిశ్చలంగావున్న ఆ క్షణంలోనే నీ భార్య ప్రతిబింబం మాకు దృగ్గోచరమైంది. ఒక్క క్షణకాలం మాత్రమే చూశాము. కాని ఒక్కక్షణంలో మానవ మస్తిష్కంలో ఎన్నెన్ని ఆలోచనలు జనిస్తాయో తెలియదా?"

రఘువుకు ఒక్కటే అర్థమైంది. స్త్రీలను చూడడం తాపసులకు పడదు. అట్టిదృశ్యాలను వారు మనస్ఫూర్తిగా ద్వేషిస్తారు.

"ఎలాగో అపచారం జరిగిపోయింది స్వామీ! ఇది కేవలం అలవాటువల్ల కలిగిన దోషమే కాని మరొకటికాదు. ప్రతి అతిథికీ మహారాణీయే వడ్డిస్తుంది - తమకు ద్రోహం తలపెడ్తానా? చేసిన నేరానికి క్షంతవ్యులం.—ఇకముందు ఆమెను ఈ ఛాయలకుకూడా రానివ్వను."

"వేలు - కోరిక అదికాదు! మాకోరిక వేలు!....రాజా! ఆమె సౌందర్యవతి! సుకుమారి! నామనస్సూ దేహమూ ఒక ద్వైధీభావంలో పడిపోయాయ్. దుస్సహమైన నిస్సంయమంతో పతితుడనయ్యాను. నీభార్య 'నావద్ద ఆఱుమాసాలుండాలన్న' వాంఛ కలుగుతున్నది—నెఱవేర్చగలవా రాజా?"

ఈమాటలు ముగించేసరికి సంయమి విచలితుడైనట్లు అతని కంఠస్వరం సూచించింది.

"స్వామీ! ఇది పరీక్ష?" అన్నాడు రఘువు నిర్విణ్ణుడై.

"—కాదు. కోరిక! కోరిక కలిగింది. ఎందుకు కలిగిందో నేను చెప్పలేను.... నెఱవేర్చగలవా రాజా! - చెప్పు; నెఱవేర్చలేనట్టు నీముఖం చెబుతున్నది. - నెఱవేర్చకపోయినా ఏమీచెయ్యనులే. నీకేమీ శాపమియ్యను."

రఘువు రాతిబొమ్మలా నించుండిపోయాడు.

మహారాణి అనతి దూరంలోనే ఉంది ఈ విచిత్ర - అమానుష - వాంఛా - వృత్తాంతం విని చేతిలోని ఘృతపాత్రను భూపతితం చేసేస్తుందా అన్నంత చలించింది. ఘర్మావృత అయింది. రక్తం సహస్రయోజనాల వేగంతో నాళాలని పెకలిస్తుందా అన్నట్టు చుట్టిపొంగిస్తున్నది. అస్థిరములైన పదద్వయ సహాయాన దైవప్రతిమ దగ్గరకుపోయి, చలనంలో అంతర్ముక్తమైపోయిన మానసిక కంఠ స్వరంతో ఈసన్నివేశ మేమీ నిజంకాకూడదని కోరుకుంటూ దైవప్రార్థన చేస్తున్నది.

ప్రవేశించాడు - అంతకంటె చలిస్తూ - రఘువు - ఆచోటికి. కాని అచలనానికి వ్యతిరేకంగా, అతని రూపంలో స్పష్టంగా ఒక సహజ - నిర్వికార - గాంభీర్యం కనిపిస్తున్నది.

రాణి కేవలం ప్రతిమ। ఆ ప్రతిమ కదలి వచ్చి రఘువు వక్షంమీద వ్రాలిపోయి ఆతనికి బాధ కలిగించవలసినది తానై కంట నీరు విడుస్తున్నది.

ఆగతానాగతజ్ఞాని కాకపోయినా రఘువు కింకర్తవ్యతామూఢుడుమాత్రం కాదు. ఈ సమయంలో అధైర్యపడిగాని వెనుకంజవేసి గాని లాభంలేదని గుర్తుపట్టాడు. స్థిరనిశ్చయం అక్షరాక్షరా ధ్వనిస్తున్న గంభీర స్వరంలో ఈమాటలు పలికేడు - "ప్రాసాదంలోంచి అతిథి అనిర్వర్తిత వాంఛతో వెళ్లిపోడానికి వల్లకాదు - ఈ రఘువిక్కడ ఉన్నన్నాళ్ళయినా। కోరరానికోరిక కోరాడు నిజమే. కనీ వినీ యెఱుగని కోరిక కోరాడు నిజమే. కాని అది జరగవలసిఉంది. నిన్నువిడిచి నేనుండలేకపోవచ్చు. కాని నిస్వార్థమైన అభ్యాగతిపూజ నా హృదయాన్ని కలచివేస్తున్నది. శాశ్వతమైన కీర్తిశ్రీ నా మనస్సును అనుక్షణమూ పట్టి పాలారుస్తున్నది. ఆకర్షిస్తున్నది."

రాణి హతబుద్ధియై ఆ వ్రాలినస్థితిలో అలానే ఉండిపోయింది.

"నేను - నాచరిత్ర - ఏంకావలసిఉంది?" అన్నది రోదనస్వరంతో.

రఘువు తృప్తిగా నవ్వాడు. "చరిత్ర।- చరిత్ర నీకు దక్కుతుంది.-నీచరిత్ర పతితమైతే అభ్యాగతిః స్వయం దేవః ఆ విష్ణుస్వరూపి చరిత్ర ఏమవుతుంది? - ఇందువల్ల మానవివైన నీకు చిరస్థాయిగా నిల్చే లాభమే ఉంటుంది!" అన్నాడు.

రాణికి ఆ క్షణంలోనే కర్తవ్యం యథా నిర్దేశితంగా ఆచరింపబడవలసిన దేనని నిశ్చయం ప్రవేశించింది. ఆమె అభ్యాగతినీ పతినీ గౌరవించుకున్నది-త్రికరణశుద్ధిగా.

"—ఆ మహావిష్ణువే మనల్ని పరీక్షించడానికొచ్చాడేమో।"

రాణి నెమ్మదిగా "అయిఉండవచ్చు-కాని అభ్యాగతికి భోజనంవేళ దాటిపోతుందేమో, పదండి ప్రభూ।" అన్నది.

"అవును. 'ప్రభువు'నే. ఆరుమాసాలు నీకు ప్రభువునే. ఆర్యపుత్రుడి ఉద్యోగంమారింది। ఇదే నిశ్చయం!"

శ్రీరామలక్ష్మణులు ఆశ్రమంలోలేని దుర్ముహూర్తాన సీతామతల్లిని, రావణాసురుడు బలాత్కారంగా లంకకు తీసుకుపోయాడు.

ఆ దుర్ముహూర్తఫలమే కాబోలు సీతాదేవి అతనిమీద ఆగ్రహించుకోడమూ, శ్రీరామలక్ష్మణులకు సుగ్రీవ, హనుమంతుల పరి

చయం, తన్మూలంగా బలం లభించడమూ జరిగాయి.

లంకలో ఉన్నన్ని దినాలు యుగాలుగా గడిపింది సీతాదేవి. ఎన్నోయిక్కట్లు సహించింది. భయదస్వరూపులైన రాక్షసులమధ్య నిర్జీవియైన దీపశిఖలా నిలిచింది - పతినామ స్మరణతో పవలూ రేలూ గడపుతూ.

శ్రీరాముడు సుగ్రీవుడి బలగమూ విభీషణుని రహస్య ఆలోచనమూపొంది, లంకలోని బలాన్ని సమూలంగా హతమార్చాడు. కుంభకర్ణ - మహోకాయ - అతికాయ - మేఘనాధాది వీరులు నర, వానరబలాలకు ఆహుతి అయినారు.

ఘనుడైన రావణుడికికూడా ఆ అవస్థే ప్రాప్తమయింది. శ్రీరాముడు తన బాణాగ్ని కీలలతో, విభీషణుడు ప్రసరింపజేసిన వాయు సహాయంతో, అతని దహనం శాస్త్రీయంగా నెఱవేర్చి తన కర్తవ్యం ముగించుకున్నాడు.

సీతాదేవిబంధవిముక్తురాలైంది. శ్రీరాముని వంకవస్తున్నది. వచ్చి భర్తపాదద్వయిపై మోకరిల్లింది. శ్రీరాముడు కేవలం ఊర్ధ్వ దిశకుచూశాడు.

పత్నినిలెమ్మని చెప్పలేదు, శ్రీరాముడు. లేచి దరిజేరబోతున్న సీతాదేవినిచూచి ఆగుమన్ని హెచ్చరించాడు. "నేను కొలదికాలంలో సార్వభౌముణ్ణి కాబోతున్నాను. నీవు మహారాణివై తే - నాదారివెంబడి పురుషులూ నీదారివెంబడి స్త్రీలూ నడవవలసిఉంది, నీవు 'కులట' వని లోకు లనుమానించడానికి తగినంతపని జరిగింది. ఎన్నాళ్లో నీవు పరాయిపురుషుడి యింటనున్నావు. నువ్వు పత్నీలవుగా ఉంటేనే లోకంబాగుపడుతుంది. కనుక నువ్వు వాళ్ళకి మార్గదర్శినివికావాలి." అన్నాడు.

సీతాదేవి నిర్విణ్ణురాలైంది. భర్తచెప్పిన దాంట్లో నిజముంది. కాని ఆ సమయంలో ఏమీ తట్టలేదు. "ఎలా కాను ప్రభూ!" అన్నది. ఆమెకు అవమానం చాలా కలిగింది. కృంగిపోయింది.

అగ్నిలో దూకమన్నాడు శ్రీరాముడు. సీతాదేవి తాను నిర్దోషినన్నది. శ్రీరాముడు ఊరుకోలేదు. నమ్మలేదు.

"అగ్నిలో దూకి - నువు శీలవతివైతే - నిరపాయంగా బయటికి రాగలవు!" అన్నాడు శ్రీరాముడు.

సీతాదేవి క్షణకాలం ఆలోచించి సరే నన్నది. అగ్నిపరీక్ష అయాక లోకంలో ఒకడైన శ్రీరాముడు ఆమెను అయోధ్య తీసుకు వెళ్లాడు. కైపెక్కిన చాకలి తందనాల్లో నిందిస్తే ఆమెను అరణ్యాలకి పంపాడు. మళ్లీ లవకుశుల ప్రతాపంచూసి ఆమెను తెచ్చుకుందా మనుకున్నాడు. "మళ్లీ అగ్ని ప్రవేశంచెయ్యి." అన్నాడు.

భూదేవి ఆగ్రహించింది. కోపానలంలో మైమఱచింది. "ఆc - మాటి మాటికీ ఇదొక నాటకంవలెఉంద"న్నట్లు సువిశాలమైన తన మాతృగర్భ ప్రవేశానికి సీతాదేవికని ఒక ద్వారం చేసింది.

* * *

"రఘువు గొప్పవాడా? ఎలాగ?" అని విశ్వామిత్రుడు తెల్లబోయి అడిగాడు.

"శ్రీరాముడు స్వార్ధపరత్వాన్ని బహిరంగంగా కనపడేటట్టు ప్రదర్శించుకోడంలో తెలివితక్కువవా డయ్యాడు, గొప్పమాట అటుంచగా!"

"స్వార్ధపరత్వమా? మూర్ఖత్వమా? వశిష్ఠా? పలవరింపులా?"



“అగ్నిలో దూకి-నువు శీలవతివైతే-నిరపాయంగా
బయటికి రాగలవు” అన్నాడు శ్రీరాముడు.

"రావణాసురు డింట్లో కొన్నాళ్లున్నది గదా అని సీతాదేవిని అనుమానించాడు. పరీక్ష అవసరమన్నాడు."

విశ్వామిత్రుడు సగంలేచాడు. "ఏమిటి మీరనేది? శ్రీరాముడు సీతాదేవిని శంకించనే లేదు. కేవలం లోకం ఆమె మార్గాన నడుస్తుందని అగ్నిపరీక్షచేశాడు. శ్రీరాముడు స్వార్థపరుడు కాదు."

"లోకాని కవసరమని అర్ధాంగిని పరీక్ష చేస్తాడా? - పోనీ అది సరి - కాని లక్ష్మణుడూ తానూ ఉన్నప్పుడు 'రావణాసురుడింట్లో సీత ఇన్నాళ్లుందే - ఏమయిందో!' అని ఏడవ లేదా? అది స్వార్థపరత్వం కాదా? - మరొకటి చూడు. కుశలవుల్ని చూశాక సీతాదేవిని మళ్లీ తెచ్చుకుందా మనుకున్నాడు గదా! అప్పుడు మళ్లీ అగ్నిపరీక్ష దేనికి? మున్యాశ్రమంలో ఉన్న సీతాదేవి చెడ్డదా? - అందుచేత, శ్రీరాముడి కా ఉద్దేశం ఉంది. లోకంకోసమే అనకండి!"

విశ్వామిత్రుడు ఊపిరి దీర్ఘంగా విడుస్తున్నాడు. "అవును - మరి రఘువు ఈ గుణాలు లేనివాడే అనుకుందాము - కాని ఒక్క అభ్యాగతికోసం భార్యశీలాన్ని బలి ఇవ్వడానికీ, తన్మూలంగా దేశంలో అవినీతికరాలైన అలవాట్లను ప్రోత్సహించేందుకూ ఒప్పుకున్న రఘుమహారాజు శ్రీరాముడికంటె గొప్పవాడా?"

"ఆలోచించండి - పక్షపాతం విడిచి!"


"—ఏమిటో ఆ గొప్పతనం నేను కనిపెట్టలేకపోతున్నాను!"


"వ్యంగ్యం దేనికి విశ్వామిత్రా! తిరిగి ఆలోచించండి. రఘువు ఏంచేశాడు? - అతిథి అయిన ఆ తాపసి కోరిక ఎలాటిది? అట్టి విపరీతమైన భయంకరమైన కోరిక వద్దకూడా అణుమాత్రమూ చలించక, వెంటనే ధర్మబద్ధుడై ఆ తాపసి కోరికను [illegible] నెఱవేర్చాడు. భార్య చలించగా ఆమెకు నచ్చజెప్పాడు. ఒకవ్యక్తి చరిత్రకంటె ధర్మం పెద్దదనీ, ధర్మానికి, ధర్మంకోసం వ్యక్తులు సదా బలి కావలసిఉందనీ విశదీకరించాడు....

........ఇంకా చూడండి - రఘువు భార్యను మళ్లా ఎలా ఏలుకున్నాడు? - మున్యాశ్రమం లోంచి వస్తున్న రాణికి చతురంగబల సమేతుడై ఎదురేగి తెచ్చుకున్నాడు. మొట్టమొదటి ప్రశ్న ఏమనివేశాడు? - 'ఈ ఆరు నెలల్లోనూ మునీశ్వరుణ్ణి తృప్తిపఱచావా' అని! అంతేగాని 'ముందు నిప్పులో దూకి మరీ ఇంట్లోకి రా,' అని చెప్పలేదు. ప్రజలు పాఠం నేర్చుకోవాలనీ అనలేదు. ప్రజలపై రఘువుకున్న నమ్మకం శ్రీరామునికి లేదు కదూ?"

కౌశికుడు కింకర్తవ్యతామూఢుడే కాదు; మాటాడనూ లేకపోయాడు.

"—కాబట్టి రఘుమహారాజు ఉదాత్తగుణం అంచులు దాటిపోతున్నది. శ్రీరాముడతనితో పరిపోల్చబడడానికికూడా తగడు! ఆ వంశానికి రఘువంశమనే యుగయుగాలా ఉండుగాక! రామవంశమనేది అసంగీతంగా ఉండుగాక!"






కథచెపతా నిటు వింటావూ!

అనగ అనగ ఒక వూరు
వూరికి చివర ఊడల మఱ్ఱి
మఱ్ఱి ప్రక్క నొక కోట.

వూడ వూడనా వూరికబుర్లు
ఆకు ఆకునా లోకం కథలూ
మఱ్ఱికి తెలీని మర్మం లేదు
మఱ్ఱికి తెలీని మాట ల్లేవు.

మఱ్ఱికి యెదటా మామిడి తోటా
మంచినీళ్ళ దొక కోనేరూ
తోట నడుమ నొక బాటా
బాట ప్రక్క నొక బావి.

బావి కాదు దెయ్యాలకు దీవి
తోట కాదు భూతాలకు పేట.
తోట పేరు బగ్గయ్యమ్మ తోట
బావి పేరు మరి మల్లెల మడుగు.

మల్లె మడుగులో చూపుల్లేవు
మల్లె మడుగులో రూపుల్లేవు.
మల్లెల మడుగు త్రవ్విన చేతులు
మల్లెల మడుగు తోడిన చేతులు
మామిడి తోటే మరిచింది
మల్లెల మడుగే మరిచింది.

మల్లె మడుగులో నల్లని వేదన
మల్లె మడుగులో నల్లని రోదన.
మల్లె మడుగులో నల్లని చీకటి
మల్లె మడుగులో చల్లని చీకటి.

చీకటి గొంతుక చీలుచు కుంటూ
ఏవో ఏవో మూలుగులూ
చీకటి గొంతుక కాలుచుకుంటూ
ఏవో ఏవో ఏడుపులూ.

కాటుక రాతిరి తోట తోపులో
దెయ్యాల రాణీ సవారి నెక్కి
"ఎవో ఎవ్వోకో" "ఎవో ఎవ్వోకో"
బోయీ లరుపులు; కాగడాలతో
పచారు చేస్తూ పాటలు పాడును.

పాటలు కావవి పాముల బుస్సలు
పాటలు కావవి భగభగ మంటలు.

దెయ్యాల రాణీ నవ్విందంటే
తోట నిండ పది తుఫానులు
దెయ్యాల రాణీ చూచిందంటే
తోటా బాటా చితాగ్నులు.
దెయ్యాల రాణీ మూలుగుతూంటే
ఊడల మఱ్ఱీ 'ఉస్స'ని మూల్గును
దెయ్యాల రాణీ ఏడుస్తూంటే
ఊడల మఱ్ఱీ 'హోర'ని ఏడ్చును.
దెయ్యాల రాణీ మఱ్ఱికి నేస్తం
దెయ్యాల మర్మం మఱ్ఱికి తెలుసును.

ఏడు కోటలూ పాడుచేసి ఈ
కోట కట్టె నొక రాజు
ఏడు వూరులూ మాడ్చి మాడ్చి ఈ
వూర నిలిచె నా రాజు.

వేలకు వేలూ మస్తకాలతో
బురుజు వేసె నా రాజు
వేలకు వేలూ పీకలు నులిమీ
ఏలికయ్యె నా రాజు.

రైతుల రక్తం రాణుల చరణం
లాక్ష చేసె నా రాజు
దీనుల రక్తం రాణీ వాసమున
రంగు పూసె నా రాజు.
రాజు శాసనం రక్త శాసనం
రాజు పతాకం రక్త పతాకం.

రాణీ వాసమున రాణీ లిద్దరు
రాణీ వాసమున వలపుక త్తెలూ
రాణీ వాసమున కలల వలపులూ
రాణీ వాసమున వలపుల కలలూ
రాణీ వాసమున వలపుల తావులు
రాణీ వాసమున తావుల వలపులు.
రాణీ వాసమున రాతిరె పవలు
రాణీ వాసమున పవలే రాతిరి.

రాణీ లంటె రాజుకు పడదు
రాణుల హృదయం రాజు నెరుగదు.
వానికి మాత్రం వలపుకత్తెలు
రమణుల వాసన రాజుకు పడదు.

ఆకలి పులులూ అవురావురని
ఆకలి కేకల నిడగా
రాణీ వాసమున రాతిరి వేళా
"వలపుల ద్వారం" విడగా
రాణీ వాసమున రాతిరె పవలూ
రాణీ వాసమున పవలే రాతిరి.

వలపుల ద్వారం త్రొక్కిన మనిషీ
తిరిగి రాడు మరి రాడు
తొలిమల కోడీ కూయక ముందే
ప్రాణం వదలక పోడు.

రాణుల చూచుక నఖక్షతాలకు
యింద్ర ధనుస్సులు విడిసై
రాణుల చెక్కిలి రదన క్షతముల
అరుణోదయములు పడిసై.

గోడ గోడకూ చెవులుంటాయి
గోడ గోడకూ కళ్లుంటాయి.
రాణుల మర్మం రాజుకు తెలిసెను
రాణుల కథలూ రాజుకు తెలిసెను
రాజు శాసనం రక్త శాసనం
రాజు ప్రతాపం రక్త ప్రతాపం.

అమాస రాతిరి అంతా చీకటి
మేఘం మీదా మేఘాలు
అమాస రాతిరి అంతా చీకటి
చీకటి మీదా చీకట్లు.

బురుజు క్రింద నొక వృద్ధ సృగాలం
బురుజు మీద నొక ఘూకం.
రాణీ వాసమున తీతువు పిట్టా
రాజ బాట నొక మాట.

రాణీ వాసమున దీపం లేదు
రాణీ వాసమున ధూపం లేదు.
అమాస రాతిరి అంతా చీకటి
మేఘం మీదా మేఘాలు
అమాస రాతిరి అంతా చీకటి
చీకటి మీదా చీకట్లు.

వలపుక త్తెల నులిమి చంపడం
ఊడల మర్రే చూసింది.
రాణుల ప్రాణం రాజు తీయడం
ఊడల మర్రే చూసింది.

అంధకారమున "వలపుల ద్వారం"
అంధకారమై విడగా
శవాల వెంటా శవం వెళ్ళడం
ఊడల మర్రే చూసింది.


అమాస రాతిరి అంతా చీకటి
మేఘం మీదా మేఘాలు
అమాస రాతిరి అంతా చీకటి
చీకటి మీదా చీకట్లు.

మల్లె మడుగులో చల్లని శవాలు
మల్లె మడుగులో మాయని శవాలు.

అమాస రాతిరి అంతా చీకటి
మేఘం మీదా మేఘాలూ
అమాస రాతిరి అంతా చీకటి
భూతం మీదా భూతాలు.

మల్లెల మడుగూ మామిడి తోటా
బాటసారి కనిపించని బాటా
గజ గజ గజ గజ వణకాయి
గడ గడ గడ గడ లాడాయి.

నాటినుండి ఆ బాటప్రక్క నొక
బాటసారి కనరాడు.
నాటినుండి ఆ తోటలోన నొక
పాట మాట వినరాడు.




భీమారెడ్డి — — గజదొంగ (కథానాయకుడు)
సారధి, దాసు, శాస్త్రి — భీమారెడ్డి అనుచరులు
రఘుపతి — — ఒక మొఖాసాదారు
కనకావధాని — — వడ్డీ వ్యాపారస్థుడు
ఎల్లయ్య — — కొండవాడు
దయాకరనాయుడు — పోలీసు ఇన్‌స్పెక్టరు
.... .... పోలీస్ సూపరింటెండెంటు

## 1. కొండమళ్ళుపులో దొంగలమర్రి

[భీమారెడ్డి - అనుచరులు]

భీమారెడ్డి: ఏదిఏమయినకానీ, ధర్మపథము తప్పకూడదు. ఇది భీమారెడ్డి శాసనం!—తమ్ములూ!- ఎండనక వాననక, చిమ్మచీకటిలో పామునూ పిశాచమునూ లెక్కచేయక, రక్తమాంసాలు ధారవోసే రయితుబిడ్డను కన్నకొడుకుకంటే ఎక్కుడుగా గారవించవలె.—చేబూనిన కార్యము ఎట్లా నిర్వహించుక రాగలమా అనే తహతహతో తపించిపోయే స్వామికార్యధురంధరుడయిన దూతని తాకరాదు—కలిమిలేముల తారతమ్యము తెలిసిన దీనజనబాంధవుల పట్టునకూడ మెలకువకలిగి మెలగవలె.—బాబులూ!—నిష్కపటులు, దయామయులు, మగువలు—మగువలేకాదు, మగువవెంటనున్న మగవానిని సైతం సమీపించనేకూడదు. జాగర్త!—కాని,—అ-దు-గో!-అ-దు-గో!!—అ ప్రాసాదములు! ఆ రమ్యహర్మ్యములు!!- అంతస్తులపైని అంతస్తులు ఆకాశము నంటుతున్నవి, చూచినారా? అందు కులుకుతున్నారు ఛేదింపరాని పాషాణహృదయులు! పేదలనూ సాధులనూ మోసగించి పచ్చినెత్తురు పిండుకొని తాగే మేకవన్నె మెకములు! ఐశ్వర్యమదపరవశులై తినరానివి తిని, చేయరాని చేతలకు తలపడే బధిరాంధక శవములు! [ఆవేశముతో ఒక్కసారి కొమ్ముబూరా వూదును] పూటకు గతిలేని కటిక దరిద్రులను—ఆకటిమంటలతో అటమటించిపొయ్యే అన్నాతురులను—రాచి రంపానబెట్టి, పోగుజేసిన ధనరాసులు ఇళ్ళనిండ పాతులే, దొడ్లనిండ పాతులే! వీరుగాక—అమాయిక ప్రజను వంచించే తాంత్రికులు మాంత్రికులు అయిన వేషధారులున్నారు. ఈ దుష్టకీటకాలను తాళంపట్టి తగిన ప్రాయశ్చిత్తం చేయాలె; తెలిసిందా?

అందరూ: అట్లనే, బాబూజీ!

ముద్దా విశ్వనాథం

భీ: స్వామివారి కళ్యాణోత్సవం కదా యిప్పుడు? శాంత్యాశ్రమం ప్రక్కనుండి అన్నవరం దారి పట్టండి. కొమ్ములు తిరిగిన జమీందారులు వచ్చిఉన్నారట ఈ యేడు. శ్రీమంతు డెవ్వడు కంటబడినాసరే లాక్కొచ్చెసిరండి. 'ఆనందకుటి'కి అతిధిరావాలె, అపుడు భీమారెడ్డి ఖుషించాలె!

అందరూ: సరి, బాబూజీ!

భీమారెడ్డి: సారధీ! నీ 'గాండీవం'తీసుకో.—దాసూ, శాస్త్రీ నీతోకూడా వస్తారు.

దాసు, శాస్త్రి: రైటో, బాబుజీ!

అందరూ: 'ఆనందకుటి'కి జై!—బాబుజీకి జై!!

## 2. అన్నవరం బాట

[సారధి - దాసు - శాస్త్రి]

సారధి: హమ్మయ్య! ఇప్పటికిక్కడ చేరుకోవడమయింది. ఇహ వేషంమార్చి అమ్ముల పొది మరుగుపరచాలి. లేకుంటె....అగపడినవాడల్లా పరుగో పరుగు!

దా: అగుపడినాడో,....రివ్వుమని ఊచవదల్నూ?

సా: ఒహో. ఊచవొదిలి; బాబుజీదగ్గరకు కళేబరంకాబోలు మోసుకపొయ్యేది! ఏం తెలివితేటలు, ఏం లోకజ్ఞానం!!

శా: నాకూ....తెలియక అడుగుతాను దాసుగారూ! మనిషిని బలికోరడం యెందుకో?— మనక్కావాల్సింది అర్థమా, ప్రాణమా?

దా: అయ్యా, బ్రాహ్మణోత్తమా!— "ధనముడిగిన మదముడుగును— మదముడిగిన మత్సరంబు మానక యుడుగున్"— అప్పటికీ బుద్ధిరాని కట్టెల్ని ప్రాణంతియ్యక మరి?.... హుష్! అదుగో!!

[అందరూ తుప్పలచాటుకి పోతారు]

['కలడందురు దీనులయెడ....'అనే పద్యం చదువుకుంటూ, విచారగ్రస్తుడైన రఘుపతి వస్తూవుంటాడు]

సారధి: స్వామీ, నమస్కారం!

రఘుపతి: ఎవరునాయనా?

సా: 'ఆనందకుటి' సభ్యులం.

ర: అంటే?—

సా: భీమారెడ్డిగారి అనుచరులం.

ర: ఓహో! భీమారెడ్డిగారి అనుచరులా! సంతోషం. ఆయన చేతికెముకలేని నెరదాత అని చెప్పి ఈవరకే విన్నాను. వీరెవరూ?—

సా: వీరూ 'ఆనందకుటి' సభ్యులే. మిమ్మల్ని ఎదుర్కోవటానికి సంసిద్ధులే!

ర: బాగానేవున్నది మీ సత్కారదీక్ష. 'ఆనందకుటి'లో—నాకు ఆతిధ్యమా!—తలవని తలంపు!!!—అసలు, నా మనస్సేమీ సనిగాలేదిప్పుడు. ఉ(—! పదండి.

## 3. ఆ నం ద కు టి

[రఘుపతితోకూడ సభ్యులందరూ ప్రవేశం]

భీమారెడ్డి : ఆనందం, మహదానందం :—మా 'ఆనందకుటి' పావనమయింది నేడు.

రఘుపతి : ఎంతమాట సెలవిచ్చారూ !

భీ : దయచేయండి లోపలికి.

[భో జ నా నం త ర ం]

భీ : సరే, ఇక నాపని మిగిలి ఉన్నది. శ్రీమంతులకూ సామంతులకూ మనవేరంటే సింహస్వప్నమేకదా !

ర : రామరామా ! నావద్ద యేమీలేందే !—ఉన్నదని చెప్పుకోవడంకూడ సిగ్గుచేటు !

భీ : ఉండనీ, మాననీ—ఎవ్వరికైనా పద్ధతి వక్కటే ! సారధీ, పోయిచూడు.

[అయిదురూపాయిలు ఘల్లుమని రాల్తాయి]

భీ : ఏమయ్యా !—

ర : ఇదే నా ఆ స్తి.

సా : ఆయనన్నది సత్యమే.

భీ : అయితే, ఒక్కపైసా అయిన తాకవద్దు.— [రఘుపతితో]—నీవాలకం చూస్తే పుట్టుపేదగా కనబడవే ?

ర : నమ్ము. నమ్మకపో రెడ్డీ !—నేను మోసగాడినికాను. దశమరలిన దొరను. తాత ముత్తాతనాడు మాది పేరుమోసిన పెద్దకుటుంబము.

భీ : మరి యిప్పుడు ?

ర : కాలచక్రం తలక్రిందైపోయింది !

భీ : ఎట్లా ?

ర : అవివేకముచేత, మితిమీరిన ఈవిచేత.

భీ : కొంచెం విప్పి చెప్పాలె.

ర : నాతరంలోనూ, నాలుగువేలు రాబడివచ్చే భూవసతి నిలిచింది. కాని, ఏం లాభం ?—లేక లేక పుట్టిన ఒక్కగా నొక్కబిడ్డణ్ని....కులవృత్తి మానిపించి యింగిలీషు చదువులో ప్రవేశపెట్టాము. విదేశాలక్కూడా వెళ్ళాడు. పెద్దపెద్ద పరీక్ష లిచ్చాడు. నవుకిరీ దొరక్క ఇంట్లోకూర్చుండి యిప్పటికి ఆరేళ్ళయింది. ఈ ఛిద్రాలు వ్రలపోసుకోవటం యేంప్రయోజనం రెడ్డీ !—

భీ : తరువాత ?—

ర : చెప్పవలసిందేమున్నది ? ఉద్యోగయత్నం తలపెట్టితిమా బోలెడంతపెట్టుబడి. ఇంతా చేసి, పర్యవసానం శూన్యం ! మావాడేదో వెలగబెడతాడని కొండంత ఆశతోచేసిన ఋణం పెరిగి పిల్లల్ని పెట్టి, ఉన్న మడిచెక్కలకి కరావడిచుట్టివైచింది. ఆ ఋణశేషం మళ్ళీ మించుకొచ్చి, కొంపకూడ కుదువబెట్టించింది. రెడ్డీ !—ఇవన్నీ తవ్వుకుంటే గుండె చెదరిపోతుంది, యిహ నానోట....

భీ: అయితే, యిప్పుడీప్రయాణం ఎంతవరకు?

ర: రేపే ఆఖరి వాయిదా....కాకినాడ వెళ్ళి అధికారిపాదాలు పట్టుకుందామని....

భీ: బాకీ మొత్తం?

ర: అసలు అయిదువేలు. అది పదిహేనువేలకి పెరిగింది. భూములు యావత్తూ రాసివెయ్యగా, ఇంటిమీద యింకా నాలుగువేలు మిగిలివున్నది. గుడ్డిగవ్వయినా మాపు చెయ్యడా ధ దళాసనుడు. అయినా అవసరానికేదో ఋణంచేశామేకాని, ఇంత మొత్తంమీద రూపాయిన్నర వడ్డీతో మనిషి తేలేదేమిటి? కొడుకు చదువు రాణించకపోయినప్పటికీ, కొంప 'ఉద్వాసన' వ్రతంమటుకి ఫలించితీరింది, రెడ్డీ!

భీ: సరే, ఇదీ పూడినతరువాత?

ర: చెప్పేదేమిటి? కాలుసాగినంతవరకు తీర్థయాత్ర - ఆటుపైని ఏ చెట్టుకిందనో దేహయాత్ర చాలించి....రెడ్డీ - మరి, సెలవు—తమ్ముడూ! మీ ఆదరమూ అభిమానమూ ఈజన్మలో మరువలేను. వెళ్లివస్తా, దయవుంచండి.

భీ: ఉండవయ్యా. పోనీ, అప్తులెవ్వరూ లేరా?

ర: హాఁ!—లోపమేం? చేతిలో బెల్లమున్నంతవరకూ అందరూ అప్తులే. అందరూనావారే.

భీ: [రఘుపతిని భుజంతట్టి]— అయితే, కష్టదశలో కనిపెట్టటానికి ఒక్కరూ లేకపోయారన్నమాట?

ర: మళ్ళీ అనిపించడమెందుకూ? లక్ష్మి నన్ను కాలదన్నిపోయినా, పౌరుషంమాత్రం ఇంకా పట్టుతప్పిపోలేదు. యిదే ఋణదాతకి నే నివ్వగల హామీ.

భీ: తమ్ముడూ!—అదే పురుషలక్షణం!—సారధీ ఒకసంచి అందుకో.

[సారధి ఒక సంచితెచ్చి రఘుపతికియిస్తాడు]

ర: రె - డ్డీ!!

## 4. ఆనందకుటి

[వివిధ వినోదాలలో భీమారెడ్డి - అనుచరులూ మునిగివుండగా ఒక శ్రావ్యమైనకంఠం వినబడుతుంది]

రఘుపతి: 'ఆనందకుటీ'కి జై!—బాబుజీకి జై!!—

అందరూ: జే!!—

భీ: ఓహో ప్రభువులు మధ్యాహ్నమే వస్తారనుకున్నామే?

ర: నీకు తెలియని ధర్మమేమున్నది, బాబుజీ! డబ్బున్నవాడిదికదా రాజ్యం! మా ఋణదాతకు అధికారులు చేలోపయారు. నన్ను ఫకీరుగా చేసి వదిలేటంత బందోబస్తుజరిగింది.

భీ: పండా? కాయా?—

ర: నెగ్గేవచ్చా నీదయవల్ల. ఈనాటికి మా కష్టాలు గట్టెక్కాయి. కాని ఆలస్యమైనందుకు...

భీ: దానికేం,—బంధువులూ....స్నేహితులూ....

ర: అప్పే—బంధువులూ లేరు. స్నేహితులూ లేరు. దారిలో—అబ్బ: తలుచుకుంటే ఇప్పుడింకా వళ్ళు జల్లుమంటున్నది బాబూజీ!—దారుణమయిన దృశ్యమొకటి. ఈ పాపిష్టి కళ్ళబడింది....

సా: ఏమిటదీ?—

ర: కూలిదొకర్తె—పాపం. ప్రసవవేదనతో ఒక దనికుని ఇంటికి చేరితే. అయజమాని—ఒక మాటకాదు. ఒక పలుకుకాదు—దులిపి దుళ్ళగొట్టసాగాడు.

భీ: పశువు!—మానవజన్మమెత్తిన పశువు!!

ర: ఆతడిభార్యే దయదల్చి. ఆ పచ్చిబాలింతకి పరిచర్య చేయబోయింది. వాడి ఆదారం తగలడా! పెళ్ళాన్ని యేలుకోనని మండిపడబోయాడు. దుర్మార్గుడు! ఆ గొడవ వినలేక చెవులు మూసుకొని. కూలిదాన్ని ఆస్పత్రిలో చేర్పించి వస్తున్నా.

భీ: 'ఆనందకుటి' పరువు నిలబెట్టావోయి. తమ్ముడూ!

ర: బాబుజీ! యిదీ...

భీ: అదేమిటదీ!—

ర: చంచల లక్ష్మి చిత్రం....!

భీ: అటువంటి దెన్నడూ తల పెట్టవద్దు. ఇంతకూ నీబాకి తీరేపోయిందిసుమా.

ర: క-న-కా-వ-ధా-ని—బా—తీ-రి....

భీ: కాదు. కాదు. నీబాకీయే తీరింది. అదే ఈశ్వరలీల!—లేకపొయ్యావుగాని. ఎంతటి చిత్రకథ జరిగిందనుకున్నావ్. తమ్ముడూ!—

ర: ఉహూఁ!—

సా: [రఘుపతికి నంచియిచ్చి] — ఇదికూడ—ఇదిగో. — తీసుకొని ఎప్పటివైభవ మనుభవించవలసిందని బాబుజీ అభిలాష-కాదు—ఆజ్ఞ.

ర: బాబుజీ! నిన్నేమనాలో....

భీ: ఏమీ అనవద్దు. ఒక్కరహస్యం గుర్తిస్తే చాలు. నీకు మేమిచ్చినది—వడ్డీతోసహా. పరమేశ్వరుడు మాకు తీర్చివేశాడు. అయితే—ఇటువంటి పరోక్షలాభాన్ని సామాన్యులు గ్రహించలేక. మేలుకలిగినప్పుడు తమ ప్రజ్ఞేనని స్వాతిశయపడతారు.

ర: అక్షరాలా యదార్థం. బాబుజీ!—ఈ రహస్యం వినగానే ఒక కవికుమారుడు చెప్పిన గీతం జ్ఞాపకమొస్తున్నది.

"నేలనేవిత్తులు। నీవు చల్లెదవొ
ఆ నన్యమేకోసి। యనుభవించెదవు;
సత్కర్మములుచేసి। సంతసించెదవు
దుష్కర్మములుచేసి। దుఃఖమొందెదవు!"

భీ: ఎంత చక్కటిగీతం చెప్పావోయ్. సారథీ!—ఈ మహావాక్యాలు మన 'ఆనందకుటి'కి మకుటాలు కావాలె.... [గంట మోగుతుంది]

[పైగీతం అందరూ పాడుతారు]

అందరూ: 'ఆనందకుటి'కి జై! బాబుజీకి జై!!

# 5. కనకావధాని యిల్లు

[పశువులపాకలో ఒకమూల అవధాని - కొండదొర యెల్లయ్య]

**అవధాని:** నిన్నటిదాకా .... కుక్కిమంచం. కుషిణీ బొంతతోనేకదుటోయ్ కాలక్షేపం, యెల్లయ్యా!—ఏపూట నూకలు ఆపూట పుణికితెచ్చుకుంటేగాని గతిలేని వాజమ్మకి—ఎవ్వడూ అడుకోకపోతే....యింతలోనే లాటరీగానే కొట్టుకొచ్చిందంటావా?

**ఎల్లయ్య:** మనవిచేశాకదూ దొరా! మూరా, బారా, లేని పెబువు—అ బీమారెడ్డి చెయ్యి యివ్వాల్సిందేగాని, మరెవడిపల్లనవుతదీ?....

**అవ:** వీడెక్కడ దాపురించాడోయ్, ఈ భీమారెడ్డి?—పనీపాటాలేని దద్దమ్మలు నలుగురిని సూడగట్టుకొని....మాయనాటకం ఆడుతున్నాడటగా, పెద్దమ్మ?

**ఎ:** అమ్మ!—యెంతమాటాడినావు దొరా!—బస్తీలో కులుకుతవు మారాజువి, నీకేం తెలస్తిది?—పల్లెల్లోసూడు, పో—దేవుడెక్కడున్నడు, దేవుడు!—పిల్లలకీ పెద్దకీ రెడ్డే దేవుడు?

**అవ:** అయితే - ఇది వాడిపనేనంటావ్?

**ఎ:** నమ్మకుంటే పో—దొరా!

**అవ:** అదిగాదు....వీడిపీడ వెంటనే వదుల్చుకుంటేగాని యెల్లయ్యా!—అసలు వడ్డీ వ్యాపారానికే ముప్పువచ్చేలాగుంది. అయినా, ఒక్కమాటడుగుతాను, చెప్పూ....దొంగ తనమో, దొరతనమో నాలుగురాళ్లు సంపాయించుకుంటున్నాడు—బాగానేవుంది. పరమేశ్వరు డిచ్చినకాడికి తనతిండి తనుతిని, తనగుడ్డ తనుకట్టి హాయిగా గూట్లోపడివుండక....ప్రతి వ్యవహారములోను వేలెట్టడం ఏంసబబువూ అంట? ఇదే నాకు పట్టుకున్న కంటకం. —ఎల్లయ్యా! ఇట్లాంటివాణ్ణిచూస్తూ ఇవాళ వదిలేశామంటే—వ్యాపారమే నశించిపోతుంది, మనిషన్నవాడికి పైసాఅయినా అప్పుపుట్టక పరపతి చచ్చి వూరుకుంటుందన్నమాట. అంచేత, యిటువంటి ద్రోహినిపట్టి, ప్రభుత్వంవారికి వప్పగించాల్సిన విధి లోకులది. లోకోపకారం కోసమే—ఎంతసొమ్మయినా విరజిమ్మి రెడ్డిని సాధించడానికిప్పుడు కంకణం కట్టుకున్నా.

**ఎ:** బలే, పౌరుసంగల బాపనయ్యవి, దొరా!—కాని చాలా పెమాదమయిన పని. పాముతో శెలగాటం చూచుకో.

**అవ:** పిరికిమందు పొయ్యకు యెల్లయా!—ఇంతకీ నీకు చేతనవుతుందా లేదా, ఆసంగతి తేల్చు. ఈ వ్యవహారం అంతుచూడంది వదిలేదిలేదు. నువు నసగటంచూస్తే....

**ఎ:** ఎందుకు దొరా, నకిలీమాటలు! ఇనుగోవుండు, తల్లిసత్తెం సూద్దుగాని, [తంబుర మీటుతాడు] దొరా! యింకేమీ శెప్పవొద్దు. నీమనసులో వుద్దేశం తెలిసిపోనాది. ఎప్పటి కయినా రెడ్డిని యెల్లయ్యే పట్టాలె. లేకుంటే పేరెట్టి పిలవ్వొక. తల్లిసత్తెం సూద్దుగాని ఎల్లయ్యంటే యెర్రోడనుకున్నావ్, దొరా! వనాల్లోకిరా!—పులిని కట్టిసూపుతా....

**అవ:** అది సరేలే—చూడు; నీతో మళ్ళా చెప్పాల్సింది వక్కటేమాట. ఎంత త్వరలో రెడ్డిని బంధిస్తావో!—ఒకవేళ సాధ్యపడకపోయినట్టయితే చాటుననక్కి సఫాచేయించెయ్—సందేహించకు ఏం!—సూపర్నెంటుగారే రెడ్డిమీఠామీద కన్నువేసివుంచారులే.

**ఎ:** దణ్ణాలు, దొరా. దయుంచు.

**అవ:** ఇదిగో; దెబ్బకి దెబ్బతియ్యాలిసుమీ, జ్ఞాపకముంచుకో.

## 6 రఘుపతి బంగళా

[గాయముతో బాధపడుతున్న సారధి—భీమారెడ్డి—రఘుపతి]

ర: అనుకున్నంతా జరిగేతీరిందే!

భీ: నిన్నూ నన్నూకూడా మూడుచెరువుల నీళ్ళు తాగిస్తానని సవాల్ జేశాడు.

ర: అడ్డులేదు. ఆ క్రూరసర్పం ఏ పనికయినా సాహసించగలదు....

సా: సాహసించలేదు - సారధి జీవించివున్నంతవరకూ....

భీ: ఆదమరచివుండగా; కొండవాళ్లని వుసికొలిపి మామైకి పంపాడు. వాళ్ల బలగం ఎక్కువయింది. పాపం. మన సారధికే హెచ్చు గాయాలు తగిలాయి—ఉః-కా-నీ....

ర: దు-ర్మా-ర్గు-డు....

భీ: అప్పుడే యేమయింది?—భీమారెడ్డిని ప్రభుత్వానికి పట్టియిచ్చిననాడుగాని అతగానికి హాయిగా నిద్రపట్టదట! ఇదీ అవధాని ప్రతిజ్ఞ—

ర: రండి, బాబుజీ!— [పారావాళ్లతో] అరేయ్, చూడు: పిట్టనయినా లోపలికి రానివ్వొద్దు. జాగర్త.

## 7. పోలీసుస్టేషను

[సూపరింటెండెంటు - ఇన్‌స్పెక్టరు దయాకరనాయుడు]

సూపరింటెండెంటు: ఇదంతా యేదో కుమ్మకులాగా అగుపిస్తుందే. తీవ్రచర్య తీసుకోవలసి ఉంటుంది. ఇప్పుడైనా ఆలోచించుకోండి.

ఇన్‌స్పెక్టరు: కుమ్మకు యేమీలేదు. మనవిచేశాగదండి. ఏదయినా వుపాయం తమరే.... ఆలోచిస్తే....

సూ: అసందర్భం!—బోలెడంత సిబ్బందిని చేతులోవుంచుకొని, రెండుప్రాణాలను పట్టి తేవటానికి యేళ్ళూపూళ్లూ చేస్తున్నారే. అనేకమైన బందిపోటులను అణచినట్టు కితాబులుకూడా వున్నాయిగా, మీకు?

ఇ: ఎన్ని కితాబులున్నా, ఈ సందర్భంలో దిగదుడుపే....

సూ: వెనుకకూడ మీరు యిట్లానే....ఆ దొంగనీ గ్యాంగునీ పొగుడుతూ ప్రసంగించారు. మరొక అవకాశ మిచ్చిచూ శామని పైకి రాయకుండా అప్పటిమట్టుకు వూరుకున్నా. ఇప్పటికీ మీ మతం....

ఇ: ఏంచేసేది?—అతని దావుటా అట్లా యెగురుతూవుంది ఎంతసిబ్బంది వుండి యేంలాభం, అసలు ఆచూకీయే తెలియందే?—

సూ: అయితే, మరి వాళ్ళు దొరికే ఆశ....

ఇ: మరొక్కటే కనబడుతున్నది. కనకావధాని అనిచెప్పి వడ్డీ వ్యాపారస్థు డొకాయన ఈమధ్యనే పరిచయమయ్యాడు. ఆయనికి కొండవాళ్ళు వశీకరం. వాళ్ళద్వారా భోగట్టా లాగుతా నన్నాడు. ఆయనిప్పుడు నాతోవచ్చాడు. పిలిపించమంటే....

సూ: ఊఁ - పిలిపించండి - చూదాం!

ఇ: చూడండి, అవధానిగారూ!—

[అవధాని - ఎల్లయ్య]

ఇ: [సూపర్నెంటుతో]—ఈయనేనండీ నేను మనవిచేసిన అవధానిగారు.

కనకావధాని: నమస్కారమండి. భీమారెడ్డినిగురించిన గుట్టుమట్టులు యావత్తూ ఏలిన వారికి ఈ యెల్లయ్య మనవిచేయగలడండి.

సూ: ఏం. యెల్లయ్యా!—ఈదగ్గర అడవులూ, కొండలూ, బాగాతెలుసూ నీకు?

ఎ: ఇండియా మొత్తంమీద నాకుతెలవని పుట్టల్లేవు, గుట్టల్లేవు, దొరా!

సూ: అయితే, గజదొంగ భీమారెడ్డి వున్నాడే - వాణ్నిపట్టగల ఉపాయం చెప్పగలవా?

ఎ: ఆ. అదెంతపని; దొరా!

సూ: బలే నిబ్బరమైనమాట చెప్పావే!

ఎ: శంకిస్తవా, దొరా! [నవ్వుతాడు]

ఇ: శంకించలేదు. ఆ వుపాయం ఏదో చెప్పు.

ఎ: [విరగబడి నవ్వుతాడు.]

ఇ: ఎల్లయ్యా! అట్లా వెర్రిగా నవ్వుతావెందుకు? సమాధానం చెప్పు.

ఎ: నే చెప్పినట్టు చేస్తావ్; దొరా? రెడ్డిని సూపుత.

ఇ: చెయ్యటానికేకదూ నిన్నడిగేది?

ఎ: దొంగని పట్టటానికి దొంగయేసం వెయ్యాల, యేస్తవ్, దొరా? [మళ్లీ తెగనవ్వుతాడు]

అవ: సరిగ్గాచెప్పు ఎల్లయ్యా! అధికార్ల దగ్గర అట్లా నవ్వకూడదు....

ఎ: సత్తెంశెబితే నమ్మవేం, దొరా!

అవ: అదే—యేంచెయ్యాలో చెప్పు చప్పున....

ఎ: గెడ్డాలు పెంచాలె— కావిగుడ్డ కట్టాలె— చేతులో కమండులు పుచ్చుకోవాల. అచ్చ సన్యాసిలాగొస్తే రెడ్డిని చూపుత. దొరా! సోకుసేస్తివంటె ఒక్క వూదకే....!

సూ: సరే ఈసాధనకూడా చూడండి; నాయుడుగారూ!

ఇ: ఎల్లయ్యా!—మధ్యాహం రెండు ఘంటలకి అవుపడు, మాటాడదాం.

## 8. దోవలో దొంగలబారిని పడిన అవధానిని రెడ్డిముఠావారు రక్షిస్తారు

కనకావధాని: [ఏడుస్తూ] మరొకదండు కాబోలు దేవుడా! వాళ్ళచేతుల్లో చచ్చినా తీరిపోను....

భీమారెడ్డి: సారధీ!— కట్లు విప్పు.

అవ: [భయభ్రాంతుడై]—రక్షించు, బాబూ!—ఇంకేమీ లేదు నాదగ్గిర. గాయత్రిసాక్షి.

సా: బాబూజీ!—రోజిల్లా బంధాలు విప్పటంతోనే సరిపోతున్నది.

భీ: అదేకదూ మనపని!

సా: [అవధానితో] మనదేవూరు స్వామీ?

అవ: నాకు వూరేమిటి; పేరేమిటి! రక్షించి వొదులు నాయనా! మీపెద్దలకి దణ్ణాలు!

సా: మీకు వచ్చిన భయంలేదు. ఎక్కడికి పోవాలె చెప్పండి. భద్రంగా దిగబెట్టేస్తాము

అవ: అన్నవరం స్టేషనుకిగానీ....ఐనా బాబూ, తమ కెందుకి శ్రమ? నాదారిని నన్ను పోనియ్యండి.

భీ: వాలకంచూస్తే, ఈయన గట్టిగా దొంగలదెబ్బ తిన్నట్టుందే!

అవ: బాబోయ్! ఇంకా వూసుయెత్తకండి. వళ్ళు కంపరమెత్తుతూంది.

సా: కనబడినవాళ్ళందరూ దొంగలేనుటండీ? అంత అనుమానమయితే యెట్లా!—చెప్పండి భయపడక, మనదేవూరు?—

అవ: కాకినాడ....

సా: సరి, సరి....తమపేరు?

అవ: నాదారిని నన్ను పోనియ్యండి, బాబూ!

సా: [గద్దిస్తూ] ఎవరిదారిని వారు పోవటానికి శాసనం వొప్పదు మారాజ్యంలో. అడిగిన దానికి సమాధానం చెప్పండి!—

అవ: నన్ను కనకావధాని అని పిలుస్తారు. ఇప్పుడయినా వదిలివెయ్యండి బాబూ.

సా: ఏమిటీ, నువ్వేనా కనకావధానివి! ఊఁ?....అరిద్రోహి!—

అవ: బాబో! బాబో!!—

భీ: ఆగు-ఆగు—భీమారెడ్డి శిష్యుడవైయుండీ....

అవ: అమ్మో, భీమారెడ్డే!!!—యిక తలకాయ నిలవదు. భగవంతుడా!—

భీ: నే నుండగా మీకేంభయం?

అవ: మీచిత్తం బాబూ!—

భీ: అరె, యిట్లా కూలబడిపోతున్నాడే. మూర్ఛపోయినట్టుంది. వీళ్ళందుకో, సారధీ!

అవ: [తేరుకుని] బాబోయ్, భీమారెడ్డే!!!—తొడమీదపందుకోబెట్టి చిత్రవధచేస్తావా? చెయ్, చెయ్—ఒక్కవేటుకి లాగెయ్యిబాబూ, ప్రాణాలు!

సా: ఎందుకో యీ బుడిబుడి యేడుపులు?

అవ: బాబూ, జీవితాశ యిదివరకే వదులుకున్నాను. చేసినపాపం చెబితే పోతుందంటారు. నే చెప్పే రెండుమాటలూ విని, మరీ చంపెయ్యండి, నాయనా!—

భీ: ఎంతచెప్పినా....చావో చావో అంటావేమిటయ్యా, చచ్చి చేసేదేమిటి?

అవ: బతికిమాత్రం చేసేదేమిటి, బాబూ!—ఆ భీమారెడ్డి....ఎవర్నయినా సహిస్తాడు గాని, దయమాలినవాళ్ళనిమాత్రం....

సా: భీమారెడ్డి....పశ్చాత్తప్తుల్నికూడా సహిస్తాడు....

అవ: ఏ మొహంపెట్టుకొని శరణుజొచ్చేది? అతనిపట్ల నే తలచినవన్నీ ఘాతుకాలే.

భీ: అవధానిగారూ! చాలా శ్రమపడ్డట్టున్నారు. రండీ మా ఆశ్రమానికి.

అందరూ: 'ఆనందకుటి'కి జై!

బాబూజీ'—జై!!

## 9. ఆ నం ద కు టి

కనకావధాని: ఎంతోభక్తితో .... తొడపయిన పండుకోబెట్టుకున్నావ్.... రెడ్డీ! అయితే. నాపాలిటికది ముళ్ళపానుపే అయింది. ప్రేమపూరితమైన నీ పలుకులు నా హృదయానికి ములుకులవలె గుచ్చుకున్నాయి. నాపాపాలే నన్నిట్లా....

భీ: ఊరక విచారిస్తారేకాని....మీరూ నేనూ చేయగలదేమున్నదీ, అవధానిగారూ!— ఆ జగన్నాటక సూత్రధారుడు ఎట్లాతిప్పితే అట్లా....

అవ: అవును. మనం నిమిత్తమాత్రులమే. ఆబుద్ధి నాకు మొదట్లో లేకపోయింది. రెడ్డీ!—పాపం ఆ రఘుపతిని శనిలాగపట్టుకుని ఏడేళ్ళనుంచి ఒక్కలా పీడించా.

భీ: రఘుపతివిషయంలో తమరు దోషమారోపించుకోవటం భావ్యంకాదు. అది అతనికి తగినశాస్తి.

అవ: అధికవృద్ధులుకట్టి అతన్ని మాపివేశాను.

భీ: అధికవృద్ధులుగావు; అతని అవివేకమే అతన్ని మాపివేసింది. ఇది తెలిసిన మూర్ఖత. కొందరిట్లా అనుభవిస్తే, ఉన్నవారికయినా బుద్ధిరావచ్చు.

అవ: నువ్వు ధర్మదూతవు, రెడ్డీ:—ఇంతవరకూ నీతత్వం పట్టిచూడలేకపోవడం నా దురదృష్టమే. నీవంటి అపూర్వవ్యక్తిపట్ల నే తలపెట్టిన మహాపచారాలు అన్నీయిన్నీ కావు. పరమేశ్వరుడు నన్ను తగినట్టుగా శిక్షించాడు. నువ్వుకూడా మన్నిస్తేకాని....

భీ: అట్లా సెలవియ్యవద్దు. ఇంతకీ మీరుచేసిన అపకృతి యేమున్నది?

అవ: యేమిటని మెల్లగా అడుగుతున్నావా? లోగడ జరిగినదానికేం. ఇప్పుడు అన్నవరం మకాంలోవున్న సూపర్నెంటుకి నీజాడతెలిసిన కొండదొరని వప్పగించివస్తున్నా. ఇంతకంటే చేయవలసిందేముంది? అతదేంచేసిపోతాడో, యేమో....

భీ: [నవ్వుతూ] కానున్నది కాకమానదు. చింతయెందుకూ?

అవ: ఎంతటి ధైర్యశాలివి రెడ్డీ!—నీ సత్యవాక్కులు వింటున్నకొద్దీ....నాలో అదేదో, చెప్పలేనిమార్పు కలుగుతున్నది....ఐతే నాది ఒక్కకోరిక రెడ్డీ!—

భీ: సెలవియ్యండి....

అవ: నాకూ....షష్టిపూర్తిదాటింది. ముందుగతి చూచుకోవాలిగదా? నీ 'ఆనందకుటి'ని గురించి ఎంతగానో చెప్పుకొంటారు. నువ్వు అనుమతించితివంటే... జీవితశేషం 'రామాకృష్ణా' అనుకుంటూ, ఈకుటిలోనే గడపివేతామని....

భీ: అంతకంటె మాకాక్కాల్సిందేమిటి?

అవ: మరి వొక్కకోరిక.

భీ: సంశయించకండి, మహాత్మా!

అవ: అర్థకామాంధుడనై పోగుచేసిన విత్తం మూడుభాగాలుగా పంచిపెట్టివేస్తున్నాను. నీ 'ధర్మనిధికి' మొదటిపాలు.

అందరూ: సె-హ-బా-స్!—

అవ: నావల్ల అష్టకష్టాల పాలయిన రఘుపతికి రెండోభాగం....

అందరూ : బలే ! బలే !!

అవ : తక్కినది.... నన్ను ఆశ్రయించుకునివున్న కుటుంబానికి—

భీ : [చిరునవ్వుతో]—ధర్మనిరతులు తప్పుతోవ పట్టరుకదా !

అవ : రాజమార్గానికి తీసుకపొయ్యే రహదారి నీ వుద్యమం, రెడ్డీ.

భీ : పెద్దవిశేషమే చేర్చారే !

అవ : లేదు. ఉన్నమాటే చెప్పాను. అబద్ధా లాడనివ్వదుగా 'ఆనందకుటి' ?

భీ : సారధీ !— ఇప్పుడైనా గ్రహించావా....అవధానిగారి దాతృత్వం ఎటువంటిదో ? అవస్థా భేదాలబట్టి....

సా : అంతా బాబుజీ మహిమ !

అందరూ : 'ఆనందకుటి'కి— జై ! 'బాబుజీకి— జై !!!' అవధానిగారికి— జై !!!'

## 10. దొంగల మర్రి

[సాధువు వేషంతో ఇన్‌స్పెక్టరు దయాకరనాయుడు — 'మూన్నాళ్ళ ముచ్చటకె మురిసేవు తుళ్లేవు....' అని పాడుకుంటూ వస్తాడు]

భీ : ['ముందుగతి కానవే....మనసా' అంటూ అతనిపాట అందుకుంటూ]— వహవ్వా ! సాధువు జన్మేజన్మ ! పేచీపూచీ లేదు, ద్వంద్వాలబాధలేదు. ఏడుసముద్రా లేకమైనా చలనంలేదు. ఏమి ఆనందం ! ఏమి ఉత్సాహం !!—సెబాస్, నాకు నచ్చిన నేస్తుడివి !—

ఇ : ఎవరయ్యా, నువ్వు ?

భీ : కొండరాజుని.

ఇ : బస ?

భీ : ఈ మర్రులే.

ఇ : జీవనమెట్లా ?

భీ : రాతిలోని కప్పనే పోషించే పరమేశ్వరుడు మానవుని ఉపేక్షిస్తాడా ?

ఇ : చక్కటి జవాబు. అయినా, తెలుసుకుందామని కుతూహలం !

భీ : ఉన్నవికదా, కందమూలాలు !

ఇ : మంచిది. జీవహింసలేని మీ జీవనమే ఉత్తమమైంది.

భీ : స్వామీ ! లోకసంచారులు. తమకుతెలియని విశేషా లుండవుకదా !

ఇ : విశేషాలకేమున్నది రాజుగారూ !—

భీ : రాజునికాదు, నన్ను భీమారెడ్డి అంటారు.

ఇ : ఓహో, భీమారెడ్డిగారూ !—ఉఁ—

భీ : మాకుటీరంలోకి దయచెయ్యండి.

['ఆనందకుటి'లో దయాకరనాయుడు - భీమారెడ్డి - అనుచరులు]

ఇ : సాధువులంటే యెంత భక్తండీ తమకు ?

భీ : దానికేంలెండి ! కలిప్రభావం ముదురుతున్నకొద్దీ వేషధారులు పెచ్చుపెరుగుతున్నారు.

ఇ : అవునవును.

భీ : ఎక్కడనుంచి రాక ?

ఇ: పుష్కరానికి పోయి....

భీ: పుణ్యాత్ముల కటువంటి అవకాశాలు లభిస్తూంటవి. అదవుఁబట్టి తిరగండోయని మా నుదుటవ్రాశాడు బ్రహ్మ!

ఇ: ఎందుకువచ్చిన యాత్రలు! 'నాకు మోక్షం - నాకు మోక్షం' అని పలవరించే స్వార్థపరులకే ఈ వ్యయప్రయాసాలు!—

భీ: పొరపాటు. సృష్టిలో ఏ సంప్రదాయమూ వ్యర్థముకాదు. అన్నీ ఆ పరమేశ్వరుడి ధర్మపరిపాలనకు సహాయకారులే!

ఇ: మీరన్నమాటా నిజమే. అయినా మీ వుద్యమమే ముక్తిమార్గానికి సుకరము- శీఘ్ర ఫలదాయకమున్నూ. మానవసేవకై నడుముకట్టి తరణోపాయం గాంచినవారు మీరూ!—

భీ: ఓఁ! - మేముచేసే మానవసేవను మెచ్చుకోవలిసిందే! - వాడినెత్తీ వీడినెత్తీ కొట్టి తెచ్చి దానధర్మా లేమిటి?

ఇ: ఎవ్వరైనా ఒకళ్లనెత్తికొట్టి తేవలిసిందే: పుట్టినప్పుడు కూడాతెస్తామా?

భీ: మహాత్మా! మీ సంభాషణలో జ్ఞానకిరణాలు ప్రసరిస్తున్నవి....విన్నకొద్దీ—

ఇ: నే ననబోయేది మీరే అనేశారు!

భీ: సరి—ఆనందకుటి నియమం ఉల్లంఘించటానికి వీల్లేదు. మిమ్మల్ని కొంచెం యిబ్బంది పెట్టవలసివున్నది.

ఇ: ఏమిటది?

భీ: మా 'ధర్మనిధి' కేమయిన అనుగ్రహించాలి.

ఇ: మొన్న పుష్కరంలో కొంచెం తక్కువగా నలభై రూపాయలు దొరికినాయి. తిరిగి వచ్చేటప్పుడు రక్షకభటులు సాధువుల గుంపుల్ని బంధించివేశారు. కాని ఇన్‌స్పెక్టరు మమ్మల్ని వెంటనే విడిపించి పుణ్యంకట్టుకున్నాడు. మీలాగనే ఆయనకూ కష్టజీవులపైన కనికర మెక్కువ.

భీ: అవును. బాగా జ్ఞప్తికి తెచ్చారు. ఆయన పేరేదో మహామంచి పేరండీ.

సారధి: పేరు గొప్పదే, గుండెమాత్రం నల్లరాయిగానీ....దయాకరుడట....!

భీ: ఆఁ—దయాకరుడు! అతని మాట యెత్తితే....మా సారధికి వళ్లుమంట. సారధికే కాదు, లోకంలో నూటికి తొంభైమంది అట్లానే. కాని, చెప్పొద్దూ....ఆయన నాకు నచ్చిన అధికారి. అయితే - ముక్కుకి సూటిగా పోయేవాళ్లను మెచ్చలే రీకాలపు ప్రజలు.

ఇ: ఆయనపట్ల ఎంత అభిమానమండి మీకూ? సన్నిహితులుగాని యిటువంటి ఆంతర్యాలు గ్రహించలేరే. వారితో మీకు బాగా పరిచయం కాబోలునే? (నంచితీసి) రెడ్డిగారూ! ఇదుగో నా సంపాదన.

భీ: [తిరిగి ఇచ్చివేస్తూ] అర్ధభాగం 'ధర్మనిధి'కి చేరింది. తక్కినది తీసికోండి.

ఇ: ప్రజాసేవకే కద? ఇదికూడ వుంచండి.

భీ: మహానుభావులు అనుగ్రహించే ఒక్క దళం చాలు. దానికి అక్షయపదవి నియ్యగల మహిమవున్నది.—ఇప్పుడు చూచారా? మీవంటి సదయహృదయులకి మేము జోహారు చేస్తాము. కాని అంతరాత్మలేని మొండికట్టెలు మోసగింప జూస్తారు. అటువంటివాళ్లకి

బుద్ధిచెప్పాలెనంటే దయాకరుడి మోస్తరుగ మాకూ రాత్రసకృత్యాలే శరణ్యం! ఏమి దయాకరుడండీ! పేరుకి తగిన వ్యక్తి!—

ఇ: జనవాక్యం వేరు, మన ఆదర్శాలు వేరు!—

భీ: ఆ రాచకీయాలు మనకెందుకులెండి—దయాకరుడికీ నాకూ స్వభావంలో కొంత పోలిక ఉండబట్టే ఆయన్ని నేను మెచ్చుకోవడం....

ఇ: అంతగా పొగడుతున్నారే, మీయందు వారికీ సదభిప్రాయమేవున్నదని నమ్మకమేమిటి?

భీ: నాకా జిజ్ఞాస యెందుకూ?- ఇద్దరి ఆశయాలూ ఒక్కటి. అదే నా తృప్తి. [సారధికి సౌంజ్ఞ చేయగా పాలూ, ప్రసాదమూ తెచ్చి వారికి సమర్పిస్తాడు.] స్వామీ! ఇవాళ పర్వదినం. మహాత్ముల రాకవల్ల మా 'ఆనందకుటి' పావనమయింది. సర్వం సార్థకమయింది. మాతో పాటింత ప్రసాదముతీసుకొని, సావకాశంగా వెళుదురుగాని.... జయ్ సీతారాం! జయ్ సద్గురూ!!—

సా: బాబుజీ! ఈ పిల్లిసన్నాసినా నమ్ముతున్నావు, మొలవేపు నిదానించూ—

భీ: ఆగు, ఏమిటా తొందర!—ధన్యులం! నేడు కేవలమూ విష్ణుసందర్శనమైంది. సారధీ! గ్రహించావా! ఇప్పటివరకూ ఎవర్నిగురించి ప్రసంగించుకున్నామో, ఆ మహానుభావుడే!—

సా: దయాకరుడా!—ఏమిటీ వెర్రివేదాంతం బాబుజీ! తెలిసీ పొగడుతున్నావా ఈ మాయదారి నక్కని! అనుజ్ఞ?—

భీ: చాలించు, ప్రతాపం! [ఇన్‌స్పెక్టరుతో] మా సారధికి ప్రథమకోపం, మన్నించాలి...

ఇ: మన్నించడమా!—ఉండవలిసిన మంత్రిని చేపట్టినావు రెడ్డీ!....బలే సూక్ష్మగ్రాహి!

భీ: కాకిచేత కబురంపితే వచ్చివాలుదునే? ఎందుకింతశ్రమ?

ఇ: రెడ్డీ! ఉద్యోగవశాన ఈ రెండేళ్ళనించీ నీనామం స్మరింపని క్షణమేలేదు. తెలుగు సీమలో భీమారెడ్డిపేరు తారకనామమై వెలిసిపోయింది!

భీ: మీరు అధికారులు, మేము అడివిమనుష్యులం!

ఇ: అతిశయోక్తికాదు. ఇదివరకు విన్నది యిప్పుడు కళ్ళార చూస్తున్నాను. నిజం చెప్పవలిసివస్తే దొంగనూ ద్రోహినీ నేనే!-ఈ చేత కలంపట్టి ఎందరికి పురిశిక్ష కల్పించానో....

భీ: అది వుద్యోగధర్మం! శంకలుపెట్టుకుంటే వ్యవహారచక్రమే కదలదే?—

ఇ: కాని, ఈ కుటీరము ప్రవేశించినప్పటినించీ—ఏమో కాని—నా మతమే మారిపోతున్నది. ముమ్మాటికి నువ్వు సత్యసంధుడివి, నిజమైన దేశారాధకుడివి. నీ 'ఆనందకుటి' మానవ శిక్షణకు గీటురాయి! నీకూ, నీ అనుచరులకూ ధన్యవాదాలు!—

భీ: కృతజ్ఞులం!—

ఇ: పేరెందుకుగాని,—ఒక బ్రాహ్మడు నన్నిక్కడికి ప్రయాణం కట్టించి పుణ్యం కట్టుకున్నాడు. లేకుంటే నిన్నుచూచేభాగ్యం లభింపకనేపోను....

భీ: [నవ్వుతూ]—ఆయనా యిక్కడనే వున్నారు!

ఇ: అదెట్లా?

భీ: అదొక చిత్రకథలెండి!—మీవద్దనుంచి తిరుగా వచ్చేటప్పుడు పాపం!—దొంగల బారినిపడినాడు, అంతలో దైవవశాత్తు - మేమువెళ్ళి విడిపించగలిగాము....ఆయన విరాగి

అయి, ఆ స్త్రీనతా సద్వినియోగంచేసి, మరి యింటికివెళ్ళక మా ఆనందకుటి'లోనే ఉండి పోయినారు. వారి సేవాభాగ్యం మాకు తరుణోపాయమయింది.

ఇ: వెదాస్—నన్ను పురికొలిపిన కనకావధానే మారిపోయాడా? అట్లా జరగడంలో ఆశ్చర్యంలేదు. నీ వాక్కులో అటువంటి మహిమ వున్నది, మరి. దివ్యక్షేత్రమయిన 'ఆనంద కుటి'కి అటువంటి మహత్తరశక్తివున్నది. ఇంతకీ, చేయవలసిన పనిచేశాడు అవధాని. ఏదీ ఆయన?—

భీ: రండి—వారి ఆశ్రమం చూదురుగాని.

అ: [లోపలినించి] రెడ్డీ!—దయాకరు డంటున్నా, వదేమిటీ?

భీ: వారిక్కడికి దయచేసివున్నారు.

అ: వచ్చారా?

ఇ: అవధానిగారూ! చెట్టిక్కించి నిచ్చెన తీసివేశారే:

అ: లేదు నాయనా, ఆ అవధాని చచ్చిపోయినాడు!

ఇ: మీ రెరిగిన ఆ దయాకరుడూ పునర్జన్మమందాడు!

అ: అనుకున్నట్లే అయింది. గొంగళిపురుగులు సీతాకోకచిలుకలైనవన్నమాట.

ర: విధివిలాస మెంత చిత్రం! -బద్ధవైరులు పరమాప్తులైనారు. వజ్రసదృశమైన హృద యాలు నవనీతములైపోయినాయి. అంతా బాబుజీ మహిమ!—

ఇ: కా-ని....రెడ్డీ!—

భీ: సంశయించకండి—

ఇ: ఇక దాపరిక మెందుకూ?—సారథి పనికట్టినట్టుగా—ఈ మారువేషంతో నిన్ను పట్ట డానికి—అవసరమయితే, పరిమార్చటానికే—ఇపుడు నే వచ్చింది....

భీ: తప్పక కానీయండి.

సా: కొంతె వుద్యోగస్థులకి దొరికే దొర కాదని తెలియదు కాబోలు!

ఇ: అట్లానే వినివున్నాను.

భీ: దయాకరా!—నేను కోరి, సంతోషపూర్వకంగా సివశమవుతున్నాను. బేడీలు వేయించ దలిస్తే ఇవిగో హస్తాలు! తుపాకిపేల్చటమే సంకల్పమయితే ఇదుగో ఛాతీ!!

[దయాకరుడు తీవ్రంగా యోచిస్తాడు. అందరూ కన్నీరొదుస్తారు.]

భీ: ఎవరివిధిని వారు నిర్వహించాలి. ఇదే మానవజీవితానికి పరమప్రాప్యం. ఆలసింప వద్దు, కానీండి!

అందరూ: బాబుజీ! బాబుజీ!!


భీ: ఏది యేమయిన కానీ, ధర్మపథము తప్పకూడదు. ఇది భీమారెడ్డి శాసనం!—

[దయాకరుడు ఈలకొట్టగా ఇరువురు భటులువచ్చి రెడ్డికి బేడీలు తగిలిస్తారు.]

అందరూ: బాబుజీకి జై! బాబుజీకి—జై!!

[జాలికొలిపే ట్యూను వినపడుతూవుండగా 'కుటి'నుండి రెడ్డి నిష్క్రమణ]





మా పిఠాపురం హైస్కూలు పూర్వం నుండి కూడా విద్యకు ప్రసిద్ధిగాంచినది. అక్కడ విద్యాభ్యాసం చేయడానికి ఆ ప్రాంతపు పల్లెటూళ్ళనుండి యింకా పైవూళ్ళనుండి బాలురు వచ్చేవారు. చిత్రాడ, చంద్రాడ, పొందూరు, గోర్స, కొమ్మరిగిరి, ఉప్పాడ, కొత్తపల్లి, గొల్లప్రోలు, రాయవరం, నవాబుపేట, వాడ, కిర్లంపూడి, గెద్దనాపల్లి, అన్నవరం, హంసవరం మున్నగు గ్రామములనుండి బాలురు విశేషంగా వచ్చేవారు. ఒక్కొక్క తరగతిలో పైఊరి బాలుర సంఖ్య సగానికి మించేఉండేది. అవచ్చే యువకులలో అన్ని వర్ణాలవారు ఉండేవారు — వెలమదొరలు, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, కాపులు మున్నగువారు. వీరందరితో నిండిఉన్న మా క్లాసురూము ఒక అంతర్జాతీయ సభవలె అలరారుతుండేది. నేను నాల్గవఫారం చదివేటప్పుడు యిద్దరేసి యువకులు కూర్చోడానికి సరిపడే డస్కు బల్లలుండేవి. వాళ్ళవాళ్ళ స్నేహబాంధవ్యాలబట్టి, యిద్దరేసి చొప్పున ఒక్కొక్కచోట కూర్చుండేవారు. నా ప్రక్కని రాజలింగేశ్వరరావను గొల్లప్రోలు యువకుడు కూర్చుండేవాడు. అతను ప్రొద్దున్నే భోజనం చేసుకొని తక్కిన సహాధ్యాయులతో గొల్లప్రోలునుండి పిఠాపురం నడిచివచ్చేవాడు. మధ్యాహ్నం ఏహోటేల్లోనో ఏదుకాణం మీదనో పగోడీలో పగోడీలోతిని తిరిగి స్కూలుకువచ్చేవాడు. అప్పుడప్పుడు నాకోసం కొన్నిపగోడీలు తెస్తుండేవాడు. అతడు నా ప్రక్కనే కూర్చోవానికి, నాతో అంత స్నేహంగా ఉండడానికి ఒక గట్టికారణం లేకపోలేదు. అదేమిటంటే.. మాక్లాసులో ఎల్లప్పుడు పూర్తిగా ఖద్దరు తొడుక్కొనే వాళ్ళం మేమిద్దరమే. అందులో తెలుపు చేయని కొత్తపల్లి ఖద్దరు తొడుక్కొనేవాళ్ళం. మాయిద్దరి వేషాలే మా కింత సన్నిహిత బాంధవ్యానికి కారణం అయింది. [illegible] వేషభాషల [illegible] విద్యార్థుల [illegible] వచ్చేవాళ్ళు. [illegible] మేము వాళ్ళనెవ్వరినీ [illegible]. మా [illegible] ఒకటే అయినప్పటికీ మా తెలివితేటల్లో భేదముండేది. మా పంతులుగారు అడిగిన ప్రశ్నకు రాజలింగేశ్వరరావు సమాధానం చెప్పలేక నీళ్ళునమిలేవాడు కాని నేను వెంటనే సమాధానం చెప్పేసేవాణ్ణి. పరీక్షలలో అన్నిటిలోనూ నాకే ఎక్కువ మార్కులు వచ్చేవి. "తెలుగులో కూడా నీకు తక్కువ మార్కులే" అని అతన్ని నిందించేవాణ్ణి. "నీ తెలివినిబట్టి నీకు ఎక్కువ మార్కులు వచ్చాయిలే" అనేవాడు కాని అతడెప్పుడు ఈర్ష్యపడేవాడు కాదు. "ఈమాత్రానికి గొల్లప్రోలునించి ప్రతిదినం నడిచిరావాలట్రా, మొద్దు" అని కూడా అనేవాణ్ణి. 'నడిచిరావడం వల్ల నీ స్నేహం కుదిరింది వాళ్ళే,' అనేవాడు.

**కబీర్ షా**

ఒకొక్కప్పుడు అతని చెవికూడ పట్టుకొని నులిపేవాణ్ణి. అతనేమీ మాట్లాడక నాచేయి విడిపించుకొనేవాడు. అతని సుస్వభావాన్ని నేను గుర్తించకపోలేదు. అతనంటే నాకెంతో అప్యాయం.

నేను, అతను, జంటవీడక స్కూలు ఫైనలు వరకు వచ్చాము. అర్ధసంవత్సరం పరీక్షలు వచ్చాయి. పరీక్షలకుగాను దళసరైన తెల్ల కాగితాలు, అట్ట, పిన్నులు, కలాల నిండా సిరాపోసి తయారయ్యే వాళ్ళం. రాజలింగేశ్వరరావు వచ్చేటప్పుడు యివన్నీ తీసుకొనివచ్చేవాడు. కాని ఓనాడు పిన్నులు తీసుకొనిరావడం మరచిపోయాడు. ఈ విషయం అతనికి త్రోవలో జ్ఞాపకం వచ్చింది. ఏంచేయడమా అని ఆలోచిస్తుండగా రోడ్డు ప్రక్కని తుమ్మచెట్లు కన్పించాయి. అతడు వెంటనే తుమ్మచెట్టు వద్దకువెళ్ళి నాల్గు తుమ్మ ముళ్ళు తెంపి జాగ్రత్తచేశాడు.

౨

అర్ధసంవత్సరం పరీక్ష లయిపోయాయి.

మాకు క్రిష్టమస్ సెలవలు యిచ్చారు. ఆ చల్లటి దినాలు ఆటలాడుతూ పాటలు పాడుతూ గడిపాము. తిరిగి స్కూళ్ళు తెరిచారు. పుస్తకాలు చంకబెట్టుకొని స్కూలుకి వెళ్లాం. చుట్టుపట్లనుండి వచ్చే స్నేహితులను తిరిగి కలుసుకున్నాం. స్కూళ్ళు తెరిచిన మొదటివారంలో కొద్దిగా గుండె దడదడ లాడుతుండేవి. ఎంచేతంటే పరీక్షపేపర్లు దిద్ది తిరిగి యిచ్చేస్తారు. వాట్లలో ఎన్నిమార్కులు వచ్చాయో అని ఆతృత.

ఓ మేస్టరుగారువచ్చి పేపర్లు యిస్తూ ఎవరికెన్ని మార్కులు వచ్చాయో గట్టిగా చెబుతూ ఎక్కువ మార్కులు వచ్చినవారిని భూషిస్తూ తక్కువ మార్కులు వచ్చినవారిని విరసిస్తూ ఉన్నారు. ఇంతలో ఆయన కుర్చీమీదనుండి దిగ్గునలేచి, 'చూచారా! ఈపేపరు. దీన్ని తమ్మముల్లు గుచ్చాడు. ఇది ఎవరిదో తెలుసునా, గొల్లప్రోలు రాజలింగేశ్వరరావుది" అని అతనివైపుచూచి "Stand up" అన్నారు 'ఏం! ఒక కాణీపెట్టి పిన్నులు కొనుక్కోలేవా? దేవుడు బుర్రయిస్తేమాత్రం ఏంలాభం. ఈముల్లు నాచేతికి గుచ్చుకుంటె ఏమవుతుంది, భ్రాజమానుడా, village boor" అని అతన్ని గట్టిగా కేకలేశారు. రాజలింగేశ్వరరావు ఆయన కసరింపులకు భయపడక "మేస్టారూ! కోప్పడకండి. ఇది స్వదేశీ పిన్నండి" అని సమాధానం చెప్పాడు.

"ఇంకా సమాధానంకూడాను, కూర్చో" అని గట్టిగా కసిరారు మాస్టరుగారు.

"ఈ స్వదేశీపిన్నుల సంగతి ఆయనకేమితెలుసు" అని ఏదో గొణుక్కుంటున్నాడు రాజలింగేశ్వరరావు.

రాజలింగేశ్వరరావుకి ఎక్కువ మార్కులు రాలేదు. అతను పెద్దపరీక్షలో తప్పాడు. నేను ఉత్తీర్ణుడనై కాలేజీలో ప్రవేశించాను. అక్కడనుండి నాకు, రాజలింగేశ్వరరావుకు సంబంధం విడిపోయింది. నేను బి.ఎ. బి.ఎల్. పరీక్షలు ప్యాసై గవర్నమెంటు ఉద్యోగంలో ప్రవేశించాను. నేను పెద్దపెద్ద పట్టణాల్లో కాలం గడుపుతూ రాజలింగేశ్వరరావును పూర్తిగా మరచిపోయాను. అతడు ఏచిల్లర దుకాణం పెట్టుకొని కాలక్షేపం చేస్తున్నాడో, మరెలా గున్నాడో అతనిఊసే తెలీదు.

౩

రెండవ ప్రపంచయుద్ధం వచ్చింది. ప్రపంచం అంతటా ఆర్థికదుస్థితి ఏర్పడింది. మితవ్యయం చేయాలని ప్రభుత్వంవారు మరీ మరీ ప్రకటనలు చేశారు. ఆఫీసులో కాగితాలు

కలాలు మున్నగు స్టేషనరీ ఉచితంగా వాడాలని పత్రాలుపంపారు. ఓదినం మదరాసులో నేను ఆఫీసులో పనిచేసుకొంటుంటె ఒక ఆఫీసు జవానువచ్చి చిన్న అట్టపెట్టె, ఒక పత్రం నా టేబిలుమీదవుంచి వెళ్ళాడు. నేను ఆపెట్టె విప్పిచూశాను. దాంట్లో తమ్మముళ్ళు ఉన్నాయి. ఆపత్రం చదివిచూశాను. అందులో ఆతుమ్మముళ్ళని పిన్నులకు బదులు వాడాలని అవి ఏవిధంగా వాడాలో ఆపద్ధతులు దాంట్లో వ్రాసియున్నాయి.

నాకదంతా ఆశ్చర్యం కల్గించింది. ఒక్క సారిగా విస్మృతుడైన రాజలింగేశ్వరరావు నా యెదుట ప్రత్యక్షమయ్యాడు. ఆనాడు మేష్టరు రాజలింగేశ్వరరావును తెగనాడిన ఘట్టము నాయెదుట సినిమారీలులా తిరిగిపోయింది. ఆ నాటి సంభాషణ నా చెవులకు విస్పష్టంగా వినబడింది. రాజలింగేశ్వరరావు ఎంతదీక్షాపరుడు, ఎంత దేశాభిమాని, ఎంత తెలివైనవాడు! పదిహేను ఏండ్లక్రితమే తుమ్మముళ్ళ ఉపయోగాన్ని కనిపెట్టిన ధీమంతుడతడు.

ఆక్షణంలో నేను హైస్కూలులో విద్యాభ్యాసంచేసేదినాలు జ్ఞప్తికి వచ్చేశాయి. నా స్నేహితులు, నా మిత్రులు, నన్ను ఒరేఒరే అని పిలచేవాళ్ళు, నాతో పకోడీలు చగోడీలు తినేవాళ్ళు, ఉప్పాడ రోడ్డుప్రక్కన రాచఉసిరి, కాయలు రాల్చితిన్న దినాలు, ఒక్కసారిగా జ్ఞప్తికివచ్చాయి. ఆనాటి ఆనందప్రదజీవితాన్ని తలచుకొని నాకన్నులు రెండు అశ్రువులు రాల్చాయి.

౪

నాలుగైదేండ్లు గడిచిపోయాయి. నేను, మా అన్నయ్య ఓనాడు కాకినాడ కోర్టుపని మీదవెళ్ళి సాయంత్రం తిరిగి పిఠాపురం వెళ్ళడానికి బస్సుస్టాండుదగ్గరకు నడిచి వెళుతున్నాం. ఇంతల్లో ఓ కొత్తకారు మాప్రక్కనేవచ్చి ఆగింది. దాంట్లోవున్న మనిషినిచూచి నేను ఆశ్చర్యపోయాను. అతను రాజలింగేశ్వరరావు. పూర్వమువలెనే అతను శుద్ధ ఖద్దరువస్త్రాలు తొడిగిఉన్నాడు. అతను కారుదిగి "చాలారోజులకు కన్పించావు ఎక్కడికి వెళుతున్నావు—పిఠాపురమా— అయితే కారుఎక్కు. మీయింటిదగ్గర దింపుతా" నన్నాడు. మా అన్నయ్య నేను కారుఎక్కాం. కారునడుస్తున్నది. రాజలింగేశ్వరరావు తనచరిత్రను చెప్పుకొస్తున్నాడు. అతను వ్యాపారంచేసి లాభంగడించానని. ఒక మంచి భవనం కట్టానని, కారుకొన్నానని, ఏవేవో అపరిమితానందంగా చెప్పుకొని వచ్చాడు. నావైపుచూచి "పెద్దచదువు చదివావు పెద్ద ఆఫీసరయ్యావు. ఇంకా కారు కొనలేదా!" అన్నాడు. నేను మా అన్నయ్య కోర్టులోని దావాలూ విషయాలు హిందూస్థానీలో చెప్పుకుంటున్నాము. అతడు మా సంభాషణవిని "మీరు మాట్లాడేభాష సరియైన హిందూస్థానీకాదు. నేను వర్తకవిషయమై హిందూస్థానీ నేర్చుకున్నాను. ఢిల్లీలో మా వర్తక సంఘపుసభలో నేను హిందూస్థానీలో ఉపన్యసించాను" అని అయిదు నిమిషాలు హిందూస్థానీలో మాట్లాడాడు. అతని వాగ్ధోరణివిని నేను నిశ్చేష్టత నైపోయాను.

'జ్ఞాపకంఉందా నాకు తెలుగుకూడ సరిగా తెలీదన్నావు, ఆనాడు' అన్నాడు. అతని మాటలు నా కాల్లో తుమ్మముల్లు గుచ్చుకున్నట్టయిపోయింది.





# తండ్రి వాటా

విశ్వనాథంగారు డ్రాయరు లాగి అందు లోంచి ఏదో తీసుకోబోయాడు. అది అక్కడ కనపడక, డ్రాయర్లోఉన్న కాగితాలన్నీ అటూ ఇటూ ఒత్తిగించి వెతకటం మొదలెట్టేడు. ఎంత వెతికినా కనపడకపోవటంవల్ల ఆఖరికి ఆయనకు చిరాకేసు కొచ్చింది. తలుపు వెనకాల పొంచిఉండి అంతా కనిపెడుతూ నిలపడ్డ కామాక్షి, తొమ్మిదేళ్ల పిల్ల, 'ఏమిటి నాన్నా, వెతుకుతున్నావ్?' అని అడిగింది.

"ఐదు రూపాయిల నోటమ్మా. ఈ డ్రాయర్లో పెట్టేను."

"ఐదు రూపాయిలా? మొన్న దసరాకి సిల్కుగౌను కుట్టించమంటే దగ్గిర రాగిడబ్బుకూడా లేదన్నావ్! ఐతే, ఐదు రూపాయిలు పెట్టుకునే అబద్ధమాడేవన్న మాట! పోనీలే."

ఆయనకి ఐదు రూపాయిలూ కనపడకపోడమేకాకుండా అమ్మాయికి తను అబద్ధమాడిన సంగతి వెల్లడైపోయినందుకు మరికాస్త చిరాకెక్కువైంది.

"అది కాదమ్మా, నేతివాడి బాకీ తీర్చడంకోసం ప్రత్యేకం ఆ నోటు దాచాను. అలా కేటాయింపుగా ఉంచక పోతే ఐదుగాదు, ఐదువందలకి సరిపడే ఖర్చుంది..........సరే కాని, ఇంతకీ నోటేమైనట్లు?"

"ఏమైందా? నువ్వు లేదని అబద్ధం చెప్పినందుకు అలాగే లేకుండా పోయింది!" అంటూ కామాక్షి అక్కణ్ణుంచి తుర్రుమంది. ఆ నోటు పోయిందీ తెలియక ఉన్నదీ తెలియక ఆయన చిర్రుమన్నాడు. "ఒరేయ్ పెద్దబ్బాయ్, ఈ డ్రాయర్లో నోటుపెట్టేను, మీరెవళ్లైనా తీశారా?" అని కేకేశాడు.

రాఘవరావు, "ఏమిటండీ ఫైవురూపీ నోటేనా?" అంటూ పక్కగదిలోంచి వచ్చాడు.

"ఔను."

"ఇప్పుడేం సముజాయిషీ చెబుతుందో అమ్మ! 'పిచ్చి ఆలోచనలకి పోయి డబ్బు తగలెయ్యకమ్మా' అని చెబితే వినదికాదు!"

---

పాలంకి వెంకటరామచంద్రమూర్తి

"తగలెయ్యటమేమిటి? మళ్లీ తగరపు తప్పేలా లేమైనా కొందేమిటి?"

"అలా కొంటే నయమే!"

"మరేం చేసినట్లు?"

"అవిన్నీ అడగండి! నేను 'వద్దు' అని చెవికి ఇల్లుగట్టి పోరేను. 'పోనీ, నాన్నగారితో చెప్పి చెయ్యి' అన్నాను. వినందే!"

కొడుకు అన్నమాటలు సహంసగం చెవిలోపడి, కాంతమ్మగారు వంటింట్లోంచి చక్కావచ్చింది. "ఏమిట్రా నామీద ఏవో నేరాలు చెబుతున్నావు తీరి కూచుని?"

"ఆ ఐదు రూపాయిల సొమ్మూ ఎలా తగులడిందని నాన్నగారడుగుతున్నారు!"

"తగులడడమేమిట్రా తెలివితక్కువ వాజమ్మా! అలాంటి అవాచ్యపు మాటలు నోటమ్మట రాకూడదు."

విశ్వనాథంగారికి ప్రాణం విసిగింది. కామాక్షి, రాఘవరావు, కాంతమ్మ - ఒహాళ్ల తరవాత ఒహాళ్లు అందుకున్నారే గాని, అసలు సంగతేమిటో చెప్పేరే గాదు. ఆయన వొళ్లమండి, "సరేనో! ఏంజేశావో చెప్పు". అంటూ పళ్లు పిండుకున్నాడు.

"ఏమిటండీ నేనేదో పాడుచేసినట్లు నిలదీసి అడుగుతున్నారు! ఆ సొమ్ము సద్వినియోగమే అయింది."

"అంతే?"

"ఈవేళ శుక్రవారం మహాలక్ష్మికి భక్తితో పూజచేసి, ధనప్రాప్తి కలగాలని కోరుకుంటూ...."

"సరే! ఆ ఐదురూపాయిలూ పెట్టి శాస్త్రుల్లుగారిభార్యకి చీర కొన్నావన్న మాట!"

"కాదునాన్నా, లాటరీలో వేసింది." అంటూ, వీధిలో ఉన్న కామాక్షి లోపలకి చక్కావచ్చింది.

విశ్వనాథం నిర్ఘాంతపోయి, "లాటరీలోనే! ఐదురూపాయలూనా?" అన్నాడు.

రాఘవరావు, "ఆహా! నిస్సంకోచంగా!" అన్నాడు.

"ఇదేమిటే? మనకి లాటరీ ఎందుకే? కష్టపడి సంపాదించుకుంటూన్న డబ్బుతో తృప్తిపడక, లాటరీలో అప్పనంగా డబ్బొచ్చి పడాలన్న దురాశ పట్టుకుందేమిటి?"

"దురాశేమిటండీ! డబ్బు చేదేమిటి! అదృష్టం బాగుండి ఏపాతికవేలో వస్తే, హాయిగా ఉండొచ్చు."

"పాతికవేలే! చాలా!"

"ఎందుకండీ ఆ వెటకారం? పెసరట్లు బిచ్చలింగానికి లక్షరూపాయిలురాలేదూ? ఆమాత్రం చెయ్యకపోయామా మనం?"

ఆ మాటలు విన్నాక విశ్వనాథానికేం చెయ్యాలో తెలిసింది కాదు. "చాల్లే! 'తెలివితక్కువపనిచేశాం' అని ఆఘోరించక ఇంకా సమర్థించుకుంటున్నావ్!" అని ఒక విసురు విసిరేడు. "ఇంతకీ

తప్పంతా నాది! నోటు పెట్లో తాళం వేసుకుపోక 'ఎవళ్ళిష్టంవచ్చినట్లు వాళ్ల తగలెయ్యండ'ని డ్రాయర్లో వదిలిపోవడం యేమిటి?" అని తన్నుతాను నిందించుకున్నాడు. కాంతమ్మగారు చిన్నబుచ్చుకుంది. కాని ఊరుకోలేదు.

"నేను జన్మానికల్లా శివరాత్రి అని ఒక్కమాటు ధైర్యంచేసి మీ డబ్బు ముట్టుకున్నందుకు మీ ఇష్టంవచ్చినట్లు మాటలంటున్నారు! అనండి, ఎన్ని అనాలో! ఇంతకీ ఆడదాన్నని నోరు మూసుకుని ఊరుకోక ఇంత స్వతంత్రించడమేమిటి నేను!" అని గద్గదిక తెచ్చుకుంది. ఓమాటు కళ్ళు ఒత్తుగుంది కూడాను. దానితో అంతా నిశ్శబ్దం ఐపోయింది. వాళ్ళు ఎవరూ మాట్లాడకుండా అలా ఎంతసేపు ఉండి ఉందురో కాని, మరోక్షణానికి ఆవిడ రెండో కొడుకు, ఆనందం పత్రిక చంకన పెట్టుకుని లోపల ప్రవేశించాడు. ప్రవేశించి, 'ఏమిట్రా, అంతా ఓచోటజేరి ధ్యానంచేస్తున్నారు?' అన్నాడు.

తక్కిన వాళ్ళు మాట్లాడలేదుగాని కామాక్షి, 'ఏంలేదు చిన్నన్నయ్యా, అమ్మేమో, లాటరీలో ఐదురూపాయిలు వేసిందని నాన్న కోప్పడ్డాడు' అని క్లుప్తంగా చెప్పేసింది.

ఆనందం అందరిముఖాలూ పరీక్షిస్తో, 'ఐసీ!' అన్నాడు సర్వం గ్రహించినట్లు.

"ఐతే అమ్మా, ఆ ఐదురూపాయిలూ లాటరీలో ఎందుకు వేశావ్?"

ఆ ప్రశ్నకి కాంతమ్మగారు జవాబు చెప్పలేదు. విశ్వనాథంగారే, "ఎందుకేమిటి? ఒక్కమాటుగా పాతికవేలు వచ్చిపడతాయని!" అంటూ వెటకారం వెలిబుచ్చారు.

"ఐదయిదులు ఇరవై ఐదు. రూపాయి పెట్టుబడికి ఐదువేలరూపాయిల రాబడి అన్నమాట! ఇకనేం! ఫస్టుక్లాసు ఇన్వెష్టుమెంటు! 'డబ్బొస్తే అంతా సుఖపడవచ్చు'ననే ఉద్దేశంతో లాటరీ వేసింది గనక పర్పసు బోనాఫైడీయే! ఇంక అమ్మ మీద కేసేముంది నాన్నా!"

ఈమాటలతో వాతావరణంమారింది. విశ్వనాథంగారి మొహాన్ని చిరునవ్వు మొలిచి. ఆయన, "కేసేమిట్రా? 'తమాంతంగా ఆ పాతికవేలూ ఒక్కమాటు వచ్చిపడితే దాన్ని యేవిధంగా ఖర్చుచెయ్యటం?' అని ఆలోచిస్తున్నాను. అంతే" అన్నారు.

"నిజమే నాన్నా. ఆ విషయం ఇప్పుడే సెటిల్ చేసుకోటం మంచిది. సొమ్మొచ్చి కూచున్నాక తీరికెక్కడుంటుంది?... ఏమోయ్ అన్నయ్యా, నీకేమైనా సొమ్ము అవసరం ఉంటుందా?"

"నాకా? రెడీగా ప్లానున్నవాణ్ణి నేనే అసలు. మొన్న మా ప్రొప్రయిట

రుకూ నాకూ మాటా మాటా వచ్చి, 'నౌఖరీకి రాజీనామా ఇచ్చేద్దామా' అనిపించింది తెలుసా? 'మనకే డబ్బుంటే స్వంతగా బిజినెస్ పెట్టుకుని ఒకాడికి ప్రాధేయపడనక్కర్లేకుండా ఉండొచ్చు కదా' అనుకున్నా. మనకు సొమ్మువచ్చే విధానం ఉందీ అంటే ఈ క్షణంలో వెళ్ళి మా ప్రొప్రయిటరుతో, 'నువ్వెంత చేసు నీ ఉద్యోగం ఎంతచేసు!' అని, మొహంమీద నాలుగూ దులిపేసి చక్కా వస్తాను!"

"వచ్చి, 'రావ్ బ్రదర్సు— కెమిస్ట్సు అండు డ్రగ్గిస్ట్సు' అని బ్రహ్మాండమంత బోర్డు ఒకటి రాయించి, వాడిషాపు కెదురుగుండానే నీ షాపుకూడా ఓపెన్ చేసి, వాడి బిజినెస్సంతా నువ్వే లాక్కొచ్చు. మంచి స్టేటస్సు ఉన్నవాడివని తెలియటానికి ఓ చిన్న కారు కూడా కొను.... ఐతే ఇవన్నింటికీ నీకు ఏ మాత్రం కావలసుంటుంది?"

"ఏడెనిమిదివేలైతే చాలోయ్." అన్నాడు రాఘవరావు.

"పోనీ తొమ్మిదవేలే అని వేసుకో," అన్నాడు విశ్వనాథంగారు.

"ఆనందం! నీ స్కీమేమిట్రా?"

"ఏముందండీ, ఈ ఆనర్సు పూర్తి అయ్యే అవటంతో డైరక్టుగా ఇంగ్లండు వెళ్లి బారిష్టరో, అమెరికా వెళ్లి పి. హెచ్చి డీయో ఐ చక్కా వస్తాను."

"రైట్! నీ ఫారెను ట్రిప్పుకి ఓ పదివేలు పడుతుందనుకుంటా."

"ఆ, పదివేలతో మేనేజ్ చెయ్యొచ్చు."

"అమ్మడూ, నీక్కూడా ఏంకావాలో ఇప్పుడే చెప్పెయ్యి, అనక మళ్లీ చెప్పకుండాను."

కామాక్షి చాలాసేపు ఆలోచించింది. ఆఖరికి, "నాకో గొలుసుచేయించు నాన్నా" అంది.

"ఓసి వెర్రిమొహమా ఇంతేనే!" అంటూ కాంతమ్మగారు అందుకుని, "అన్నలిద్దరూ తండ్రి సంపాదించి వదేసిన ఆస్తిమస్తే తలో పదేసివేలూ పంచుకుంటూంటే నీకొక్క గొలుసేటే కావలసింది?" అని మందలించింది.

"పోనీ చెల్లికి తెలియకపోతే దాని కేంగావాలో నువ్వు ఆలోచించి చెప్పరాదూ?" అన్నాడు రాఘవరావు.

"ఏంగావాలేమిట్రా? బోలెడెంత ఖర్చుంది. దానికి మంచి సంబంధం చూసి పెళ్లి చెయ్యాలంటే తగిన కట్నం ఇవ్వాలి. లాంఛనాలన్నీ జరపాలి. నగలూ నాణేలేకాకుండా ముద్దుముచ్చట లెన్నో జరపాలి. అప్పుడదొత్తుగా సొమ్ము కోసం తడుముకోడంకన్నా ఇప్పుడే ఓ ఐదువేలు బ్యాంకులో వేసుకోటం మంచిది."

"నిజమేనమ్మా. ఓ ఐదువేలు బ్యాంకులో వేద్దాం. సరేకాని అమ్మా, నీకేంగావాలో చెప్పవేకాదు."

"నాకా నాయనా, తండ్రీ కొడుకులూ చేరి అయిందానికీ, కానిదానికీ

చివాట్లుపెట్టకుండాఉంటే అదే చాలు. నాకింకేమీ అక్కర్లేదు!"

"అబ్బే, అలాగంటే ఎలాగ? ఇంతకీ ఈ డబ్బంతా నీ మూలాన్నికదా వస్తోంట? మొహమాటపడక చెప్పు."

కాని కాంతమ్మగారు చెప్పిందికాదు. నిర్ఘాంతంగా నిలపడిపోయింది. ఐతేం, కామాక్షి ఊరుకోలేదు.

"నాన్నోయ్, అమ్మకేం గావాలో చెప్పనా?"

"ఏంకావాలో నీతోచెప్పి ఉందానా?" అంది కాంతమ్మ.

"ఇంజనీరుగారి పెళ్లాం నిన్ను చేయించుకో మనలేదుటే?"

"ఆవిడకేం, కొంప్రై చేయించుకో మంటుంది. మనకు తాహతుండొద్దూ?"

"తాహతు లేకపోవటమేమిటే, పాతిక వేలొస్తోంటే! ఏమి చేయించుకో మందో చెప్పు" అని హెచ్చరించాడు విశ్వనాథంగారు.

ఆవిడ ముసిముసి నవ్వులతో, "ఊహూ!" అందిగాని కామాక్షి, "రవ్వల దుద్దులు నాన్నా!" అనేసింది.

"అలా చెప్పు, ఇంకనేం?" అన్నాడు విశ్వనాథంగారు. అంతా నవ్వేశారు.

"భేష్! చవట ఐదు రూపాయిలు పోతేపోయాయిగాని చక్కటి తలపులు పుట్టేయర్రా మీ అందరికీ! - ఐతే ఆనందం! మొత్తం లెక్కచూడు. రాఘవకి తొమ్మిదివేలు; నీకు పది; అక్కడికి పందొమ్మిదివేలు. చెల్లికి ఐదు; మొత్తం ఇరవైనాలుగు. ఇంకో వెయ్యి మిగుల్తుంది."

"ఆ వెయ్యా, అమ్మ రవ్వలదుద్దులకి సరిపోతాయి." అన్నాడు ఆనందం.

"ఐతే పాతికవేలొచ్చినా ఆఖరికి నాకేమీ మిగలదన్నమాట!" అన్నాడు విశ్వనాథంగారు నవ్వుతూ.


"మిగలకేం నాన్నా?"

"ఏదీ! ఏం మిగిలింది?"


"నేతివాడిబాకీ నాన్నా."

ఆ మాటకి అందరూ నవ్వేశారు. అందరికన్నా విశ్వనాథంగారికి ఎక్కువగా నవ్వొచ్చింది. దరిమిలానకూడా ఆ మాట జ్ఞాపకం వచ్చి, ఆయన తనలో తానే నవ్వుకుంటూండేవాడు. ✱





గాలిప్రేమ!




రైలు కదలబోతూవుండగా కూడా అడిగింది లలిత, ఉత్తరాలు రాస్తూ వుంటావుగదూ-అని. వాసంతి తల వూపింది. కాని రాస్తుందా? ఉత్తరాలు రాయడమంటే వాసంతికి మహాబద్ధకం.

లలిత రైలులో కూచుందేగాని మనసు మనసులోలేదు. తను వాసంతి కోసం ఎందుకింత దేవుళ్లాడాలి? తోడబుట్టినదా? మేనత్తకూతురా, మేనమామకూతురా? స్నేహానికికూడా ఒక హద్దువుండాలి. తను వెర్రిగా పాకులాడటంవల్లనే వాసంతికి లోకువైపోయింది. గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించినట్టు, తనకంటె పదేళ్ళు చిన్నది తనకే బుద్ధులు నేర్పబోతుంది.

లలిత యిలా తనలోతను ప్రశ్నించుకోవడం యిది మొదటిసారికాదు. వెనకెన్నోసార్లు జరిగింది యిలాటియుద్ధం మనోవల్మీకంలో. వాసంతిని తను మర్చిపోవాలనుకునేది. ఆమె తృణీకారాన్నీ, నిర్లక్ష్యాన్నీ వొళ్ళో మూటగట్టుకోవడం తనకేం ఖర్మం! పెట్టిపోతలకి తనేమైనా ఆధారపడిందా వాసంతి మీద! [illegible] మంచితనం. నాలుగేళ్ళతర్వాత కనిపించిన తనతో నాలుగురోజులు ఖులాసాగా గడపలేదూ-పొగరుగాని!

రైలు పొగలు కక్కుకుంటూ, నిశ్శబ్దాన్ని చీలుస్తూ వడిగా పోతోంది. ఆ సెకండ్ క్లాస్ పెట్టెలో లలితకి సాయం మరొక్కావిడ ఉంది. ఆవిడా కాకినాడ దాకా వెళ్తోంది; కాని రైలింకా స్టేషన్ నించి కదలకపూర్వమే ఆమె పక్క పరుచుకు పడుకుంది. దొంగభయాలెక్కువ కనక, లోపల గడియలవంక మరొక్కమారు చూసింది లలిత. లైటార్పేసి తనూ నడుంవాల్చవచ్చు. కాని లలితకి నిద్దర రావడంలేదు. సెంట్రల్లో కొన్న పత్రికలు చదవాలని లేదు. ఏదో ఆరాటం. ఎందుకు తనకీ అశాంతి? వాసంతిని తనెందుకు ప్రేమించాలి?

ప్రేమ. ప్రేమఅంటే అర్థమేమి? బహుముఖాల అనుభవం. గుండెల్లో

ఎస్. ఆర్. చందూర్

చెయ్యిపెట్టి కలచినట్లవుతుంది. విద్రా హారాలకి దూరంచేసి, మనశ్శాంతిని దగ్గంచేసి, ఆత్మని విశాలపరుస్తుంది. ప్రతిజీవీ ప్రేమలో పెరిగి పెద్దదవుతుం దంటారు.

లలిత వాసంతిని ప్రేమించింది. ఎందుకు ప్రేమిస్తున్నాననే మీమాంసలో పడటంవల్లనే డొంక కదిలింది. ప్రేమిం చడం ఎందుకేమిటి? జీవించడమెందుకో ప్రేమించడమూ అందుకే!

తను తాసిల్దార్ భార్య. 'మావారు తాసిల్దార్' అని చెప్పుకునేపాటి దర్జా తమది. తను వడ్డాణం, కాసులపేరూ పెట్టుకుని, అమ్మాయిని చంకలోవేసుకు, అబ్బాయిని చిటికినవేలుపుచ్చుకు నడి పించుకుంటూ అమ్మవారి గుడికి వెళ్ళి నప్పుడు తనను మూర్తీభవించిన లక్ష్మీ దేవి అన్నారు యిరుగూ పొరుగూ. తనెందుకు వాసంతికోసం యిలా అయి పోవాలి? అదీకాక వాసంతి మారి పోయింది. మునుపటి పిల్లగాదు.

దీపానికి పురుగులు ప్రవేశించాయి పెట్టెలో. తెల్లటి పక్కమీద వాటిరెక్కలు పూలరేకుల్లా రాలుతున్నాయి. విసుగుపుట్టి దీపం ఆర్పేసింది లలిత. పెట్టెలో చీకటి, బయట చీకటి, మనసులో చీకటి. ఆ చీకటిలో కరిగిపోతున్న లలితకి రైలు రొద ఒక్కటే జీవనసంగీతంలా విని ంచింది.

లలితకి యిద్దరు పిల్లలున్నారు. ్రాడికి పన్నెండేళ్ళు, అమ్మాయికి దేళ్ళు. అబ్బాయి తండ్రిపోలికగాని గుణాలన్నీ తల్లివి. అమ్మాయి తల్లి పోలికగాని గుణాలన్నీ మేనత్తవి. ఇద్దరూ చక్కగా వుంటారు. రోగిష్టి పిల్లలుకాదు - యిద్దరూ నేవళంగా వుంటారు. అబ్బాయి ఫోర్తుఫారంలోకి వొచ్చాడు. అమ్మాయి కుమారీశతకం లోని పద్యాలన్నీ వొప్పజెప్పగలదు.

రామ్మూర్తి లలితకి అన్నివిధాలా ఆదర్శభర్త. ఇద్దరూ ఒకరిపక్కనొకరు నుంచుంటే, ఎవరూ చెప్పకుండానే పోల్చుకోవచ్చు - వాళ్ళ భార్యాభర్తలని. రతీమన్మధులనడం కాస్త అతిశయో క్తేమోగాని ఈడూజోడూఅనడం సబబు. రామ్మూర్తి కష్టపడి చదువుకున్నాడు. న్యాయంగా పనిచేసి తాసిల్దార్ అయాడు. తన భర్త హెడ్‌గుమాస్తానించి తాసి ల్దార్ అయాడని విన్నరోజున లలిత పొందిన ఆనందం అపరిమితం.

ఇంట్లోవుండేది రామ్మూర్తీ, లలితా, యిద్దరుపిల్లలూ, వంటలక్క. వంట మనిషి వారికి తప్పనిసరిగా కావాలి. అందుకు రెండు కారణా లున్నాయి. ఒకటి: వంటచేసేందుకూ, రెండు: రామ్మూర్తి కాంపుల్లో వున్నప్పుడు లలితకి సాయం వుండేందుకు. లలిత అదృష్టవంతురాలు కనకనే తనకీ సిరి సంపదలబ్బాయని నమ్మేవాడు రామ్మూర్తి.

సుఖపడేందుకు అన్ని అవకాశాలూ లలితకి ఉన్నాయి; కాని ఆమెకి సుఖం లేదు. ఆమెహృదయం గిలగిలా కొట్టు కునేది. తెలీని దేనికోసమో తపించేది.

ఆమెని పంజరంలోని చిలకతో పోల్చడం ధర్మంకాదు. సంసారమూ, పిల్లలూ పంజరమా స్త్రీకి? ఆమెకి పిల్లలపట్ల కనికరం, రామ్మూర్తిమీద అపేక్ష లేకపోలేదు. ఐనా, మనసు ఏదో అగ్నితో మలమలమాడేది. అలాంటిరోజుల్లో రబ్బరుబంతిలాగెంతే వాసంతి కనిపించింది లలితకి.

అదెలా సంభవించిందంటే— రామ్మూర్తికి వున్నవూరునించి బదిలీ అయింది. కొత్తవూళ్ళో అద్దెకి తీసుకున్న యిల్లు వాసంతి తాతగారిది. ఆరంభంలో యింటివారమ్మాయిలా కనిపించిన వాసంతి, రానురాను లలితకి మోహపాశమైపోయింది. అప్పటికి సుగుణకి, అంటే కుమార్తెకి, మూడేళ్లు. శ్రీనివాసుల్ని, అంటే కొడుకుని, బళ్లో వెయ్యడమేకాకుండా ప్రయివేటుకూడా చెప్పిస్తున్నారు. లలితవయసు యిరవై ఆరో, యిరవై ఏడో. వాసంతి స్కూలు ఫైనల్ ప్యాసయింది; ఆడపిల్లలకి కాలేజీ లెందుకని తాతగారు చదువు మానిపించి యింట్లోకూచోబెట్టారు.

వంటలక్క సమస్తమూ చూసుకోవడంవల్ల లలితకి ఏనాడూ చేతినిండా పనివుండేదికాదు. విద్యాపూర్తికీ వివాహ నిశ్చయానికీ మధ్యనివున్న వాసంతికీనూ చేతినిండా పనివుండేదికాదు. ఇద్దరిమధ్యా ఒకదశ వయోభేదంవున్నా, యిద్దరూ కలలు కనేవారు. కాని ఆ కలలలో తేడావుంది. ఇద్దరికలలూ ఒకేమాదిరివి కానేరవు. పొంగి చల్లారిన పాలూ, పొంగే పొంగే పాలూ ఒకటవుతాయా? అలవాటువల్ల నిస్సారమైన జీవితంలో అమృతవర్షం కురియాలని లలితకలలు. చవిచూడని ఆనందధామంలోని అందాలు ఏరుకోవాలని వాసంతి కలలు. ఇద్దరూ కలలగురించి గంటలకొద్దీ రోజులకొద్దీ మాట్లాడేవారు. కాని, వాటిని కలలుగా మాట్లాడేవారుకాదు. కలలని వొప్పుకునే వారుకాదు. జీవితంలో తాము సాధించబోయేవిషయా లనుకునేవారు. పరస్పరం కలలు పంచుకుంటూ మార్చుకుంటూ అతిసన్నిహితులయారు. ఒకర్నొకరు ప్రాణప్రదంగా చూసుకునేవారు.

ఒకరోజున లలిత అంది: "ఏమిటో- ఈ యిల్లూ వాకిలీ యిదంతా బుద్బుద ప్రాయం. మన ప్రేమ నాశనరహితమైనది."

అవునంది వాసంతి. వాసంతి దృష్టిలో లలిత ఆదర్శవ్యక్తి కాకపోయినా ఆమె మీద గురీ గౌరవం ఏర్పడ్డాయి వాసంతికి. లలితస్థితి వేరు. ఆమెమనసు ఒక కొత్త అనుభవం పొందుతోంది. లలిత భర్తనీ పిల్లల్నీ ప్రేమించడం వేరు; వాసంతిని ప్రేమించడం వేరు. ఇది మానసికానుభవం.

"నేను నిన్ను వొదిలి బతకలేను."

"నేనూ నిన్ను వొదిలి బతకలేను" అంది వాసంతి.

ఆమరుసటి నెలలోనే వాసంతికీ నీలకంఠానికీ వివాహం నిశ్చయమైంది. నీలకంఠం వాసంతికి అంత మరీకొత్త కాదు. హెడ్మాస్టరుగా రప్పాయి. తాత

గారితో చదరంగం ఆడేందుకు వస్తూ వుండేవాడు. నీలకంఠం బావుంటాడు; మర్యాదతెల్సిన మనిషి.

వివాహవార్త వినగానే లలితకి పిడుగుపడ్డట్టయింది. "నువ్వీ పెళ్ళికి వొప్పుకోకు," అంది వాసంతితో.

"ఏం?" అని అడిగింది వాసంతి.

"పెళ్ళివల్ల నీ స్వేచ్ఛ పోతుంది."

"ఇంటర్ చదవడమే తాతగారికి యిష్టంలేదు. పెళ్ళిచేసుకోనంటే వూరుకుంటారా?"

"వాళ్ళెవరు? నీయిష్టం నీది."

"వాళ్ళెవరేమిటి? నావాళ్లు. నన్ను పెంచి పెద్దదాన్నిచేశారు. అదీకాక నీలకంఠం అంటే నాకు యిష్టం."

"నువ్వు నీలకంఠాన్ని ప్రేమిస్తున్నావా?"

"పెళ్ళికానిదే ఎలా ప్రేమిస్తాను?" అని అడిగింది వాసంతి అమాయకంగా.

"నువ్వు ప్రేమించి పెళ్లిచేసుకో."

'నీలకంఠాన్ని నేను ప్రేమించాను' అని అందామనుకుంది వాసంతి. కాని, లలితకళ్ళల్లోకి చూసి భయపడింది. పచ్చటిమనిషేమో లలిత - కోపంవల్ల ఆమె మొహం కందగడ్డలా అయింది. వాసంతి పెళ్ళిచేసుకు తనకి దూరమవడం లలిత భరించలేక, ఎన్నో అపభ్రంశపు మాటలు మాట్లాడింది.

"పురుషులు స్త్రీలని బానిసలుగా చేస్తున్నారు. పెళ్ళి స్త్రీస్వాతంత్ర్యానికి ప్రతిబంధకం. మొగవాళ్ళని నమ్మకూడదు. నువ్వుకూడా బానిసగా తయారవుతావా?"


తను పుస్తకాల్లో చదివిన యిలాటిమాటల వాసంతికి నూరిపోసింది. ఆమె మనస విరగ్గొట్టాలని నానా యాతనా పడింది కాని ప్రయోజనం సున్న. వాసంతి ని... పంగా పెళ్లిచేసుకొని భర్తతో పట్న... వెళ్ళిపోయింది. లలిత తన హృదయ కాశంలో వెలిగిన ప్రేమజ్యోతిని ప... లంగా కాపాడుకుంటూ కాలం వెళ... బుచ్చుతోంది.

నాలుగేళ్ళతర్వాత స్నేహితురాలిద... రికివచ్చి, నాలుగురోజులు గడి... యింటికి మళ్ళుతోంది లలిత. వాసంతి ప్రపంచం వేరు; లలిత ప్రపంచం వేరు. వయోభేదమేకాకుండా జీవనవిధానాలూ, దృక్పథాలూ, విలువలూ వేరువేరు. కాని, లలిత చిన్ననాటి వాసంతిని, కలలు కన్న వాసంతిని హృదయంలో దాచు కుని, ఆ హృదయబింబాన్ని యిప్పటి వాసంతినీ క్షణక్షణమూ పోల్చుకుంటూ ఆ ప్రయాసలో సుఖమనుభవించేది.

రామ్మూర్తి కాంపునించి వచ్చిన తర్వాత లలితని అడిగాడు: "వాసంతి ఎలా ఉంది? ఎప్పుడైనా నన్ను తల్చు కుంటుందా?" అని.

"మినప్పచ్చడి చేసినప్పుడల్లా మీరు జ్ఞాపకం వస్తారట." అన్నది లలిత.

రెవిన్యూ యిన్స్పెక్టర్ల సొదా, కరణం మునసబుల జమాబందీ లెఖ్ఖలూ, రైతుల అష్టకష్టాలూ వినడానికి అల వాటుపడ్డ రామ్మూర్తికి ఈ మాటలు సంగీతంలా వినిపించాయి. చల్లటివేళ ఒకమనిషి తనని కమనీయహృదయంతో



కలుసుకుంటుందని ప్రతిరోజూ ఆమెకు అని పిస్తుంది. ఆ క్షణంలో ఆమె అనుభవించిన ఆనందం చెప్పలేను.

"వాటిలో ఉన్నవాళ్లందర్లో మన సుగుణ కూడా పెద్దదైతే ఇలాగే అవుతుంది," అన్నాడాయన.

ఒక్కసారి కూతురి మొహంలోకి చూసింది లలిత. తను సుగుణని వాసంతిని ప్రేమించినట్లుగా ప్రేమించగలదా? ప్రేమించగలిగితే ఎంత హాయి! మనసు ఎంత స్థిమితపడుతుంది!

అంతకు ముందు సంస్కారం అది సాధ్యపడదు. చాలని చెప్పినా ... పుట్టించి, మరో గాజులు చేయిస్తే ప్రేమ అవుతుందా? విద్యాసారంవల్ల సాధనాక్రమత కోల్పోయిన ఆమె మనసు ఐదేండ్ల ప్రేమనే అహోరాత్రాలూ కావాలి.

పెళ్ళయిన తొమ్మిదేళ్ళకు మూడోరోజున వాసంతికి రాసింది: "నువ్వు నన్ను మోసం చేశావు. నా ప్రేమకి ద్రోహం చేశావు. నా సుఖాన్ని, శాంతిని భగ్నం చేశావు. నాకీ సంసారాన్ని వదిలి పారి పోవాలనీ (పెక్కుడిలో), ఏట్లో మునిగి చచ్చిపోవాలనీ, జరుగుతున్న రైలు బండిలోనుంచి దూకెయ్యాలనీ అనిపిస్తోంది. దీనికంతకీ కారణం నువ్వే. పిల్లలూ, ఆయనా ఇబ్బందిపడతారనే భీతిలేకపోతే, ఈపాటికి ఎందులో చచ్చిపోయి వుందును." ఉత్తరం చదివి వాసంతి నవ్వుకుంది. జవాబు రాదామనుకుంది గాని ఏముంది రాసేందుకు? సాని మాతి

వచనాలు పనిచేస్తాయా? ఇంతకీ లలితకి తనుచేసిన అన్యాయం ఏమిటి? 'అయ్యో' అనుకుంది.

నిజానికి లలితకి ఏంకావాలో తెలీదు. చుట్టూవున్న ప్రపంచం నిర్జీవంగా కనిపిస్తోంది. ఆ జడపదార్థంలో చైతన్యం పుట్టాలి. ఆనాడే తనకి జీవితాసక్తి కలుగుతుంది. ఏదో కొత్తది కావాలి. మసిబారిన బతుకుని శుభ్రపరిచే వెలుగుకావాలి. ఎలా వస్తుంది? ఎక్కణ్ణుంచి వస్తుంది? మార్గమేది?

లలిత వెళ్ళబోసిన ప్రేమ అంతా ఆమెహృదయంలోది. అది అవ్యాజంగా ప్రవహించే అమృతఝరి. 'వాసంతి నాది' అని తపించినన్నాళ్ళూ ఆమెపడ్డ ఆవేదన, 'వాసంతి ఎవరు?' అనే ప్రశ్నతో అంతమొందింది. అక్కడితో లలిత ఉత్తరాలు రాయడం మానుకోలేదు. "నేను ఒకదరికి జేరుతున్నాను. జబ్బుపడి లేచినట్టుగా ఉంది నాస్థితి. నీకు నాబాధ చెప్పుకోవడంలో నన్ను నేను పరిశీలించుకుంటున్నాను. నీమీద నాకోపమంతా పోయింది. నువ్వు ఉత్తరాలు రాయకపోయినా నాకు కష్టం కలగదు. కాని, నాకు తోచినప్పుడు నేను రాస్తూవుంటాను."

వాసంతికి ఏదో కొత్తస్వరం విన్నట్టయింది. 'పాపం - నేనేం చెయ్యగలను!' అనుకుంది.

కాలక్రమేణా ప్రేమభావం భక్తిభావంగా మారింది. అక్కడితో వాసంతికి ఉత్తరాలు రాయడం పూర్తిగా మానుకుంది. పిల్లలూ, భర్తా మమకారాలనేది. వంటచేసేందుకు వంటలక్కా, సంపాయించేందుకు రామ్మూర్తీ ఉండబట్టి, దైవచింతనలోపడి ఆధ్యాత్మిక గ్రంథాలతో కాలక్షేపంచేసేది.


ఒకరోజున రామ్మూర్తి అన్నాడు: "లలితా, నువ్వు చిక్కిపోతున్నావు." అని.

"ఏమి శాశ్వతం? దేహం కృశిస్తుంది......"

"ఎప్పుడూ అదే ధోరణా? ఏదిపడితే అది బంకనారపీచులా పట్టుకుంటావు."

"అదికాదండి. జాతస్య మరణం ధృవం."

తులసిమొక్కా, గౌరీదేవీ, పురాణపఠనా లలితని భర్తకి కాకుండాచేశాయి. మినప్పచ్చడితో జ్ఞాపకం పెట్టుకునే వాసంతి, తమ కుటుంబంలో ఎలాటి పరివర్తన తీసుకొచ్చినదీ గ్రహించలేకపోయాడు రామ్మూర్తి.



# బోలు మనుషులు

బోలుమనుషులం మేమే
దిష్టిబొమ్మలం మేమే
ఒకరికొకరు ఊతంగా
తలలనిండ చెత్తయ్యో!
మేమంతా సణిగినపుడు
మా ఎండిన నులిగొంతులు
అర్థరహిత శాంతంతో
ఎండుగడ్డిలో గాడ్పుల,
గాజుతునకలపై ఎలుకల
చప్పుడులా ఉంటై మా
ఎండిన నేలమాళిగల్లో.

రూపంలేని ఆకృతి, వర్ణంలేని ఛాయ,
పక్షవాతగ్రస్తశక్తి, స్పందరహిత సంకేతం.

సూటియైన కన్నులతో
అపరమరణ రాజ్యానికి
నిర్గమించినట్టివారు
ఎప్పటికైన గురుతొస్తే
మమ్మేల ననుకొంటారు-
హింసాభ్రష్టాత్మలమనికాదు,
బోలుమనుషులనిమాత్రం,
దిష్టిబొమ్మలనిమాత్రం.

**2**

నే కలలో కలుసుకొన సాహసించలేని కనులు
మరణస్వప్న సామ్రాజ్యంలో
కావిక్కడ ప్రత్యక్షం
అవిగో, అటనున్న కన్నులు
విరిగిన స్తంభంపై పడినఎండ
ఊగుతున్న చెట్టొక్కటి
గాలిపాటలో గొంతులు
ఉన్నవి చెరిగే తారకన్న
దూరంగా, గంభీరంగా.

నన్నెక్కువ చేరువగా చేరనీకు
మృత్యుస్వప్నసామ్రాజ్యంలో-
తాల్చనివ్వు నన్నుకూడ
బుద్ధిపూర్వక ఛద్మరూపం
ఎలుకబొంత, కాకితోలు, అడ్డపుల్లలు
పొలంమధ్య
వాయువు వర్తించినవిధి వర్తిస్తూ
చేరువగా లేకుండా-

వలదా చరమ మిలనం
సంధ్యాసామ్రాజ్యంలో.

**3**

ఇదిగో, ఇది చచ్చునేల,
బొమ్మజెముడు కంపలనేల.
నిలుపుతారు ఇచట శిలావిగ్రహాలు
ఇచట పొందుతారు వారు
మృతకరాల అనునయాలు
చెరిగేతార మిణుగురు వెలుగుక్రింద.

అక్కడకూడ ఇట్లాగే ఉంటుందా
అపరమృత్యురాజ్యంలో
ఒంటరిగా మేల్కొంటూ
మార్దవంతో కంపించే వేళలందు

'బైరాగి'

ప్రార్థననుంచి, ఖండిత పాషాణంవరకు
దేనినైనా ముద్దిడుకొనే పెదిమలతో.

## 4

ఆ కన్ను లిక్కడ లేవు.
ఇక్కడ లేవా కన్నులు.
చనిపోయే చుక్కలలోయలోన
ఈ బోలు లోయలోన
కోల్పోయిన మన రాచరికాల విరిగిన
దవడలోన.

ఈ అంతిమ సంగమస్థలిని
అంటిపెట్టుకొని వస్తూ
సంభాషణ తప్పిస్తూ
పోగయ్యాం ఈ ఉబికిన నదిఒడ్డున.
చూపులేదు, ఆకన్నులు
మరల మరలివస్తేతప్ప
శాశ్వత ధృవతారవలే
మృతిసంధ్యాసామ్రాజ్యపు
సహస్రదళపాటలమై
ఈ రిక్తమనుజమాత్రుల
ఏకైకాశాస్వరమై.

## 5

తిరుగుతున్నామిట నాగజెముడు చెట్టుచుట్టు
నాగజెముడు చెట్టుచుట్టు,
నాగజెముడు చెట్టుచుట్టు
తిరుగుతున్నాం నాగజెముడు చెట్టుచుట్టూ.
ఉదయం ఐదుగంటలప్పుడు.

భావానికీ
భవానికీమధ్య
కదలికకూ
క్రియకూమధ్య
నీడ పడుతున్నది.
ఈ రాజ్యం నీదే గనుక.

భావనకూ
సృజనకూమధ్య
ఆవేగానికీ
అనుక్రియకూమధ్య
నీడ పడుతున్నది.
జీవితమిది సుదీర్ఘం.

వాంఛకూ
సంకోచానికీమధ్య
సామర్థ్యానికీ
అస్తిత్వానికీమధ్య
సత్వానికీ
అవరోహణకూమధ్య
నీడ పడుతున్నది.
ఈ రాజ్యం నీదే గనుక.

నీదే గనుక
జీవితం
నీదే గదా అని

ఇలాగే అంతమొందుతుంది ప్రపంచం
ఇలాగే అంతమొందుతుంది ప్రపంచం
ఇలాగే అంతమొందుతుంది ప్రపంచం
దభీమనికాదయ్యా, కిర్రుమని మూలుగుతూ.

(T. S. Eliot రాసిన The Hollow men అనే కవిత కనువాదం).



# మహర్షి మామతేయ

ఋగ్వేద మంత్రద్రష్టలలో యీ మహర్షి మిగుల సుప్రసిద్ధుఁడు. ప్రపంచ వైజ్ఞానికులలోనీతని పేరు సువర్ణాక్షరములతో లిఖింపవలసియున్నది. అంతేగాక భారతదేశ చరిత్రలోకూడ ఇతడు ప్రాముఖ్యము గడించినవాడు. ఈ మహర్షి పేరునకు రావలసిన విఖ్యాతి నేఁడు కనపడకుండుట మిక్కిలి విచారకరము.

చరిత్ర దృష్టితో చూచినపుడు ఇతడు చాల విశిష్టమైన చారిత్రకపురుషు డనక తప్పదు. ఇతడు ప్రాగ్భారత దేశీయులకు మిక్కిలి పూజనీయుడైన పరమపిత. నన్నయభట్టారకుడు రచించిన తెనుఁగు భారతము ఆదిపర్వములో ఇట్లున్నది : ఈ మహర్షి పుట్టుగ్రుడ్డి యగుటచేత దీర్ఘతముఁ డనఁబడినాడు. ఇతవి భార్య ప్రద్వేషిణి. ఆమె ఈ గ్రుడ్డివానితో కొంతకాలము కాపురముచేసి పలువురు కొడు కులం గని పిమ్మట యీ అంధునకు పరిచర్య చేయజాలక మిక్కిలి విసిగికొని, ఇట్లనెను. భరించువాడు భర్త భరింపఁబడునది భార్య. మన దాంపత్యములో నేను నిన్ను భరించుచున్నాను. నీ వింతవఱకు భరింపఁబడుచున్నావు. ఈ ధర్మవిపరీత మిక కొనసాగదని చెప్పి ఆ జాత్యంధుని. ఇంధనంబులతో బంధించి గంగలో త్రోయించెను. దీర్ఘతము డందుకు కోపించి సతికి గౌరవము పతిమూలముననే గనుక పతిపరోక్షమున సతులు మాంగల్యరహితు లగుదురని శపించి గంగలో వేదము సస్వరముగ చదువుచు తేలుచు మునుగుచు పోవుచుండగా గంగాతీరమున నొకచోట "బలి'' యను రాజు ఈతనిం జూచి ఒడ్డునకుఁ దీయించి కట్లు విప్పించి నమస్కరించి యుపచారముచేసి స్వగృహమునకు తీసికొనిపోయి యెంతో పూజించి గౌరవించెను. అంతేగాక సంతానహీనుడగుటచేత అప్పటి సాంఘిక ధర్మము ననుసరించి సంతానము వడయుమని తన భార్య నీతనికి సమర్పించెను. దీర్ఘతమునివలన బలిక్షేత్రమున అంగ, వంగ, కళింగ, సుహ్మ, పుండ్రులను కుమాళ్లు అయిదుగు రుద్భవించిరనియు వా రాయాదేశములకు రాజులయిరని మహాభారతము నందును హరివంశము మొదలగు పెక్కు పురాణములందును కలదు.

---

గొబ్బూరి వెంకటానంద రాఘవరావు

భాగవతమునందు ముఖ్య విశేషమొకటి చేర్చబడినది. బలిక్షేత్రమున దీర్ఘ తమునికి కలిగిన కొడుకులు అయిదుగురు కారు, ఆరుగురు. ఆరవవాడు ఆంధ్రుడు. ఈ పేరుగల రాజు తూర్పుతీరమున నేలిన దేశమునకు ఆంధ్రదేశమని నామము కలిగెననుటకు భాగవతము ప్రమాణము. *

కావున యీ ప్రమాణమునుబట్టి అంగ వంగ కళింగ సుహ్మ పుండ్రదేశముల నేలిన రాజులకేకాక ఆంధ్రదేశము నేలిన ఆంధ్రుడను రాజునకుకూడ దీర్ఘతముడు జనకుడును వంశకర్తయును అని చెప్పుట కవకాశ మేర్పడినది.

చరిత్ర విషయ మటుంచి విజ్ఞాన విషయమునుబట్టి చూచినను దీర్ఘతముడు లోకవంద్యు డగుచున్నాడు. సమస్త విజ్ఞానమునకు గణితము మూలము. 'యధా శిఖామయూరాంణా నాగానాంమణయోయధా' నెమలికి శిఖవలెను నాగుబామునకు మణివలెను సమస్త శాస్త్రములకు గణితము శిరోభూషణమై వెలయుచున్నది. గణిత శాస్త్రమున రేఖాగణితము మిక్కిలి ముఖ్యమైనది. గ్రీకుదేశపు విద్వత్సభ లలో రేఖాగణితమునందు ప్రావీణ్యము లేనివారికి ప్రవేశమే లేదు. ప్లేటోయను తత్వవేత్త గ్రీసుదేశములో తన పరిషద్గృహ ద్వారముఖమున పెద్దయక్షరములతో పై విషయము లిఖించియుంచెను. రేఖాగణితమునందు గ్రీకులు మంచి ప్రజ్ఞ గలిగి యుండిరి. అందు యూక్లిడ్ (Euclid) అను గణికుడు సుప్రసిద్ధుడు. అతని గణిత మునే యీనాటికిని మన హైస్కూళ్ళలో విద్యార్థులకు గఱుపుచున్నారు. రేఖా గణితము గ్రీకుల సొమ్మనియును వారే లోకమున నీ గణితశాస్త్రము ప్రచారమునకు తెచ్చిరనియు పాశ్చాత్యులేగాక మనవారుకూడ తెలుపుచుండుట మిక్కిలి శోచ నీయము. ఏమనగా వేదములో వాజపేయ పౌండరీక అశ్వమేధ రాజసూయాది మహా యాగము లొనర్చుటకు యెంతో రేఖాగణిత విజ్ఞాన మవసరము. ఆ యాగములకు వలయు వేదీవిహార నిర్మాణములకు సూక్ష్మవివరములతో రేఖాగణిత సమన్వయము మిగుల యావశ్యకము. త్రిభుజములు చతురస్రములు దీర్ఘచతురస్రములు చక్రములు (circles) మొదలగునవి చక్కగా రచించినగాని హోమకుండములు


*భాగవత నవమస్కంధము సంస్కృతము 23 వ 5 శ్లోకము "అంగవంగ కళింగాద్యా సుహ్మపుండ్రాంధ్ర సంయుతాః జజ్ఞిరే దీర్ఘతమసో బలేక్షేత్రే మహీక్షితః చక్రుః స్వానామ్నా విషయాన్ షడిమాన్ ప్రాచ్యకాంస్థితే''

తెనుగు భాగవతం 9. 683. ఆ బలిక్షేత్రమున అంగవంగ కళింగ సుహ్మపుండ్రాంధ్రులను పేరుగల కుమారులు 6 గురు పుట్టిరి. వారు తూర్పుదేశంబునకు రాజులై అయా దేశంబులకు తమతమ నామధేయంబులిడిరి.

కోణమునకు 90 డిగ్రీలు సూత్రముపైననే నిలచియున్నది. సైనులు కోసైనులు టాంజంట్లు మొదలుగాగల కోణమితుల పునాదులపై నేటి వైజ్ఞానిక మహాసౌధము నిర్మింపఁబడినది.

దీర్ఘతముని సంవత్సర సూత్రము ననుసరించి మహాభారతమునందు ఉదంకుని చరిత్ర వర్ణింపబడినది. ఉదంకుడను ఋషి గురుపత్నికి కుండలములు తెచ్చువాడై పోవుచుండగా నతనికి ద్వాదశార చక్రమును ఆరుగురు కుమారులుగల ఒక చక్రమును ఒక తెల్లదారము నల్లదారమును ఒకదాని ప్రక్క నొకటిగా పడుగుచాచి మగ్గము పని చేయుచున్న యిద్దరు స్త్రీలను చూచెనట. ఆ దృశ్యమేమి? అని అతడు తెలిసిన వారి నడుగగా అవి ద్వాదశరాసులతోను 6 ఋతువులతోను కూడుకొనిన సంవత్సర చక్రములనియు తెల్లదారము పగలును నల్లదారము రాత్రిని సూచించి యీ రాత్రిం బగళులు ఒకదానివెంట నొకటి యేర్పఱచి పడుగుపేకలతో పనిచేయుచున్న స్త్రీ లిద్దరును ధాతవిధాతలనియు నతనికి తెలియవచ్చినవి. ఊహించి మాత్రము తెలిసికో వలసిన నిగూఢశాస్త్ర విషయములను జనసామాన్యమునకు చక్కగా చూపి తెలియఁ చేయుటకు ఉదంకుడు చూచిన దృశ్యములు సాధనములుగా పంచమ వేదమయిన మహాభారతము వర్ణించుచున్నది.

తిరుగుచున్నట్లు తోచు నొక గోళములో దిగువ సగము మూసివైచి, యెగువ సగము మాత్రము తిలకించితిమేని ఒక బిందువు, మీదకు లేచినపుడు దాని కెదురుగ 180 బది డిగ్రీలు దూరమున నున్న బిందువు అదృశ్యమగును. అనగా ఒక నక్షత్ర ముదయించునపుడు దాని యెదుటి నక్షత్ర మస్తమించినట్లగపడును. విజ్ఞాన పరిశోధనము కవితాపటిమతో మేళవించిచూచి మంత్రద్రష్టలైన వేదఋషులే యీ ప్రకృతి చర్యలకు పరస్పర విరోధభావము లారోపించి హృద్యముగా పురాణములు రచించిరి. ఇంద్రవృత్రులు ఈశ్వర మన్మధులు అర్జున మత్స్యయంత్రములు గరుడ సర్పములు ఖగోళమున నిట్టివి. వీనికి మూలములైన రేఖాగణిత సూత్రములను రమ్యముగ రచించి లోకమున చక్కగా వెలయఁజేసిన దీర్ఘతమ మహర్షి మామతేయుడు మన కెల్లరకు వంద్యుడు.



# రాజ్యలక్ష్మి

వి. సహజానంద

"లచ్చమ్మగారూ!"

......................

"లచ్చమ్మగారూ!"

రాజ్యలక్ష్మి లోపల శివస్తోత్రం చేస్తోంది. ఆమెకి పిలుపులు వినబడలేదు. తల్లి వచ్చి చూసింది. కూతురి అత్తవారి ఊరునుంచి ఎవడో మాలవచ్చాడు.

"మాతల్లిగారెదండీ? ఆ గుమాస్తాగారు మమ్మలను గుడిసెలు పీక్కోని స్థలంలోంచి పొమ్మంటున్నాడు."

తల్లి లోపలకు వెళ్ళి కూతురికి విషయం చెప్పింది. పారాయణ ముగించి, తలుపు వెనకనుంచుని, విన్నది రాజ్యలక్ష్మి.

"మా అయ్యగారి పేరంతా పాడుచేస్తున్నాడు ఈ గుమాస్తా. ఆ అయ్య స్థలాలిచ్చి గుడిసెలు వేసుకోమన్నాడు. ఏదో తలోకదిక్కు ఇంత కొంప్ర చూపించాడు. ఈ గుమాస్తా గారు..." అంటున్నాడు మాల.

"అమ్మా....నేను రేపు ఆ ఊరు వస్తానని చెప్పు వాడికి" అంది రాజ్యలక్ష్మి.

మాలవానికి సంతోషంతోపాటు ఆశ్చర్యమూ కలిగింది. యజమానురాలు వస్తుందని వాడూహించలేదు. రమ్మని వాడు మొఱపెట్టనూలేదు.

తల్లి తెల్లబోయింది. కూతురు హఠాత్తుగా నిర్ణయించుకున్న నిశ్చయం తల్లికి అర్థంకాలేదు. "నువ్వు వెళ్ళటమేమిటే అమ్మాయి!" అని అడిగింది.

"అవునమ్మా .... అక్కడనుండి నాకు పిలుపువచ్చింది" అంది కూతురు.

"మాలవాడు ఏదో చెప్పటమూనూ, నువ్వు బయలుదేరటమూనా? ఈ రెండేళ్ళలో ఎప్పుడైనా వెళ్ళావుటే?" అంది తల్లి.

అవును. భర్తపోయాక ఈ రెండేళ్ళలో తాను ఎప్పుడూ ఆ ఊరు మళ్ళీ వెళ్ళలేదు. వెళ్ళాలని అనుకోలేదు. కాని ఈసారి ...

"మాలవాడు చెప్పటంకాదే! ఆ గుమాస్తా చేస్తున్న అన్యాయాలమూలంగా వారి ఆత్మకు శాంతి ఉండదు" అంది రాజ్యలక్ష్మి.

పొలంనుంచి వచ్చిన తండ్రికూడా చెప్పి చూశాడు. కాని రాజ్యలక్ష్మి ప్రయాణాన్ని ఆపుకోలేదు. "ఈ గొడవలన్నీ నువ్వు చక్కబెట్టలేవుతల్లీ. మాలమాదిగలు .... వీళ్ళంతా ఇలాగే చెప్తారు. వాటన్నిటికి చెవిఒగ్గితే మనకు ఆస్తులు దక్కవు. ఏదో ఆ గుమాస్తాయే చూస్తాడు" అన్నాడు.

రాజ్యలక్ష్మి ఏమీ మాట్లాడలేదు. ఆ ఊరి ప్రయాణ మనగానే కళ్ళు నీళ్ళతో నిండినయ్. గతమంతా భగ్గుమంది. ఆస్తులు దక్కటం గురించి తండ్రిచేసిన బోధకూడా ఆమె మనస్సుకు పట్టలేదు.

* * *

తెల్లవారేప్పటికి ఊరు గుప్పుమంది. నాలుగు రేవులవద్ద రాజ్యలక్ష్మినిగురించే రహస్యంగా, బాహాటంగా చర్చలు సాగుతున్నయ్. ఇక ఈ పెద్దకామాటాన్ని స్వయంగా ఏలు

కుంటుందని, ఊర్లో ఎవరెవరి సలహాలు పాటిస్తుందో అని ఊహాగానానికి గొంతులెత్తారు.

రాజ్యలక్ష్మి భర్త ఊరికి మోతుబరిఆసామి. మాగాణి రెండువందలెకరాలు, గరువు వంద ఎకరాలూ ఉంది. ఊళ్ళో గొల్ల, కాపు, మాల, మాదిగ, బీద, బిక్కి వేసుకున్న ఇళ్ళన్నీ అతని స్థలాల్లోనే! తూర్పున కరువు కాగలేక తరలివచ్చిన రైతాంగానికి తలా ఎకరమూ, రెండెకరాలూ కౌలుకిచ్చాడు.

అందువల్లనే అనుకోకుండా రాత్రికి రాత్రే రాజ్యలక్ష్మి వచ్చిందంటె, అందరికీ తమ ఇళ్ళకే ఎవరో చుట్టం వచ్చినట్టుంది. ఎంతో కాలం కాపురానికి నోచుకోని ఈ ధనికస్త్రీ యొక్క మనస్సు అందరికీ అయోమయంగా ఉంది. ముఖ్యంగా అందరికంటె బీదబిక్కికి ఎక్కువగా మనస్సుకు పట్టింది రాజ్యలక్ష్మి రాక. అంతకంటెకూడా ఎక్కువగా ఆసక్తితో ఉన్నారు-ఊరిపెద్దలు. ఈ పతిహీనసంసారపు చుక్కాని ఎవరిచేతికి చిక్కుతుందా అనే ఆశ వారిని ఉద్రేకపరుస్తోంది.

అందరూ ఒకళ్ళతర్వాత ఒకళ్ళు వెళ్ళి రాజ్యలక్ష్మి తండ్రిని పరామర్శించారు. అంతా కూడా మృతజీవిని పదేపదే జ్ఞప్తికితెచ్చి, తెచ్చుకుంటూ కళ్లు తుడుచుకున్నారు. గదిలో తలుపుచాటున కూర్చొనిఉన్న రాజ్యలక్ష్మి భర్తనుగురించి జరుగుతున్న ప్రశంస విని, వస్తున్నదుఃఖంలోకూడా ఏదో తృప్తిపొందుతోంది. ఆకాశంలోనిమబ్బుకు నేలపై చల్లని నీడపడ్డట్టు, మృత్యులోకంలోని భర్త యొక్క కీర్తిచ్ఛాయ తనకూ, పల్లెవారికీ మహావట వృక్షపునీడలా ఆశ్రయం ఇస్తోంది.

దిగవిడిచివెళ్తున్న తండ్రితో అంది: "ఇక్కడ నాకేమీ భయంలేదు....నాన్నా.... అందరూ వారి తల్లితండ్రుల్లా, అన్నదమ్ముల్లా ఉన్నారు. ఇదంతా మనబంధుకోటి."

తండ్రి అన్నాడు:

"పిచ్చితల్లివి .... మాటలను నమ్మకు.... వీళ్ళతో వేగటం కష్టం. నీకుమించిన బరువిది."

కర్రపొడుచుకుంటూవచ్చి, వంగి నేల తాకుతున్న నడుమును మెల్లగా పైకెత్తి, శాస్త్రుల్లు తాతయ్య "ఏది....మాతల్లి....రాజ్యలక్ష్మి" అన్నాడు సావట్లోకివచ్చి.

భర్త ముత్తవతల్లిని చాపవేయమని రాజ్యలక్ష్మి, "తాతగారికి నమస్కారం" అంది.

"ఎన్నాళ్ళైంది తల్లీ నిన్ను చూసి" అన్నాడు తాతయ్య.

"మా మ్మ గా రు కు లా సా...." అంది.

"ఆ....తల్లీ....మీఆయన చదువుకనివచ్చి నన్ను అరుగుమీద వదిలిపెట్టి లోపల మునలిదాన్నిపీక్కించివెన్నతినేవాడు.మీరిచ్చినపాడే!"

భర్తకు చదువుచెప్పింది శాస్త్రుల్లుతాతయ్య. ఈయనతో భర్తకు చాలా చనువు.

"ఎలా ఉంటున్నారు?" అని అడిగింది.

"అలాగే .... ఒకపూటతిని .... ఒకపూట తినక." వెళ్తూ,మళ్ళీ వెనక్కువచ్చి, గుమ్మం ముందు నిలబడి, మెల్లగా "ఇదిగో ఈ గుమాస్తా ప్రజలను పీడిస్తున్నాడు....చూశావుగా....నువ్వే రాకపోతే, ఆ మాలవాళ్ళు ఊర్లోంచి వెళ్ళిపోవలసివచ్చేది. వీడు దుర్మార్గుడు" అని చెప్పి కర్ర పొడుచుకుంటూ, భద్రాద్రిరాముడిని తలచుకుంటూ వెళ్ళిపోయాడు. ఆపూటే రాజ్యలక్ష్మి పంపిన బియ్యం మూటను చూసుకొని మురిసిపోయాడు "ఇక మనకు ఫరవాలేదు" అని పొట్ట నిమురుకున్నాడు.

* * *

ఇంటిముందు బండీ ఆగగానే చిన్నపాలేరు అరిచాడు. "చిన్నబాబుగారువచ్చా"రని. ముత్తవతల్లి దొడ్లోనుంచి, "ఒరే శశీ!.... శశీ....ఒక్కడివేవచ్చావా!" అంటూ వస్తోంది.

రాజ్యలక్ష్మి ఈ కలకలం విని, పనివానితో చెంబులతో నీళ్ళు పంపింది.

కాళ్ళుచేతులు కడుక్కోకుండా, సూటిగా లోపలకువచ్చి, శశి "ఒదినా! ఒదినా!" అని పిలిచాడు. రాజ్యలక్ష్మి గదిలోంచి అంది:

"బాబూ! ఆ కుర్చీలో కూర్చో....ఉత్తర మైనా వ్రాయించలేదేం మీ మావయ్యచేత?"

"ఉత్తరంకన్న దబ్బునేవచ్చాగా!"

"తెలవలేమిట్రా నాయనా" అంది ముత్తవతల్లి.

"లేదు" అన్నాడు మెల్లగా శశి.

"మరి?" అంది ముత్తవతల్లి.

శశి ఏమీ సమాధానం చెప్పలేదు. కన బడకుండా మాట్లాడుకున్న రాజ్యలక్ష్మిపై కోపంవచ్చింది. గభుక్కున కుర్చీలోంచి లేచి గభాలున గదితలుపులు తోసుకొని "ఒదినా" అని లోపలకు వెళ్ళిపోయాడు.

ఏమీ తోచని ముత్తవతల్లి మనవడి సామాను సర్దించటానికి పోయింది.

"నే నిక ఇక్కడే ఉంటాగా .... చదువు వదిలేసుకొని వచ్చావేం శశీ!" అని అడిగింది రాజ్యలక్ష్మి.

"నే నింక బస్తీకి పోను" అన్నాడు శశి.

"అబ్బే అలా అనకూడదు. చదువుపోదూ? ... మళ్ళీ సెలవులకు రా" అంది రాజ్యలక్ష్మి.

మరునాడుదయం శశి ఇంట్లో ఎక్కడా కన్పించిలేదు రాజ్యలక్ష్మికి. పాలేరుచెప్పాడు, గొడ్లదొడ్డిలో కోడెదూడతో ఆడుకుంటున్నాడని. సాయంకాలమూ శశి ఇంట్లో కన్పించ లేదు. వీథిబడిపిల్లలతో ఆడుకోటానికి వెళ్లాడు. తిరిగి వచ్చాక రాజ్యలక్ష్మి అంది:

"నే నున్నానని వచ్చానన్నావు...పొద్దస్తమానమూ నా కంటికే అగపడటల్లేదు.... ఎందుకు....రేపు పంపిస్తా."

"ఆ .... ఆ .... కాదు .... ఇంకెప్పుడూ వాళ్ళతో ఆడుకోటానికి పోనుగా" అని మారాంచేశాడు.

మరునాడే శశి బయలుదేరక తప్పింది కాదు. రాజ్యలక్ష్మి మఱదిపై కొంచెం కోపం కూడా పడవలసివచ్చింది.

"ఇంక చచ్చినా రాను" అన్నాడు వెళ్తూ.

"ఆ మాటమటుకు అనకు చిన్నబాబూ!" అంది రాజ్యలక్ష్మి.

బిక్కమొహంతో వాడు బండీ ఎక్కాడు. రాజ్యలక్ష్మి మఱదికని చేయించిన మిఠాయి, తినుబండారము రెండుడబ్బాల్లో పెట్టింది.

తిరిగివచ్చిన బండీవాడు చెప్పాడు. "మళ్ళీ శనాదివారాలకే వస్తానన్నాడు చిన్నబాబు."

* • •

గుమాస్తా రాజ్యలక్ష్మిగదిముందు నిలబడి,

"ఈయేడు రైతులెవరూ సరిగా కట్టుబడులు చెల్లించలేదు" అన్నాడు. రాజ్యలక్ష్మి వచ్చి మాలవాళ్ళను స్థలంలో ఉండనీయటంతో అతనికి దెబ్బతిన్నట్టయింది. అందువల్ల ఈ కట్టుబడి బకాయీలభారం యజమానురాలి నెత్తినే వేయాలనుకున్నాడు.

"రైతు లెందుకు చెల్లించలేదు?" అని అడిగింది రాజ్యలక్ష్మి.

"మన అలుసబట్టే....మొన్న ఆ మాల వాళ్ళను స్థలంలోంచి గెంటేస్తానంటె వద్దంటి రయ్యే. మన మిలా కనికరిస్తుంటె వాళ్ళు నెత్తికెక్కుతారు" అన్నాడు గుమాస్తా.



రండి, రండి!



వచ్చేట్రాంలో ఎక్కు!

"అయితే ఏంచెయ్యాలి?" అంది రాజ్య లక్ష్మి విసుగ్గా.

"జప్తులు చేయించాలి"

"అంటె?"

"అదంతా కోర్టువ్యవహారం. నేను చూసుకుంటాను. ఏదైనా యజమానులు మీరు 'ఊ' అంటేనేగా!"

"సరే చెయ్యండి" అంది రాజ్యలక్ష్మి.

ఇంకా గుమాస్తా కదలలేదు. రాజ్యలక్ష్మి "ఇంకేమి అడగాలి" అంది.

"మరి మనస్థలంలో ఆ మాలవాళ్ళు కల్లుపాకకూడా వేశారు. రోజూ సాయంకాలం తాగుళ్లు తందనాలు" అన్నాడు గుమాస్తా.

"ఛీ....కల్లుపాక ఏమిటి?" అంది రాజ్యలక్ష్మి.

"అందుకే నేను వాళ్ళను లేచిపొమ్మనేది... మీరు ఒప్పుకుంటె...."

"ఇక్కడ తాగుడూతందనాలూ ఉండటానికి వీల్లేదని చెప్పండి" అంది రాజ్యలక్ష్మి.

"చిత్తం" అని గుమాస్తా వెళ్ళిపోయాడు.

కానీ సయూక వ్యవహారి వచ్చి గుడి గోడలు పగిలి, పడిపోతున్నయని, మరమ్మతుచేయించాలని కోరాడు.

రాజ్యలక్ష్మి విని గుమాస్తాతో డబ్బివ్వమని చెప్తానంది. పూజారివెళ్లాకఅవధాన్లుగారువచ్చి చెఱువుకు గట్టువేయాలని, లేకపోతే వేసవిలో నీళ్ళులేక జనం అలలాడుతారని మొఱపెట్టుకున్నారు. రాజ్యలక్ష్మి 'ఊ' అంది. సాయంకాలం బడిపంతులువచ్చి, బడిపాక కప్పు సరిగాలేదని, తాటాకు వేయించాలని అన్నాడు.

ఒకరితర్వాత ఒకరువచ్చి ఇలా ఎందుకో అందుకు యాచించటం పరిపాటయింది.

గుడిపేర, చెఱువుపేర పొలం ఉంది. అయినా వాటి మరమ్మతు ఖర్చులకు రాజ్యలక్ష్మి ఒప్పుకుంది. బడికి మానేజరు అనేవాడున్నాడు. సర్కారువారు ఆయనకు డబ్బిస్తారు. పిల్లలనుంచి జీతం వసూలుచేస్తాడు. అయినా కప్పుకు రాజ్యలక్ష్మి తాటాకు కొని ఇచ్చింది. అక్కడకువెళ్ళి వట్టిచేతులతో తిరిగివచ్చినవాడు ఒక్కడూ లేడు.

సెలవులకు శశి వచ్చాడు.

"రావన్నావుగా" అంది రాజ్యలక్ష్మి.

"నీకు కోపం వస్తుందని వచ్చాను." అన్నాడు శశి. రాజ్యలక్ష్మికి నవ్వువచ్చింది.

వీథిబడి పెద్దపంతుల్ని పిలిపించి శశి చదువు పరీక్ష చేయించింది రాజ్యలక్ష్మి.

శశి ఈమధ్యబొత్తిగా పుస్తకాన్ని తెఱచిన పాపానపోలేదు. వాళ్ళ మేనమామగారింట్లో వాడిని చదివావా లేదా అని అడిగి బాధపెట్టే వాళ్ళెవరూ లేరు. మామ పెద్దవ్యాపారి. వారింట్లో సరస్వతికి చోటులేదు. శశికి ఆడుకోటానికి, పిల్లలతో తిరగటానికి, సినిమాలకు పోవటానికి చాలా వీలుగా ఉంది. అసలు రాజ్యలక్ష్మి ఊరికి వచ్చిందన్నాక అతను బస్తీ చదువు మానేసి, ఇంటికి తిరిగి వచ్చేయాలనుకున్నాడు. హాయిగా పిల్లలతో ఆడుకుంటూ, కోడెదూడలతో పరుగెత్తుతూ, ఒదినెగారివద్ద మారాంచేస్తూ కాలం గడప వచ్చుననుకొని వచ్చాడు. కాని వచ్చిన మర్నాడే రాజ్యలక్ష్మి తన చదువునుగురించి ఇలా శ్రద్ధతీసుకోవటంతో శశికి అసంతృప్తిగా ఉంది. బడిపంతులు ప్రహ్లాదుడి కథంతీసి అడిగాడు. శశి ఒక్కదానికీ జవాబుచెప్పలేదు. సీతాపహరణం పాఠం తీశాడు పంతులు. శూర్పణఖ ముక్కు చెవులు తెగ్గోశాడు లక్ష్మణుడు అంతకన్న నాకు తెలియదన్నాడు శశి. ఆ పంతుల్ని మీ రచ్చబొమ్మలో హిరణ్యకశిపుడిలా ఉన్నారన్నాడు. పంతులికి ముక్కుమీదకు వచ్చింది కోపం. రాజ్యలక్ష్మి ఖిన్నురాలైంది. పంతులు వెళ్ళిపోయాడు.

పుస్తకాలన్నీ ఒదినెగారిగది మూలన విసిరేసి, పెద్దకాగితం ఒకటితీసి. "ఒదినా.... గాలిపటం కట్టిపెట్టవూ!" అన్నాడు.

ఛళ్ళున చెంపమీద ఒకటి పెట్టింది రాజ్యలక్ష్మి. కొట్టిన ఒదినా, దెబ్బతిన్న మఱిదీ ఇద్దరూ విభ్రాంతపోయారు. రాజ్యలక్ష్మి తడబడ్డది. కంపించింది. శశి కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగినయ్. ఏడ్పు ఆపుకుంటూ వాడు అక్కడనుంచి లేచి వెళ్ళిపోయాడు.

ముత్తవతల్లి మొత్తుకుంది. "చదవలేదని కొట్టితే వాడే నూతిలోనో, గోతిలోనో దూకుతాడు. వంశానికి ఒక్కగాను ఒక్కడు."

రాజ్యలక్ష్మి తయారుచేసిన గాలిపటం తీసుకొని చిన్నపాలేరు గుళ్ళో దిబ్బమీద సిగరెట్టు పీలుస్తున్న శశిదగ్గరకు వెళ్ళాడు.

రాజ్యలక్ష్మి కిటికీదగ్గరనిలబడి ఆకాశంలోకి చూస్తోంది. తిరిగివచ్చిన పాలేరు, "అమ్మగారూ! బాబుగారు సిగరెట్టు కాలుస్తున్నారు" అన్నాడు.

"ఛీ.... వెధవా!" అంది రాజ్యలక్ష్మి.

"పోనీ పూజారి సోమయ్యతాతను అడగండి" అని అక్కడనుంచి వెళ్ళిపోయాడు పాలేరు. రాజ్యలక్ష్మి కాళ్ళదగ్గర గాలిపటం పడిఉంది-రెక్కలు తెగిన పక్షిలాగా. శశి గాలిపటాన్నంతా చింపేసి పంపాడు.

చీకటిపడ్డాక తిరిగి వచ్చాడు శశి. కాని రాజ్యలక్ష్మితో మాట్లాడలేదు. అన్నంతిని, వసారాలో పక్కవేయించుకొనిపడుకున్నాడు. గాఢనిద్ర పట్టింది. చలిగాలి బాగా వీస్తోంది. రాజ్యలక్ష్మి వెళ్ళి దుప్పటికప్పింది. ఉలిక్కిపడి లేచి, వెళ్తున్న ఒదినెగారి చేతులు పట్టుకున్నాడు. పట్టుపడ్డదొంగలా రాజ్యలక్ష్మి నిలబడ్డది.

"జోలకొట్టు...ఒదినా" అని కళ్ళుమూశాడు శశి. నిద్రపట్టకపోవటంతో కళ్ళు తెఱిచాడు, ఒదినెకేసిచూసి. "ఏడుస్తున్నావేం ఒదినా!"




"నాకు డైవోర్సు యిప్పించండి, కారణాలు కనిపిస్తూనేవున్నై!"

అని లేచికూర్చున్నాడు. రాజ్యలక్ష్మి మాట్లాడలేదు. ఇంకా ఏమో అడుగబోతున్న వాని పెదవులపై చెయ్యివేసి గుండెకు హత్తుకుంది.

* * *

పోలీసు ఉద్యోగులు వచ్చి లోపల అరుగుపైకూర్చున్నారు గదిగుమ్మందగ్గర నిలబడ్డ గుమాస్తాను రాజ్యలక్ష్మి అడిగింది. "ఎవరింట్లో దొంగలుపడ్డారు" అని.

"దొంగలుకాదు. అదంతా తర్వాత చెప్తాను. మళ్ళీ ఇప్పుడే వెళ్తారు వీళ్ళు. ఏదో పది రూపాయలు వాళ్ళకు...." అని గుమాస్తా పోలీసులదగ్గరకు వెళ్ళిపోయాడు. రాజ్యలక్ష్మికేమీ అర్థంకాలేదు. అంతా అయోమయంగా ఉంది. నాలుగుదెబ్బలు వినబడినయ్. తుళ్ళిపడి లేచింది రాజ్యలక్ష్మి. మళ్ళీ నాలుగు కర్ర దెబ్బలు వినబడ్డయ్. కిటికీలోంచి చూసింది. పోలీసులెవరినో కొట్టుతున్నారు. వాడు కిందపడ్డాడు. గబగబా ఆలోచనలేకుండా సూటిగా వసారా గుమ్మంలోకివచ్చి. "వాడిని కొట్టకండి" అంది రాజ్యలక్ష్మి.

"వాడు మనకు బకాయిఉన్నాడు" అన్నాడు గుమాస్తా.

"అదంతా నా ఇష్టం. ముందువాడినిక్కడి నుంచి వెళ్ళమనండి" అంది రాజ్యలక్ష్మి.

పోలీసుల చేతులాడలేదు. గొల్లవీరడు తిన్నదెబ్బలకు తూలుతూ, సోలుతూ అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. చూడవచ్చినవారందరికీ ఆశ్చర్యమైంది. ఇంతవరకూ వీరిలో చాలా మందికి ఈమె అదృశ్యస్త్రీ. ఇవ్వాళ హఠాత్తుగా ఆమెను చూడగానే విస్మితులయారు. అంతాకూడా గుమాస్తాదే తప్పని ఎవరిదారిన వారు వెళ్ళారు. పోలీసులూ వెళ్ళిపోయారు. అవమానంతో దహించిపోతూ, గుమాస్తా అన్నాడు. "పనంతా చెడింది."

"ఏంపని..పాడుపని..ఎందుకా కొట్టటం.." అని తలుపులు వేసుకుంది రాజ్యలక్ష్మి. ఆమె మనస్సు కలతచెందింది. తనవాకిట్లో అన్యాయమూ, దౌర్జన్యమూ జరిగినై. తనెంత కవి పెట్టున్నా ఏదో అక్రమం జరుగుతూనేఉంది.

* * *

శశి ఇప్పుడు కాలేజీలో చదువుతున్నాడు. వేసంగిశలవులకు కూడా ఇంటికి రావట్లేదు. కావలసిన డబ్బుకై కబురంపి నప్పుడల్లా రాజ్యలక్ష్మి పంపుతోంది. ఒదినెగారు ఎన్ని కబుర్లుచేసినా అతడు రావట్లేదు. బస్తీలో అతన్ని చూసివచ్చినవాళ్ళు అతని సంగతంతా చెప్పగా రాజ్యలక్ష్మి ఖిన్నురాలైంది. బీడీలు, సిగరెట్లు, సినిమాలు తప్ప చదువులేదు. చెడుసావాసులతో ఎప్పుడూ తిరుగుతూ ఉంటాడు ఊర్లో అందరికీ శశి జీవితం తెలిసి పోయింది. ఒకే తల్లిబిడ్డలయినా, అన్నకు పూర్తిగా వ్యతిరేకం తమ్ముడు. రాజ్యలక్ష్మి భర్త బాగా చదువుకున్నాడు. సౌమ్యుడు. సత్సాంగత్యం కోరేవాడు. కాని శశి రానురాను చాలా హీనస్థితిలోకి వస్తున్నాడు.

రాజ్యలక్ష్మి కప్పుడప్పుడతని అనారోగ్యస్థితి తెలుస్తూనేఉంది. తనకుతానై బస్తీవెళ్ళింది. రెండురోజులున్నా, ఒక్కనాడు శివరాత్రి మటుకు ఇంటికివచ్చాడు. అప్పటికే బాగా చిక్కాడు. దగ్గుతున్నాడు.

"శశీ! నీవంట్లో బాగాలేదు. రా.... వెళ్దాం" అంది రాజ్యలక్ష్మి.

"ఇవ్వాళ పట్నంపోతున్నా .... ఇప్పుడు వీల్లేదు" అన్నాడు.

"ఎందుకు పట్నం" అని అడిగింది రాజ్యలక్ష్మి.

"ఇంకా ఇవన్నీ చెప్తూఉండాలేవిటి? ఈ ఏడాది గడిస్తే నే నింక మైనరును కాను. నాకు నీ అడ్డేమిటి?" అన్నాడు.

రాజ్యలక్ష్మి తెల్లబోయింది.

"శశీ! అలా మాట్లాడతావేం! నేను నీ కేమి అడ్డువచ్చా. పంపమన్నప్పుడల్లా డబ్బు పంపుతూనే ఉన్నాగా." శశి మాట్లాడలేదు.

"శశీ! నాకేంవద్దు .... ఇంటిదగ్గరఉంది అంతా నువ్వే చూసుకో....నీ ఇష్టంవచ్చినట్లు ఖర్చుచేసుకో .... కాని ఇలా దేశాలుతిరిగి, ఆరోగ్యం పాడుచేసుకోకు" అంది రాజ్యలక్ష్మి.

శశి ఈసారికూడా ఏమీ మాట్లాడలేదు. మేనమామభార్య అంది:

"వాడూ చిన్నపిల్లవాడుకాదు. ఈడు వచ్చింది. ఏమిటమ్మాయి నీపోరు! పిల్లనిచ్చు కొనేవాళ్ళం వాడి బాగోగులు మాకుమటుకు తెలియవూ? వచ్చే వైశాఖంలో వాడిపెళ్ళి.... అప్పటికి వాడికి మెజారిటీ వస్తుంది. వాడి సంగతి మేం చూడమూ?"

రాజ్యలక్ష్మికి పరాభవం పూర్తయింది. అత్తమాటలు విన్నాక శశిముఖం వివర్ణమైంది. తనకు చిరపరిచితమైన ఒదినెకళ్ళలో నీరుబకటం చూశాడు. "ఒదినా....వెళ్దాంపద... తెల్లవారుజాము రైలుకు" అన్నాడు.

*　　*　　*

రాజ్యలక్ష్మి మఱదితో ఊరు చేరుకుంది. ఇంటికివచ్చాక ఆమెమనస్సులో అశాంతి హెచ్చయింది. మాలమాదిగలంతా వాకిట్లో గుమికూడి మొఱపెటుకున్నారు. తమకు ఇళ్ళస్థలాలు ఖాళీలు చేయవలసిందిగా నోటీసులువచ్చినట్టు చెప్పుకున్నారు. అవధాన్లుగారు వచ్చి, చెఱువులో తామర, నాచు విపరీతంగా పెరిగింది అనుగ్రహించాలన్నాడు. ముసలి పూజారివచ్చి, దేవాలయసింహద్వారం ఒరిగింది, నిలబెట్టాలన్నాడు. ఊర్లో ఇంకెవరూ లేరా? ప్రతిపనికీ తనదగ్గఱకే వస్తారేం? రాజ్యలక్ష్మికి గొడవలతో మరింత వ్యాకులత హెచ్చి, "ఇక చిన్నబాబుది పెత్తనం.... రేపటినుంచి అతన్నే అడగండి అన్నీ" అని వీధితలుపులు వేసి లోపలకు వెళ్ళింది.

అంతా ఆశ్చర్యపోయారు. తమ ఇష్టదేవత ప్రసన్నంగాలేదు. ఈమెముఖాన విచారం కమ్మింది. కళ్ళలో ఆ కాంతిలేదు. దుస్సాంగత్యంలో పెరుగుతున్న చిన్నబాబు తమకు ఖామందు అవబోతున్నాడని తెలియగానే ఎవరికివారు పెదవులు చప్పరించారు.

"ఒదినా....ఇకనే వెళ్తాను....ఒక వంద రూపాయలివ్వు" అని అడిగాడు శశి.

అతని ముఖంకేసిచూసి, చేతితో చెంపలు తాకింది రాజ్యలక్ష్మి. జ్వరంతో ముఖం గాండ్రిల్లుతోంది.

"జ్వరం వచ్చిందా శశీ?" అని అడిగింది.

"భయంలేదు. ఈమధ్య ఎప్పుడూవస్తూనే ఉంటోంది.నేవెళ్ళిపోతా..ఇవ్వవూ" అన్నాడు.

రాజ్యలక్ష్మి ఏమీ మాట్లాడలేదు. మంచం వేసి పక్కవేసింది. శశి కేమీ తోచలేదు. జ్వరభారం తీవ్రమౌతోంది. రాజ్యలక్ష్మి యొక్క విషణ్ణ ముఖాన్ని చూస్తూ పడుకున్నాడు. రాజ్యలక్ష్మి విసురుతోంది. కన్నతల్లిలాంటి ఆకళ్ళలో వ్యధ గోచరిస్తోంది.

"ఒదినా....జోలకొట్టవూ!" అన్నాడు.

రాజ్యలక్ష్మి తల మంచంపట్టెపై వాలింది. ఆమె నిశ్వాసాలు శశి విన్నాడు. కాసేపయాక ఆమె జోలతో అతను పడుకున్నాడు. కాని ఆమెకు నిద్రపట్టలేదు. చీపురుపుల్లల్లాఉన్న శశికాళ్ళుచేతులు చూసి కంగారుపడ్డది. ఊపిరి బరువుగా పీలుస్తున్నాడు. జ్వరం హెచ్చింది. అకాలంలో భర్త చనిపోయాడు. లోకాన్ని మఱది రెండేళ్ళుంది పుట్టింట. తర్వాత మళ్ళీ ఊరికి వచ్చింది. ఈ చిన్నమఱదిని పెంచి పెద్దచేయాలని ఆరాటపడ్డది. ఒకవిధంగా తన అభాగ్యజీవితానికి అతనిరక్షణ ఆధారంగా ఉంది. కాని విధికింకా పగతీరలేదు.

శశిజ్వరం క్షయలోకి దింపింది. బస్తీనుంచి వైద్యుడిమీద వైద్యుడిని తెప్పించింది రాజ్యలక్ష్మి. కాని ఎవ్వరూ ఆశ చూపెట్టలేదు. ఏదైనా చల్లని ప్రదేశానికి తీసుకొవెళ్ళితే మంచిదన్నారు. బస్తీనుంచివచ్చిన మేనమామ పెళ్ళాంచెవిలో ఊదాడు. "తొందరపడి పెళ్ళి చేయలేదు. పిల్లదాని గొంతుకోసేవాళ్ళం." శశితో మామకుటుంబంలోఎవరూ బయలుదేరమన్నారు. కావలసినభార్య బావను చూసి జడుసుకుంది. గుంటలుపడ్డకళ్ళు, బైటపడ్డ బొమికెలు, దగ్గు....శశికి నిస్పృహకలిగింది. మామఅన్నాడు. "ఎక్కడకో వెళ్ళటంకూడా ఎందుకు? ఈ పదిరోజులూ ఇక్కడే ఉంటే సరి." గదిలోంచి శశి ఈ మాటలు విన్నాడు. పెద్దపెట్టున దుఃఖం వచ్చింది. రాజ్యలక్ష్మిని తండ్రివచ్చి వారించాడు. "ఇది ఘోరమైన జబ్బు. అయినా నువ్వెళ్ళి ఉపచారంచెయ్యటం లోకం హర్షించదు."

* * *

శశితో రాజ్యలక్ష్మి పెళ్ళింది. అక్కడ అనుపత్రి నర్సులతోపాటు తానూ ఉపచారం చేస్తోంది. చాకిరితో రాజ్యలక్ష్మి చిక్కిశల్యమైంది. అనుక్షణ దుఃఖంతో పాలిపోయింది.

"చిన్నబాబూ!" అంది.

శశి ఆమెవైపు చూచాడు.

"గుమాస్తాకు ఉత్తరం వ్రాయి .... గుడి ద్వారం బాగుచేయించమని....చెఱువు నాచు తీయించమని .... మాలవాళ్ళను స్థలంలోంచి వెళ్ళగొట్టద్దని .... నేను వ్రాస్తా .... నువ్వు సంతకంచెయ్యి" అంది రాజ్యలక్ష్మి.

"అదంతా గుమాస్తా చూస్తాడు. ఆ గొడవలన్నీ నీ కెందుకు?" అన్నాడు. రాజ్యలక్ష్మి జవాబు చెప్పలేదు. ఉత్తరం వ్రాసింది.

"ఒదినా!"

"ఏం చిన్నబాబూ!"

"నా కెప్పుడూ ఇలాగే ఉంటుంది. పోనీ ఒకసారివెళ్ళి రా!" అన్నాడు.

మరునాటిపొద్దున శశి ఆదుర్దాగా అన్నాడు.

"వెళ్ళకు....ఒదినా!"

"నేవెళ్ళట్లేదు....శశీ!"అంది రాజ్యలక్ష్మి.

"నిజం?" అని అడిగాడు శశి.

"ఒదినె ఎప్పుడైనా అబద్ధం చెప్పిందా?" అంది రాజ్యలక్ష్మి.

శశిముఖంలో సంతోషం వ్యాపించింది.

రాజ్యలక్ష్మి తండ్రి ఉత్తరం వ్రాశాడు. పిల్లవాడికి పెళ్ళి అని. అక్కతో తప్పక రావాలని, తమ్ములంతా గోలచేస్తున్నారని.

"ఎప్పుడు బయలుదేరతావు? ఒదినా!" అన్నాడు శశి.

"నే వెళ్ళను చిన్నబాబూ!" అంది రాజ్యలక్ష్మి.

"వెళ్ళు ఒదినా....పాపీ చిరాయువును నేను....పనికిమాలినవాడిని ... భ్రష్టుడిని.... క్షయరోగిని....ఇక్కడెందుకు నువ్వు ఒదినా? ఈ మరణశయ్యవద్ద ఎన్నాళ్ళనిఉంటావు" అన్నాడు శశి, ఆయాసంతో.

రాజ్యలక్ష్మి మాట్లాడలేదు.

"ఈ భయంకరమైన, జుగుప్సాకరమైన వ్యాధిగ్రస్తుడిదగ్గర నువ్వెందుకు ఒదినా! నా జీవితం ఎంత హీనమో మృత్యువూ అంత ఘోరం....వెళ్ళు ఒదినా! ఇక్కడ నువ్వెందుకు?" అన్నాడు శశి మళ్ళీ.

కాని ఇన్నిప్రశ్నలకూ రాజ్యలక్ష్మి జవాబు చెప్పలేదు.

శశికి హైరాణి వచ్చింది. ఆమెకళ్ళు చెమ్మగిలటం చూశాడు. ఆమె ముఖంకేసి చూస్తూ పడుకున్నాడు. ఆముఖం చూస్తుంటె, మలయమారుతం వీస్తున్నట్టు, జోలకొట్టినట్టు ఉంది అతనికి.

అన్న వచ్చాడు రాజ్యలక్ష్మిని పెళ్ళికి తీసుకొ వెళ్ళటానికి.

"ఏమే..అమ్మాయి..మరి బయల్దేరవూ?" అని అడిగాడు.

"ఎలారా చిన్నబాబునొక్కడిని విడిచిపెట్టి రావటం?" అంది రాజ్యలక్ష్మి.

"చిన్నబాబట....చిన్నబాబు....ఈ భ్రష్టుడితో నీకేమిటే .... వీడు .... ఈ దరిద్రుడు చస్తేనేం బతికితేనేం? వాడివాళ్ళంతా ఉండగా నీ కెందుకు వాడిక్షోభ" అన్నాడు అన్నగారు.

రాజ్యలక్ష్మి తలవాల్చుకుంది.


అన్న మళ్ళీ అందుకున్నాడు—

"నువ్వెంత కష్టపడ్డా వాడికి చదువబ్బలేదు. నువ్వెన్నిసార్లు కబురుచేసినా వాడువచ్చి నీ ముఖం చూడలేదు. ఆస్తి పంచుకుంటానన్నాడు. ఇట్లాంటి విశ్వాసంలేని పాపిష్టి వెధవదగ్గర నువ్వెందుకే పడిఉండటం.... చూడు ఎలా చిక్కిపోయావో .... హాయిగా ఇంటికి వచ్చి ఉండక."

ఈసారీ రాజ్యలక్ష్మి మాట్లాడలేదు.

"ఏమే మాట్లాడవేం?" అన్నాడు అన్న.

అయినా రాజ్యలక్ష్మి మాట్లాడలేదు.






# నాయకురాలు

"ఇన్‌క్విలాబ్ జిందాబాద్; విప్లవము వర్ధిల్లాలి; ధనికవాదం దగ్ధం కావాలి; ఇంపీరియలిజం డౌను, డౌన్; మహాత్మాగాంధీకి జై; కామ్రేడ్ స్టాలిన్ జిందాబాద్."

ఈనినాదాలతో ఆ కుగ్రామం మారు మ్రోగిపోతూ ఉంది. ప్రతిచెట్టు, ప్రతి పుట్ట, గుట్టా ఈ నినాదాలనే ప్రతిధ్వనింప చేస్తున్నట్లుంది ఆ రోజు మరీను.

ఇంకా బాగా తెల్లవారలేదు. తెల్లవారితే దశమిపండగ. అమ్మలక్కలందరూ ఝాము ప్రొద్దుండగానే లేచారు. పిల్లలకు తలంట్లు పోయాలని నీళ్ళ పొయిలో ముందు నిప్పేసి మంటపెట్టారు. "అవే విప్లవ జ్వాలలు. మనదేశంలో మహిళలే విప్లవాగ్నిని రాజెయ్యాలి" అన్నాడు కామ్రేడ్ చక్రధర్ పొయి విసుర్తూ చలికాచుకుంటున్న సుశీలకు దగ్గిరగా జరుగుతూ.

సుశీల ఇవతలికి జరగనూలేదు, చక్రధర్ అన్న మాటలకు సమాధానము చెప్పనూలేదు. ఇంతలో మళ్ళీ వినిపించినయ్. "ఇన్‌క్విలాబ్ జిందాబాద్; కామ్రేడ్‌స్టాలిన్ జిందాబాద్" నినాదాలు.

అవి విన్నతరవాత అక్కడ ఒక్క క్షణం ఉండలేకపోయినాడు చక్రధర్. పాచిపనిచేస్తూ, వాకిలి చిమ్మడం పూర్తి చేసి కళాపి చల్లుతున్న మహాలక్ష్మమ్మ చెవులు గింగురుమనేటట్లు, వూరంతా హడిలి మేల్కొనేటట్లు ఒక్క కేక వేశాడు, "అమ్మా! నీళ్లు తోడు. నేను తలంటి పోసుకోను." అని.

"వీడిది వట్టిమూర్ఖపువట్టు. ఎవరెంత చెప్పినా వినిపించుకోడు. వాడికి తోచదు. పండగపూటా తలంటి పోసుకోను అంటాడు. వీడు పోకపోతే అక్కడ కేకవేసేవాళ్ళు తక్కువ అవుతారు కామాలు" అనుకుంటూ మహాలక్ష్మమ్మ దొడ్లోకి వచ్చింది.

అప్పటికే కామ్రేడ్ చక్రధర్ నీళ్ళు తోడుకోవడం అయింది. సుశీల సబ్బు పెట్టె తెచ్చిఇచ్చింది. మహాలక్ష్మమ్మ ఎవర్నీ ఏమీ అనకలేక "వరేయ్ పండగాపూటయినా ఇంటిదగ్గర ఉండరాదుట్రా. రోజూ ఉండనేఉంది ఈ కొలువు. నువ్వు పోకపోతే అక్కడేమైనా ఆగిపోతుందా?" అని బ్రతిమాలుకుంది.

"అదిగాదత్తా ఇవాళ మనందరికీ విజయదశమి అయితే కామ్రేడ్ బావకి అక్టోబరు విప్లవం పండగాట. రష్యాలో సరిగ్గా 33 ఏళ్ల కిందట ఈ రోజునే రైతులూకూలీలూ రాజులైనారట. అట్లాగే

'శ్రీ పతి'

మనదేశంలోనూ కూలీలందర్నీ రాజులు చేస్తారట. కామ్రేడ్ బావ పోకపోతే ఆ విప్లవం ప్రారంభమే కాదుట." అంది సుశీల.

కామ్రేడ్ చక్రధర్ 'కాలాతీత'మైపోతూందన్న ఆందోళనలో ఇవేవీ వినిపించుకోలేదు.

ముహూర్తం మించిపోతోందని పెళ్ళిపెద్దలు హడావిడి పడినట్లే చక్రధర్ దబదబా నాలుగు చెంబులు కుమ్మరించుకొని మొహం మాత్రం సబ్బుతో రుద్దుకొని స్నానం పూర్తి చేశాడు. తడి తుడుచుకునే వ్యవధానం అన్నా లేకుండా 'లాంగ్‌క్లాత్ పైజామా, లాంగ్‌క్లాత్ లాల్చీ' వేసుకొని కాబూలి చెప్పులు తొడుక్కొని వీధిలోకి ఒక్క గంతువేశాడు.

"పెందలాడిరారా. పండగ నాడైనా వేళపట్టుకు ఇంత అన్నంతిందుగాని. మరీ ఇంత భల్లూకప్పట్టేమిట్రా ఎంత చెప్పినా వినిపించుకోనన్నా వినిపించుకోవు?" అంటున్నది వెనకాల మహాలక్ష్మమ్మ.

"వాళ్ళ గురువుగారి వాహనం భల్లూకమే అత్తా. వీళ్ళందరూ ఆయనకి బ్రహ్మరథం పట్టేవాళ్ళేగామరి. అందుకని వీళ్ళకీ ఆ గుణాలేవచ్చినయ్. బావ 'కామ్రేడ్ చక్రధర్' కాకుండా ఉంటే ఈపాటికి మన జిల్లాబోర్డు ప్రెసిడెంటు అయ్యేవాడుగాదూ" అంది సుశీల, వేళాకోళంగా ప్రారంభించిన మాటల్ని విచారంతో ముగిస్తూ.

* * *

ఆ సంవత్సరం రష్యావారి అక్టోబరు విప్లవ వార్షికోత్సవమూ మన విజయదశమీ ఒకేరోజున వచ్చినయ్. పీర్లపండగా, గోకులాష్టమి మాదిరిగాక ఈ రెండుపండగలకీ కొంత సంబంధం కాకపోయినా సామీప్యం ఉంది. ఈ రెండుపండగల అంతరార్థమూ ఒక్కటే. అందుకే కామ్రేడ్స్ అంతా "విప్లవము వర్ధిల్లాలి" అంటూ రష్యాకు జేజేలు కొడుతుంటే, ఎర్రజెండాలు పట్టుకొని ఊరేగుతూవుంటే వెంకటశాస్త్రి బడిపిల్లలు విల్లంబులు, కపిరాజులుపట్టుకొని 'జయాభిజయీభవ, దిగ్విజయీభవ'అంటూ 'అయ్యవారికి చాలు అయిదువరహాలు' అని తమ పంతులికి డబ్బు పోగుచేసి పెడుతున్నారు.

పక్షుల కిలకిల ధ్వనులు తగ్గినయ్. పనికిపోయే కూలీలు కావిళ్ళేసుకొని ఇంటికి నీళ్ళు చేరబోయడంకూడా పూర్తి అయింది. ఆఖరికావడి బుంగలు తోడుకొని చేంతాళ్ళు చుట్టచుట్టుకొని కొందరు కావడిబొంగు ముందుపక్కన తగిలించుకొని మరికొందరు కడవలమీదే పెట్టుకొని ఇళ్ళకు బయిల్దేరారు.

శ్రీధర్ అప్పుడే నిద్దర్లేచాడు. సుశీల తలంటిపోసుకొని కొత్త జాకెట్టూ కొత్త పరికిణీ కట్టుకొని చేతులో కోతి పట్టుకొని కూర్చోవడంచూచి ఉగ్రుడైపోయినాడు. తనని ఎందుకు లేపలేదు? తన మీద తన అన్నతో జట్టుకట్టిందనుకున్నాడు. నిద్దరమొహం. అందులో కోపం. ఇది చూచి సుశీల కోతిని ఆడించడం మొదలుపెట్టి "బావోయ్: ఇటు

ఈ కొతినన్నా చూడు. లేదా పోయిఒక్క సారి అద్దంలో అయినా చూచుకో" అంది.

"రారా, నే పోవాలి. నెత్తిన చము రెట్టించుకొని పళ్ళుతోముకో. అన్నాయి అప్పుడే వూరుసహం తిరుగుంటాడు. మీ పంతులు అప్పుడే ఇద్దర్ని పంపిం చాడు" అని మహాలక్ష్మమ్మ పిలవడంతో శ్రీధర్ చాలా చికాకు పరిస్థితుల్లోనుంచి సునాయాసంగా బయటపడ్డాడు.

తలంటిపోసుకొని కొత్తలాగూ, కొత్తబుష్‌కోటూ తొడుక్కొని విల్లంబు పుచ్చుకొని అందులో ఇంతగులాంపోసి సుశీలమీద ప్రయోగించి పరుగెత్తుకు పోయాడు. "గురితప్పిందిలేవోయ్‌బావా" అంటూవెనకాలేసుశీలకూడాపరుగెత్తింది. అప్పటికే వేంకటశాస్త్రితన 'వానర' సేనతో గాంధిచౌక్ కు బయల్దేరాడు.

ఆ వూళ్ళో అదొక ఆచారం. ఏ వూరేగింపుఅయినా అక్కడ్నుంచే ప్రారంభం కావాలి. 1933 లో గాంధి మహాత్ముడు ఆంధ్రదేశంలో హరిజన యాత్రచేసినప్పుడు ఆ వూరు వచ్చాడు. వూళ్ళోవాళ్ళందరూ చందా వేసుకొని మహాత్ముని హరిజననిధికి వెయ్యిన్నూట పదహార్లు సమర్పించడమేగాక చెరువు గట్టునఉన్న శివాలయంలో హరిజన ప్రవేశంకూడా జరిపించారు. అయితే అప్పటికీ ఇప్పటికీ వూళ్ళో హరిజనులు ఎవ్వరూ ఆ శివాలయంలోకి పోలేదు. అర్చకుడు సుందయ్య గాంధిగారు వెళ్ళిన తరవాత పుణ్యాహ్వాచనచేసి, అక్కడ గాంధిమహాత్ముడి విగ్రహప్రతిష్ఠ జరిగిన రోజున ఇంత అన్నదానంచేయించి శివాలయాన్ని "అపవిత్రః పవిత్రోవ" అన్నాడు. ఒకపక్కన శివాలయం ఉంటంవల్లా ఇంకోపక్క గాంధిగారి విగ్రహం ఉంటంవల్లా ఆ చెరువుకట్ట గ్రామస్థులందరికీ సమావేశస్థలం ఐంది.

ఏ పిలుపూ లేకుండానే పొద్దునా, సాయింకాలంకూడా అక్కడ జనం పోగవుతారు. అందుకే ఆ వూళ్ళో కాంగ్రెస్‌వాళ్ళుగాని, కమ్యూనిస్టులుగానీ మీటింగు పెట్టాలంటే అక్కడే పెడు తుంటారు. అక్కడ్నించి ఊరేగింపు బయిల్దేరితే అక్కడ చేరేవారు కొంత దూరమన్నా ఊరేగింపుతో వస్తారు.

అట్లాగే విజయదశమినాడు అటు కామ్రేడ్ చక్రధర్ బృందములు ఎర్ర జండాలతోనూ, ఇటు పంతులు వెంకట శాస్త్రి సేన విల్లంబులు, దసరా కోతుల తూనూ అక్కడచేరారు. వెంకటశాస్త్రి శివాలయంలోకిపోయి అభిషేకం చేయించి పిల్లలకి ప్రసాదమూ, విభూతీ పంచుతున్నాడు. అవతల గాంధి మహాత్ముడి విగ్రహానికి కొంచెం దూరంగా ఎర్రజెండాలు ఎగురు తున్నయ్. ఒక జెండా పట్టుకొని కామ్రేడ్ చక్రధర్ గంభీరోపన్యాసం దంచేస్తున్నాడు. తను గానీ, తన బడి పిల్లలుగానీ అక్కడ ఉంటం ప్రమాద మనుకొని వెంకటశాస్త్రి హడావిడిగా అక్కడనుంచి "జయాభిజయీభవ, దిగ్విజయీభవ" అంటూ, ఎవరున్నారో, ఎవరులేరో అని అయినా చూచుకో కుండా బయల్దేరాడు.

* * *

ఒకవైపునుంచి కామ్రేడ్ చక్రధర్ దళం, రెండోవైపునుంచి వేంకటశాస్త్రి దండు దాదాపు ఒకేసమయంలో శివకామయ్యగారిల్లుచేరారు. ఈ ఎదురుకోల కేవలం కాకతాళీయమే అయినా వేంకటశాస్త్రిపంతులుకి మాత్రం ముచ్చెమటలు పోసేటంతపని జరిగింది. ఎదురుగా చక్రధర్ పక్కన సుశీలకూడా ఒక ఎర్ర జండా పట్టుకురావడం వేంకటశాస్త్రి చూడలేకపోయినాడు. అంతవరకూ తన దండులోనే శ్రీధర్ పక్కన దసరా కోతిలా ఆడిస్తూ వస్తున్నదనుకున్నాడు. తను ఆవూళ్ళో పంతులుపని ప్రారంభించి పదేళ్ళయింది. ఇలాంటిపొరబాటు ఎప్పుడూ జరగలేదు. ఉద్యోగంమానుకొని ఊరువదలి పోవల్సిందే అనుకున్నాడు. శివకామయ్యగారి కాబొయ్యే కోడలు కమ్యూనిష్టుదళంలో చేరడానికి తనే బాధ్యుడైనట్లు వేంకటశాస్త్రి అమితంగా బాధపడ్డాడు.

ఇంతలోనే అరుగుమీద కూర్చున్న శివకామయ్య వేంకటశాస్త్రిని పరామర్శించకుండానే సుశీలను విమర్శగా చూచి "మెళ్ళోగొలుసేదే అయ్మాయ్" అని అడిగేసరికి బడిపంతులు గుండె ఆగిపోయేటంత పనిఅయింది. తనతోపాటు సుశీలరానందుకు కొంత తృప్తి పడ్డాడుగాని, ఈరెండు విషాద సంఘటనలకూ తనే నేరస్థుడైనట్లు భావించుకొని అంత వేంకటశాస్త్రీ కొయ్యబారి పోయినాడు.

"మాఁవా; బావమర్యాద కాపాడ్డానికి నాగొలుసు ఇయ్యాల్సి వచ్చింది." అని సుశీలచెప్పిన సమాధానం అక్కడున్నవాళ్ళల్లో ఇద్దరికితప్ప బోధపడలేదు సుశీల సమాధానంవిని చక్రధర్ ఉగ్రుడైనాడు. తన మర్యాద మంటగలిసిపోయే పరిస్థితులు ఏర్పడ్డట్టూ, సుశీల వాట్ని నివారించినట్లూ అంతా ఎక్కడను కొనిపోతారో అని కామ్రేడ్ చక్రధర్ చాలా బాధపడ్డాడు. ఎక్కసం పట్టలేక "సుశీల పార్టీలోచేరింది, పార్టీనిధికి తన గొలుసు ఇచ్చింది" అని కామ్రేడ్ చక్రధర్ సమాధానం చెప్పాడు.

శివకామయ్య నిశ్చేష్టుడైనాడు. ఇలా జరుగుతుందని తాను కలలో అయినా అనుకోలేదు. బావమరిది భార్యా లేచి పోయిన తరవాత బావమరిది బావిలో పడి తన ఆత్మగౌరవాన్ని కాపాడుకోటానికి ఆత్మహత్య చేసుకున్నప్పట్నుంచీ సుశీలను ఎంతో గారాబంగా పెంచుతూవచ్చాడు. పెండ్లాం లేచిపోతే తన ఆత్మగౌరవానికి ఏం లోటు వచ్చిందో శివకామయ్య బావమరిదే గాదు ఈనాటికీ ఆ గ్రామస్థులు ఎవ్వరూ తెలుసుకోలేదు. అతను ఆత్మహత్య చేసుకోవడంవల్ల ఆ ఆత్మగౌరవం ఎలా మొక్కపోకుండా నిల్చిందీ ఈనాటికీ ఎవ్వరూ చెప్పలేరు.

సుశీలమాత్రం లోకంలో ఉన్న వాళ్ళందరి సానుభూతినీ పొందింది. అందువల్ల సుశీలకు ఒరిగిందేమీలేదు. కాని శివకామయ్యమాత్రం సుశీలకూడా తన బావమరిది మాదిరిగానే చాలా పౌరుషం, ఆత్మాభిమానం కలదని అనుకోవడం జరిగింది. సుశీలకు పౌరుషం,



"చూడు, వీడికి స్వాతంత్ర్యంగాలి సోకింది!"

ఆత్మాభిమానం లేకపోలేదు. శివకామయ్య మాత్రం విజయదశమినాడు జరిగిన ఈ విషాదసంఘటనను ప్రత్యక్షంగా చూచిన తరవాత సుశీలతల్లి తన బావమరిది కొంపతీసినట్లే సుశీల తనకొంప తీసిందనుకున్నాడు.

సుశీల చక్రధర్‌ను ఏనాటికైనా పార్టీ నుంచి తప్పించి మంచిమార్గంలో పెడుతుందని శివకామయ్య మొదట్నించీ ఆశపడ్డాడు. సుశీల నిజంగా అంత తెలివితేటలు కలదికూడా. విషయ పరిజ్ఞానంతోపాటు లోకజ్ఞానంకూడా ఉంది.

అయితేనేం! ఇప్పుడు శివకామయ్య ఆశలన్నీ నిరాశలైనయ్. 'హతోస్మి' అని అరుగుమీద కూలబడ్డాడు. సుశీల సమాధానంచెప్పేవరకూ ఇంత మనోవేదనపడకుండా ఆగిఉంటే ఎవరికీ బాధలేకపోను.

"మామా, మామా! బావ చెప్పింది కొంతే నిజం. నేను పార్టీలో చేరలేదు. పార్టీనిధికి డబ్బు కావాలని గాంధి చౌక్‌లో కొంతసేపు గొంతు చించుకుంటే ఎవ్వరూ ఒక్క దమ్మిడీ ఇవ్వలేదు. బావ మర్యాద కాస్తా పోతుందని ఈ గొలుసు తీసుకోమని ఇచ్చాను." అని సుశీల మెల్లిగా చెప్పింది. శివకామయ్య కొంతవరకు తెప్పరిల్లుకున్నాడు.

పంతులు వేంకటశాస్త్రి బ్రతుకు జీవుడా అని బయటపడ్డాడు. పిల్లలందరూ ఎవరింటికి వాళ్లు వెళ్లిపోయారు. విజయదశమి ఒక్క సుశీ

లకూ, కాన్ఫ్రేమేడ్ చక్రధర్‌కుమాత్రం సంతోషదాయకమైంది. ఆ రోజే శివ కామయ్య, మహాలక్ష్మమ్మ పెద్దకొడుకు పెండ్లి చేసెయ్యాలని నిశ్చయించుకున్నారు. ఫలితం ఏమిటో తెలియక పోయినా శ్రీధర్‌మాత్రం చాలా విచార పడ్డాడు.

* * *

ఆయిదేళ్లు సుశీల, చక్రధర్ ఆ వూళ్లోనే కాపరంచేశారు. అయితే తమవల్ల అత్తమామలకి ఏ ఇబ్బందీ కలగ్గూడదని ఊరుబయట తోటలో కాపరం పెట్టారు. కొడుకూ కోడలూ కళ్లెదుట కనపడుతున్నందుకే శివకామయ్య సంతోషిస్తూ ఉండేవాడు. సుశీల లేకపోతే కొడుకు దేశాలమీద పొయ్యేవాడనీ, ఏ దళంలోనో చేరి చేయరాని పనులుచేసి ఎవరిచేతుల్లోనో చచ్చిపోయేవాడనీ శివ కామయ్య నమ్మకం. ఆ ప్రమాదాన్ని సుశీలే తప్పించిందని సుశీలంటే ప్రాణం విడుస్తూ సుశీలమాటకి అడ్డంచెప్పేవాడు గాదు.

యదార్థంకూడా అంతే. చక్రధర్‌కు పార్టీ అంటే ఎంత అభిమానమో, గౌరవమో, నమ్మకమో, సుశీలన్నా అంత అభిమానమూ, గౌరవమూ, ప్రేమా ఉంది. ఏ విషయంలోనూ తొందరపడదు. ముందువెనకలు ఆలోచించి ఎవ్వరికీ ఏ ప్రమాదమూ జరక్కుండా చక్రధర్ వ్యవహారాలన్నీ చక్కదిద్దుతూవుండేది. వాదంలోకి దిగితే అవతలి వాళ్లెంతవాళ్లయినా తన వాదాన్నే నెగ్గించుకునేది. ఇది చూస్తూ, ఈ వాదన్లు వింటున్న చక్రధర్‌లో అతనికి తెలియకుండానే మార్పువచ్చింది. సుశీల సలహాల్ని పార్టీ ఆదేశాల్ని పాలించినట్లే పాలిస్తూ ఉండేవాడు.

"అవునుబావా. గాంధిగారు ఏ ఆయుధాలూలేకుండా, సరియైన శిక్షణన్నా లేని ప్రజాబలంతో బ్రిటిష్‌వాళ్ళను దేశం నుంచి పంపించివేశాడంటే మీరు వొప్పుకోరు; బాగానే ఉంది. పరిస్థితులు దుర్భరమై, ఆ పరిస్థితుల ప్రభావానికి లోబడే బ్రిటిష్‌వారు, మీరన్నట్లు, మన దేశంవదలి పోయారనుకుందాం. అయితే ఆ పరిస్థితుల్ని ఎవరు కల్పించారు? దౌర్జన్యాలు చేయడంవల్లా, తోటివారి ప్రాణాలు తీయడంవల్లా కాంగ్రెస్‌వారు కల్పించలేదుగదా?"

"అయితే ఏమంటావ్" అని చక్రధర్ సుశీల వాదానికి అడ్డుతగిలాడు.

"నేనేమీ అనడంలేదు. అలాంటి బ్రిటిష్ సామ్రాజ్యం అస్తమించడానికి ఏర్పడ్డ పరిస్థితులు, దేశంలో ధనికవాదం అంతరించడానికిమాత్రం ఏర్పడవా? మీ మార్క్స్ అన్నట్లే వ్యక్తులు ఆ పరిస్థితులను చిరకాలం నివారించలేరు గదా. మనం వాటిని త్వరగా కల్పించడానికి ప్రయత్నిస్తాం. మనప్రయత్నాలు సఫలంకాకుండా చేయడానికి అవతలి వాళ్ళు ప్రయత్నిస్తారు. ఫలితం జన నాశనం. మనం ఎవరికోసరం ఇంత చేస్తున్నామో వాళ్ళే పోయింతరవాత ఈ ప్రయత్నం ఫలించేం, ఫలించకేం? మనమూలాన ఎంతమంది అమాయిక ప్రజలు పోలీసు జులుంకు ఆహుతి అవు

తున్నారో చూడండి. పైగా రష్యాలో కూడా వ్యక్తిగతదౌర్జన్యాలవల్ల లాభం లేదని కామ్రేడ్ లెనిన్ చెప్పాడుగదా: ఇప్పుడు మనమెందుకు ఇలా హత్యలు చేయడం?" అంది సుశీల.

"ఇవన్నీ ఎవరు చెప్పారో నీకు? నీకీ సిద్ధాంతాలన్నీ ఎలా తెలుసు" అని శ్రీధర్ ఎదురుప్రశ్న వేశాడు.

"నీ పుస్తకాల్లో ఉన్నవే ఈ సంగతులన్నీ. నువ్వు అసలు పుస్తకాలుమానేసి పార్టీ కాగితాలు చదివి ఇంతపని చేస్తున్నావు. నిజం విచారిస్తే ఇవాళ పార్టీచేస్తున్నదంతా మూలసిద్ధాంతాలను పట్టిచూస్తే శుద్ధతప్పుగా కనిపిస్తుంది. నీమటుకు నువ్వు ఆలోచించుకో" అని సుశీల సమాధానం చెప్పేసరికి శ్రీధర్‌కు ఊపిరాడలేదు. అలాగే కూర్చుండిపోయాడు. ఇద్దరూ ఒకరిమొహం ఒకరు చూచుకోవడంలో ఎన్నిగంటలు గడిచిపోయినయ్యో ఎవరికీ తెలీదు.

"సుశీలా నువ్వుచెప్పిందంతా బాగానే వుంది. నిజమే. ప్రజలు పార్టీసిద్ధాంతాలను అభిమానించినా ఆప్రకారం రాజ్యాంగం సాగాలని అంటున్నా పార్టీకి దూరంగా పోతున్నారు. ఈసంగతి పైవాళ్ళకిచెప్తే వెలేస్తారు. పార్టీసిద్ధాంతాల్లో నమ్మకం ఉండి విధానంలో విశ్వాసంలేకపోతే ఏంచేయడం?" అని అడిగాడు శ్రీధర్. సమాధానం ఇవ్వకుండానే వ్యవహారం నడిపింది సుశీల.

* * *

"ఏం బావా, ఎట్లా ఉంటున్నది జెయిలు? నీ అంతట నువ్వు వీళ్లకి చిక్కిపోయినావు గదా! రవీంద్రనాథ్ టాగూర్ చెప్పినట్లు నిజంగా మామగారిల్లల్లే ఉండి ఉండాలి." అంది సుశీల కామ్రేడ్ చక్రధర్‌ను చూడ్డానికి వెళ్లిన మొదటిసారి. తను ఒప్పించి చక్రధర్‌ను పార్టీనుంచి మానిపించింది. ఇలా అధికార్లకు అందిపోతే, సీతామ్మవారు అగ్నిపరీక్షనుంచి బయటపడ్డట్టు, తన బావ బయటపడతాడనీ ఇక ఆతరవాత ఎవరి బాధా ఉండదనీ ఆశ పడింది.

"అత్తలేని మామగారిల్లల్లే ఉంది. ఇంతకంటే యమలోకమైనా మేలు. నేను మారిపోయినానంటే వీళ్లెవ్వరూ నమ్మరు: నమ్మినా నమ్మనట్లే నటిస్తారు. పార్టీ రహస్యాలు చెప్పమంటారు. నేనేపాపమూ ఎరగనంటే [illegible] మళ్లీ నువ్వు వచ్చిందాకా ఉంటానని నమ్మకం నాకులేదు. మొత్తంమీద నా బాధ ఎవరికీ లేకుండా చేశావు. నువ్వన్నా సుఖపడు. నేను బ్రతికి బయట ఉన్నంత కాలం ఎవ్వరికీ ఏ బాధా కల్గించలేదు. నన్నుచూచి వాళ్లే భయపడి బాధపడే వాళ్లు. అందుకు నేనే బాధ్యుడ్ని అని నువ్వు ఇలాచేశావు. ఎవరు రైటో క్రమంగా నీకే తెలుస్తుంది." అన్నాడు చక్రధర్ ఉగ్రుడై ఉద్రేకంతో.

సుశీల విభ్రాంతపోయింది. తన బావకు ఇలాంటి స్థితివస్తుందని కలలో అయినా అనుకోలేదు. పార్టీనుండి బయటపడి సాత్వికమార్గాన్ని అనుసరించుదా మనుకున్నవాడ్ని ఇలా బాధించి మార్పుకు అవకాశంలేకుండా అధికార్లు చేస్తారని, సుశీలమాత్రం ఎలా అను

కుంటుంది? ఇలా జరిగిందంటే నమ్మలేకపోయింది. కాని చక్రధర్ ఆ స్థితిలో అబద్ధం ఎందుకు చెప్పాలి? యదార్థం దాచి, ఏవో కల్పించి చెప్పవలసిన అగత్యం అతనికిలేదు.


"బావా; నీకేం భయంలేదు. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డంవేస్తాను. నీకేం జరిగినా దానికంతటికీ నాదే గదా బాధ్యత. నువ్వు ధైర్యంగా ఉండు. భయపడ్డావంటే చచ్చిన పామును చావగొట్టినట్లు చేస్తారు. నే వస్తాను. మళ్లీ వస్తాను. అందాకా ఓపికపట్టు. ప్రాణాలను చిక్కబట్టుకొని ఉండు" అని చెప్పి సుశీల ఇంటికి పోయింది. ఆ వూళ్లో సుశీలకు ఇల్లేది? ఆ పూటకూళ్లమ్మ ఇల్లే ఇల్లు. రాత్రంతా ఆలోచనలతోనే సరిపోయింది. ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు బావను రక్షించుకుందామా అనే ఆందోళనె తెల్లవార్చింది.

ఎవ్వరూ లేవకముందే లేచి పనులన్నీ ముగించుకొని బయల్దేరడానికి సిద్ధంగా కూర్చుంది. "సుశీలమ్మగారు ఎక్కడుంటారు?'' అని వాకిట్లో ఎవరో ఎవర్నో అడుగుతున్నట్లు విన్పించింది. గదిలోంచి వీధిలోకి ఒక్క గంతు వేసింది. ఎర్రటోపీ చూచి వణికిపోయింది. వాడివ్వబోయే ఉత్తరాన్ని అమాంతంలాక్కుంది. "సుశీలా, నేను చెప్తే విన్నావుకాదు. సత్యానికీ ధర్మానికీ ఇది కాలంగాదు. నిజంచెప్తే నమ్మరు. అబద్ధాలుచెప్పి ప్రాణం రక్షించుకుంటే ఆత్మ నాశనమైపోతుంది. ఆత్మ అంతరించింతరవాత మనం బ్రతికేం చచ్చేం. ఆత్మను రక్షించుకోవాలంటే ప్రాణాన్ని బలి ఇవ్వాలి. అదే ఈరాత్రి నేనుచేసిన పని మనోవేదనను భరించకలిగాను. కాని ఈ శారీరక బాధలను ఇక ఒక్కక్షణంకూడా భరించలేకుండా ఉన్నాను. నీ విద్యుక్తధర్మం ఏమిటో నీకుతెలుసు."

"బావా నీప్రాణాన్ని నేను రక్షింపలేక పోయాను. అవును. బుజావర్తనులకు ఇది కాలంగాదు. నువ్వు నీ ఆత్మను రక్షించుకోకలిగావు. ఆ ఆత్మకు నేను శాంతి చేకూరుస్తాను.'' అని అప్రయత్నంగా ఆ ఉత్తరంలో భాగంగానే చదివేసింది.

అప్పుడే అక్కడ్నించి బయల్దేరింది. ఏమైందో ఈనాటికీ ఎవరికీ తెలియదు. పల్నాడులో నాయకురాలు తిరిగి వెలిసింది అనుకుంటూ ఉంటారు. కాని చూచినవాళ్ళు ఎవ్వరూలేరు. కంటబడితే కన్పించకుండాపోతుంది అనీ, అందుకే అవుపించదనీ మాత్రం అంటారు.

శివకామయ్య సకుటుంబంగా సుశీల బృందంలో చేరాడనీ, ఆ వూరువాళ్లంతా సుశీల శిష్యకోటి అయినారనీ లోకం కోడై కూస్తున్నది. అయితే దీనికంతటికీ చక్రధరే కారణం అని చాలామంది అనుకుంటూ ఉంటారు. శివకామయ్య మాత్రం సుశీలపెట్టిన పరీక్షలో అధికారులు నెగ్గలేకపోవడమే కారణం అంటాడు. నిజంనిలకడమీద తెలుస్తుంది.



# భావపరిచయపోటీ

(సెప్టంబరు నెల పోటీకి సమాధానం)



బహుమతి మొత్తం రు. 10-0-0

ఈ క్రింది వ్యాఖ్య పంపినవారికి యివ్వడమైనది.

| వ్యాఖ్య : | పంపినవారు : |
|---|---|
| "ఇంట్లో భారం - కంట్లో కారం." | దుగ్గిరాల పూర్ణయ్య, అంగలూరు |

# ముఖ్యముగా గమనింపవలసిన విషయము ఏది?




★ ఆకలైనపుడు చేతికందినవానిని భుజించి, ఆరోగ్యము పోగొట్టుకొని మందుల కోసం వృధాగా డబ్బును వ్యయముచేయు విధముననే కొందరు సరసముగ దొరుకునట్టి కృత్రిమపు నస్యములను కొని ఉపయోగించి కాలక్రమమున తల నొప్పి, మైకము, ఉత్సాహములేమి, నిద్రలేమి, నరముల పటుత్వము తగ్గుట, దృష్టి మాంద్యము మున్నగు వ్యాధులకులోనై ఆర్జించిన ధనమును వెచ్చించు కొంటున్నారు.

★ కృత్రిమపు నస్యముల ఉపయోగించుటవల్లనే ఈ వ్యాధులు వచ్చినవి, లేక వచ్చుచున్నవి అనుదాన్ని ప్రజలు గుర్తించటంలేదు. ఏలన, ఈ కృత్రిమపు నస్యముల ఉపయోగించుటచే కలుగు కీడులు బయటకు తెలియుటలేదు. కాని యీ కీడులను గ్రహించిన జడ్జీలు, డాక్టరులు మరియు లక్షలకొలది జనము "శ్రీ అంబాళ్ మద్రాసు నస్యం" ఒక్కదానిని మాత్రమే ఉపయోగించి ఆనందాన్ని పొందుతున్నారు. కృత్రిమపు నస్యాలను కన్నెత్తియైన చూడటంలేదు.

★ శ్రీ అంబాళ్ పట్టణపునస్యము కారమునకై యెట్టి రసాయనపు వస్తువును కలుపబడినది కాదు. నెలరోజులుంచినను గుణమున మార్పువుండదు. నాసికకు హితమును, మెదడునకు ఉత్సాహమును కలిగింపదగినది. నేడే పరీక్షించి, దాని గుణమును మీ మిత్రులకు తెలుపుడు.

## శ్రీ అంబాళ్ & కంపెనీ

2/13, పెరుమాళ్ళుగుడితోట 1వ వీధి,

తపాలాపెట్టె నెం. 3, :: జి. టి. మద్రాసు.


WE REPRESENT

**M/s. SAMUEL JONES & CO. (EXPORT) LTD.,**

LONDON

MANUFACTURERS OF

# "BUTTERFLY"



BRAND PAPERS

WE SOLICIT INDENTS FOR
ALL KINDS OF PAPERS

**PLEASE CONSULT US FOR YOUR REQUIREMENTS OF PAPER AND PRINTING MATERIALS**

**We hold stocks of:**

- PRINTING INKS
- PRINTING MACHINES &
- ALLIED PRODUCTS

**Phone: 3519** **Tel: "PRESUNDRY"**

# K. ORR & COMPANY

**40, Chinnathambi Street :: Madras-1**

## ది మైసూర్ ఫర్టిలైజర్ కంపెనీ, వారి

# కమలము మార్కు ఎరువులు

నాణ్యతకు సరఫరాకు నమ్మతగినవి!

మీ భూములను సారవంతమొనర్చి, సస్య సమృద్ధిగల్గించి ఆహారకొరతను తీరుస్తాయి.

దేశావసరమే ఆహారం!

మీ అవసరమే కమలము మార్కు ఎరువులు

ప్రధాన కార్యాలయం :

31-A నార్త్ బీచ్ రోడ్డు, మద్రాసు-1.

బ్రాంచీలు : ఉదకమండలం, కూనూరు, మెట్టుపాళయం, ఈరోడ్, కుప్పం, బెంగుళూరు.

ఏజన్సీలు రాజధాని అంతటా కలవు



రక్షణ కొరకు వెతికే మానవునకు

జవాబు ఇన్స్యూరెన్సే.

రక్షణ అనగా—

సంపాదన లేనప్పుడు సమకూరే ఆదాయము;

మరణానంతరము ఆశ్రితులకు ఉపాధి.

## ది యునైటెడ్ ఇండియా రిటైర్మెంటు ఇన్కమ్ స్కీము

వలన

1. 55-60 సంవత్సరాల వయస్సునుండి రిటైర్మెంటు కాలములో 15 సంవత్సరాలు ప్రతి నెలా నికర రాబడికి;
2. లేక తభాలవారీగాకాక ఒకేసారి మొత్తంగా లభ్యవడేందుకు;
3. గడువుకాలానికి ముందే గతించినచో వారసులకు పై మొత్తాలు సంక్రమించే

అవకాశాలు కలవు

పూర్తి వివరాలకు:


ది యునైటెడ్ ఇండియా లైఫ్ ఇన్స్యూరెన్సు కంపెనీ లిమిటెడ్,

హెడ్డాఫీసు: "యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగ్"

పోస్టు బాక్సు నెం. 281 :: మద్రాసు-1.


# PAPER CUTTING MACHINE

**SIZE 24 INCHES**




This machine is constructed according to latest requirements. Wheel system. Diagonal Cutting movement Double Gearing Draw Rods etc. Height of clamp 5 inches.


**TREADLE PERFORATOR**
Size 18 Inches




**HARD PRESS**
Size of Plates 12" x 18"



**LEAD & RULE CUTTER**
Size 9 Inches



**MITREING MACHINE**
Indispensable to printers



**THE MADRAS TYPE FOUNDRY** Post Box No. 1546.
38, JONES ST. G. T., MADRAS.

# యం. సి. అప్పాస్వామి చెట్టి

## అండ్ కంపెనీ,

**14, జోన్స్ స్ట్రీట్, మన్నడి - మద్రాసు-1.**

టెలిఫోను : 3202

★

**కలర్, హాఫ్‌టోన్, లైన్ బ్లాకులను అత్యుత్తమంగా తయారుచేయుటలో పేరుగాంచిన నిపుణులు**

★

ఆంధ్రజ్యోతి, చందమామ పత్రికలలో ప్రకటించబడుచున్న 'రామాయణం' 'కృష్ణలీల' త్రివర్ణచిత్రములూ, ఇంకా యితర త్రివర్ణ చిత్రములన్నీ మేము తయారుచేసినవే.

# ఆంధ్ర ఇన్సూరెన్సు కంపెనీ,

## లిమిటెడ్

ప్రధాన కార్యాలయం: మచిలీపట్టణము

★

భీమా వ్యాపారములో 25 ఏండ్లుగా అతి సమర్థతతో దిగ్విజయముగా
7.00,000 పాలసీదార్లను సేవించి రజతోత్సవమును జరిపిన సంస్థ

| | | |
|---|---|---|
| అమలు జరిపిన వ్యాపారము మొత్తము | .... | రు. 8 కోట్లు |
| జారీ చేయబడిన మొత్తము | .... | రు. 1 కోటి, 65 లక్షలు |
| సాలీనా రాబడి .... | .... | రు. 40 లక్షలకు పైన |
| చెల్లింపబడిన మొత్తము .... | .... | రు. 45 లక్షలు |

జీవిత భీమాతోపాటు అగ్ని, మోటారు, ఇతర
ప్రమాదములకుకూడా పట్టాలివ్వబడును

★

**మా బ్రాంచి ఆఫీసులు:**

మదరాసు, బొంబాయి, కలకత్తా, నాగపూరు, ఢిల్లీ,
బెంగుళూరు, బెల్గాం, అనంతపురం, సికింద్రాబాదు,
కోయంబత్తూరు, బరంపురం, ఎర్నాకులం, విజయవాడ,
గుంటూరు, జంషెడ్పురము, విశాఖపట్టణము, మంగళూరు,
రాజమహేంద్రవరము, డిబ్రూగర్ (అస్సాం)

# NELSON & Co.

(THE FINE-ART TYPE FOUNDRY)

*Established 1916*

* * *

## Type Founders
and
## Printers' Engineers

MANUFACTURERS OF:

Printing Types in English, Telugu, Tamil, Canarese, Hindi, Sanskrit, Devanagaree, Urudu, Malayalam — Etc. —

SUPPLIERS OF:—

New and Rebuilt Treadles, Wharfedales, Paper Cutting Machines, Perforators, Miters, Wire Stitching Machines, Lead and Rule Cutters, Brass Rules, Printing Inks, Roller Compositions, Wooden Materials, Etc.

Phone: 2722 Grams: 'NELSONCO'

**62, Swami Pillai St., :: Choolai, MADRAS**

**Post Box No. 452**

*Our Factory at:*

No. [illegible], NEW KODAMBAKKAM ROAD,

**AMINJIKARAI :: MADRAS**


ఈ నెలలోనే విడుదల.
శ్రీమూర్తివారి
ఆకాశరాజు
కుమారి. గౌరీనాథశాస్త్రి. సి.యస్. ఆర్.
కనకం. శ్రీరామమూర్తి.
డైరెక్టర్....
జె. సిన్హా
సరస్వతీటాకీస్, లిమిటెడ్
విజయవాడ.... గుంటకల్.
SARMA IVS

## ఈ సంచికలో కొందరు రచయితలు

కుటుంబరావు — కామేశ్వరరావు

సహజానంద — పాలంకి

నార్ల — విశాలాక్షి

# ఆంధ్ర జ్యోతి

ప్రఖ్యాత మాసపత్రిక

సాలుచందా 4–8–0 - రెండేండ్లకు 8–0–0

ఆఫీసు : 37, అపారప్పన్‌వీధి :: మద్రాసు-1






## రు. 500 బహుమానము
## ఉమా గోల్డు కవరింగు వర్క్సు

**ఉమా మహల్ :: మచిలీపట్నము**

ఉమా గోల్డు కవరింగు వర్క్సు పోస్టాఫీసు.

అసలు బంగారు రేకు లోహముపైన అంటించి (Gold Sheet Welding on Metal) తయారు చేయబడినవి. కాదని రుజువు చేసినవారికి రు. 500 బహుమానమివ్వబడును. మేము తయారు చేయు ప్రతివస్తువు ప్యాకింగు పైన "ఉమా" అను ఇంగ్లీషు అక్షరములు గుర్తించి కొనవలెను. బంగారు వన్నె 10 సంవత్సరములు గ్యారంటీ.

* * *

పరీక్ష చేయగోరువారు ఉమా ఆభరణములను మహా ద్రావకములో వేసిన 5 నిమిషములకే బంగారము రేకు వెడలివచ్చును. ఈ విధముగా పరీక్ష చేసినవారు అనేకమంది మాకు సర్టిఫికేట్లు యిచ్చియున్నారు. 800 డిజయినుల క్యాటలాగు ఉచితముగా పంపబడును. ఇతర దేశములకు క్యాటలాగు ధరలమీద 25% అధికము.

*N.B.*—వస్తువుల వి. పి. పార్శిలు చార్జి 0-15-0 మాత్రమే అగును

Tel : "UMA" MASULIPATAM

# ఈ 3 సూత్రాల సేవింగ్సు పథకాన్ని మీ భద్రతా ప్రణాళికగా చేసుకోండి

**1.** మీ క్షేమం కోసమే, ప్రస్తుతావసరాలకు మీరు ఎంత సెలవు చేయవలసి ఉన్నా మీరు ఎదురుచూడని కొన్ని అవసరాలకై కొంత సొమ్మును పొదుపుచేయక తప్పదు. పోస్టు ఆఫీసు సేవింగ్సు బ్యాంకు ఇట్టి పొదుపును ప్రోత్సహించి, మీరు పొదుపు చేసే చిన్న మొత్తాలకు ఎంతో అందుబాటుగా ఉండే బ్యాంకింగ్ సౌకర్యాన్ని కలిగిస్తుంది. దీనిపై సాలుకు 2% చొప్పున వడ్డీ చేర్చబడుతుంది. రు. 200/-కు మించిన నిల్వలపై ఆదాయపు పన్ను విధింపు ఉండదు. మీ సొమ్ము భద్రతకు హామీ కలదు. పైగా మీ ప్రత్యేకావసరాలకు కావలసిన సొమ్మును కావలసినప్పుడు మీ డిపాజిట్ల నుంచి తీసుకోవచ్చును.

**2.** మీ క్షేమం కోసమే, భావికాలావసరాలకై మీరు తగినంతగా జాగ్రత్తపడలసి ఉంటుంది. మీ సొమ్మును నేషనల్ సేవింగ్సు సర్టిఫికేట్లపై పెట్టుబడి పెట్టండి. ఇట్టి పెట్టుబడే నేడు ప్రజాప్రసిద్ధి గాంచినది. దీనికి ప్రభుత్వ హామీ కలదు. దీనిపై హెచ్చు రేటు వడ్డీ లభిస్తుంది. పైగా దీనిపై లభించే వడ్డీపై ఆదాయపు పన్ను లేకపోవడమేగాక, మీ మొత్తం ఆదాయం లెక్కింపు విషయంలో ఇది లెక్కలోకి రాదు. నేడు పెట్టుబడి పెట్టిన ప్రతి రు. **100/-**నూ **12** ఏళ్లలో రు. **150/-** ఔతుంది. ఇవిగాక, **5** ఏళ్ల **7** ఏళ్ల సర్టిఫికేట్లుకూడా కలవు. వీటిపై వరుసగా **3%; 3½%**-కు కొంచెం అధికంగా వడ్డీ లభిస్తుంది. అవసరమైనప్పుడు సర్టిఫికేట్లు ఫలించుటకు పూర్వమే వాటిని మీరు సొమ్ముగా చేసుకోవచ్చును. వాటిని మీరు సులభంగా కొని, భద్రంగా ఉంచుకోవచ్చును.

**3.** మీ క్షేమం కోసమే, దేశైశ్వర్యాభ్యున్నతికై మీరు జాతీయాభ్యుదయ కార్యకలాపాలకు ధనసహాయం చేయవలసి ఉంటుంది. కనుక మీరు పొదుపు చేసిన పెద్దమొత్తాలను జాతీయాభ్యున్నతి ప్రణాళికల నిర్వహణకై వినియోగించండి. ప్రభుత్వంవారు ఎప్పటికప్పుడు వసూలు చేసే ఋణాల సందర్భంలో ధారాళంగా ధనసహాయం చేయడంకన్న ఐశ్వర్యాభ్యున్నతులకు సోపానాలు ఏర్పరుచుకునేవారికి ఉత్తమమైన పెట్టుబడి మార్గం మరొకటి లేదు.

వీలైనంత పొదుపు చేయండి.

బాగా ఆలోచించి

**పెట్టుబడి పెట్టండి**

భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రి కార్యాలయంలోని నేషనల్ సేవింగ్సు కమిషనర్ జారీచేసిన ప్రకటన

**AC-226 TG**









ఆరోగ్యప్రదాయిని
సంతానకల్పవల్లి

# లోధ్ర

**కేసరీ కుటీరం లిమిటెడ్,**
రాయపేట :: మద్రాసు 14.





ఉబ్బసము
శాశ్వతముగ
నయమగును

## పురోహిత్

# శ్వాసహారి

గత ఇరువది యెనిమిది ఏండ్ల నుండి వైద్య ప్రసిద్ధిగాంచిన శాస్త్రోక్తమగు ఉబ్బస నివారిణి ఇది ఒక్కటే. దీనిని సేవింప నారంభించగానే కఫము పలుచ బడును. ఆయాసము తగ్గిపోవును. ఆకలి వృద్ధియగును. ఊపిరి తిత్తులు బలపడును. త్వరలోనే ఉబ్బసము పూర్తిగా నివారణ మగును.

3 ఔ, 6 ఔ., 12 ఔ. ల సీసాలలో
రూ 3-12-0; రూ 6-8-0; రూ 11-0-0లకు


మంచి కెమిస్టులందరివద్దను దొరకును
లేదా మాకు వ్రాయండి



**డాక్టరు-పురోహిత్ ఫార్మసి**
కొల్హాపూరు (యమ్. యస్. యమ్. రైల్వే)

# టెలతో ఆటలు---నెం 7

బాలా! ఈదిగువ చదరంలోని అక్షరాలు నింపి, మాటలు పూర్తిచేసి ఉంచుకో! వచ్చే నెల 'బాల'లో సరియైన సమాధానం చూడు.




## ఆధారాలు

| అడ్డము | నిలువు |
|---|---|
| 1. శరీరములో ఒకభాగము. | 1. దీనిని నమ్మలేము. |
| 4. స్త్రీ | 2. తీగ |
| 6. సమయము | 3. ఈ కాలువలోని నీరుతీయకు! |
| 7. వాటి (అవే) | 5. పౌరుషము. |
| 8. శత్రువు | 7. సుగ్రీవుని అన్న |
| 10. ... వలన పనులు సాధించవచ్చును. | 8. సరదా |
| 11. వ్రతము | 9. ఇటలీ ముఖ్యపట్టణము |
| 13. పచ్చడిబద్దలు బలేఇది | 12. ఆంజనేయుడు |
| 16. మోక్షము | 14. చిన్న |
| 17. ఈ కొండమీద కోతులు మెండు! | 15. ఇదికూడా పన్నెండే. |

## ·టలతో ఆటలు - 6
### (జవాబు)

అడ్డము : 1. కల, 3. బాలకుడు, 6. వక్క, 7. డిసా, 8. ముదము, 9. అడవి, అటవి, 12. రామ, 14. సీల, 15. కరములు, 16 సాము.

నిలువు : 1. కవనము, 2. లక్క, 3. బాకాలు, బాజాలు, 4. కుడి, 5. డునా, 10. విమలము, 11. రిక్కలు, చుక్కలు, 12 రాక, 13 మర, 14. సీసా.

### సైనుబోర్డు కంపెనీ (జవాబు)

రామారావే నిజమైన మంచి పెయింటరయితే, ఆబోర్డు "ముత్యం" గారి చేత వ్రాయించేదెందుకు? రామారావుకి పెయింటు చేయడం రాదన్నమాట. అంచేత ఎవ్వరూ అతనికి పనిఇయ్యలేదు.

### సెలవుల్లో సరదాలు (జవాబు)

జతలు: చింతపిక్కలు 1, 4, 5, 10, 14, 15, 19, 26. 27, 34, 38, 39, 43, 48, 49, 52 గళ్లలో పెడితే సరి.

ప్రశ్నల వర్షం: 1. అన్ని నెలలు 2. బొగ్గు; 3. అగ్గి పుల్ల; 4. డిక్షనరీలో; 5. సలహా: 6. ఆడదోమలు; 7. రెక్కల శబ్దం; 8. ఊపిరి; 9. రెండూ కాదు; నూనెతో కలుపుతాను.

చెవులపిల్లులు –
5 దో పిల్లి, 6 ది

### పొడుపుకథలు (జవాబులు)

1. చెఱుకుకర్ర; 2. చీనీపంచదార 3. చేపలు; 4. మఱ్ఱిచెట్టు; 5. పనసచెట్టు; 6. అక్కలకర్ర; 7. గ్రామఫోను; 8. సౌధము; 9. గబ్బిలము; 10. మిరపపండ్లు.

### మాటలు నేర్చుకో!

1. కనకము; 2. కన్నడము; 3. కడియము; 4. కరణము; 5. కళ్యాణము; 6. కట్టడము; 7. కర్పూరము: 8. కటకము; 9. కవిత్వము; 10. కర్కటము; 11. కమలము ; 12. కర్తవ్యము; 13. కమఠము; 14. కపటము; 15. కపోతము.






Edited and Published by N.Raghava Rao & Printed by N.K
at the "BALA PRESS" 170 P...